

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మళ్లీ గేట్లెత్తారు

భారీగా వరద ప్రవాహం

శ్రీశైలంలో 10 గేట్లు, సాగర్‌లో గేట్లన్నీ ఎత్తివేత

3.14 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

పులిచింతల నుంచి దిగువకు 2,71,983 క్యూసెక్కులు

బెజవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 1.98 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి 3

శుక్రవారం | 30-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 136 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 2.25 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పునర్వసు సా. 5.56 తదుపరి పుష్యమి; వర్జ్యం: శేషం ఉ. 6.58, రా. 2.30-4.13, దుర్ముహూర్తం: ఉ. 8.32-9.22, మ. 12.40-1.29; అమృతఘడియలు: మ. 3.24-5.05; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఉచ్చు బిగుస్తోంది!

ముంబై నటి కేసుపై సర్కారు సీరియస్

విచారణాధికారిగా ఏసీపీ స్రవంతి రాయ్

నేడు విజయవాడకు కాదంబరి జెత్వానీ

వేధింపులపై వాంగ్మూలం ఇచ్చే అవకాశం

1నే ఏపీ పోలీసులపై ముంబైలో ఫిర్యాదు

అక్రమ అరెస్టుపై విచారణకు వినతి

తాజాగా బెజవాడ సీపీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు

'నన్ను బ్లాక్‌మెయిల్ చేసి, బెదిరించి నా పొలాన్ని రాయించుకుంది' అంటూ కాదంబరి జెత్వానీపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌రావు ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకు ఆధారంగా ఓ డాక్యుమెంట్‌ను కూడా 'సృష్టించారు'. అసలు విషయం ఏవిటంటే.. 2018లో రాసుకున్నట్లుగా ఉన్న డాక్యుమెంట్‌పై.. 2020లో ముంబైలోని జుహూలో కాదంబరి కొన్న ఫ్లాట్ చిరునామా చూపించారు. అంతేకాదు... ఆ డాక్యుమెంట్ పేపర్‌ను స్టాంప్ వెండర్ నుంచి 2023లో కొన్నట్లు దానిపై స్పష్టంగా ఉంది. ఏపీ పోలీసులు తనపై పెట్టింది తప్పుడు కేసు అనేందుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని కాదంబరి ప్రశ్నిస్తున్నారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

'జగన్ ఆదేశించారు... మేం పాటిస్తాం' అంటూ అడ్డగోలు పనులు చేసిన పోలీసు అధికారుల చుట్టూ బలంగా ఉచ్చు బిగుస్తోంది. ముంబై నటి, వైద్యురాలు కాదంబరి జెత్వానీని తప్పుడు కేసులో ఇరికించి, ఆమె కుటుంబ సభ్యులనూ అరెస్టు చేసి, అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలు పెట్టిన కేసులో సీనియర్ ఐపీఎస్‌ల పాత్ర తేల్చేందుకు రంగం సిద్ధమైంది. రెండు తెలుగురాష్ట్రాలతోపాటు... ముంబైలో, సినీ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అటు బాధితురాలు కాదంబరి కూడా అప్పటి ఏపీ పోలీసులపై ఈనెల 1వ తేదీనే



విచారణాధికారి ఏసీపీ స్రవంతి రాయ్

మిగతా 12వ పేజీలో...

రాణా.. రావా?

మూడు రోజుల నుంచి డీజీపీ ఆఫీసుకు రాని కాంతి రాణా 12

డీజీపీ ఆదేశాలు లెక్కచేయని ఐపీఎస్‌లపై శాఖాపరమైన చర్యలు!

నటితో సెటిల్‌మెంట్ కోసం ఐపీఎస్!

పలుమార్లు ముంబై వెళ్లి.. తనకున్న పరిచయాలతో బెదిరింపులు

జిందాల్‌పై కేసు వాపస్‌పై చర్చలు.. చివరికి ఆమెపై ఇక్కడ కేసు



తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తదితరులు

ఏఐ సిటీగా అమరావతి

90 రోజుల్లో సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణం పూర్తి

రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ వేగవంతం

హ్యాపీనెస్ట్ ప్రాజెక్ట్ మళ్లీ పునరుద్ధరణ

విశాఖ, విజయవాడలో మెట్రోరైలు ప్రాజెక్టులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

జనవరి 1 నుంచి అమరావతి పనులు

రాజధానికి ఇంకా 3,558 ఎకరాల సేకరణ

15 లోపు రైతులకు ఒక విడత కౌలు: నారాయణ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సిటీగా ఉండాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపకల్పన చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్ఫురణకు వచ్చేలా అమరావతి పేరులో మొదటి అక్షరం 'ఏ', చివరి అక్షరం 'ఐ' కలిసి వచ్చేలా

మిగతా 2వ పేజీలో...

కార్మికుల క్షేమం, సంక్షేమమే ధ్యేయం

భద్రతపై థర్డ్ పార్టీ ఆడిట్ తప్పనిసరి 12

10 లక్షల చంద్రన్న బీమాకు కట్టుబడి ఉన్నాం: సీఎం



నేడు జువ్వలదిన్నె హార్బర్ ప్రారంభం

వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించనున్న ప్రధాని 2

నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

ఆధార్ చూపితేనే లడ్డూలు

దర్శనం చేసుకోని భక్తుల విషయంలో టీటీడీ నిర్ణయం 3

ఒక భక్తుడికి రెండు మాత్రమే

ఇలాంటివి పునరావృతం కావొద్దు

పాత బిల్లులకు ప్రాధాన్యం ఇవ్వండి

పులివెందుల బిల్లుల క్లియర్‌పై 'ఆంధ్రజ్యోతి' కథనానికి చంద్రబాబు స్పందన 12

మంకీపాక్స్ నిర్ధారణకు ఆర్టీ-పీసీఆర్ కిట్

ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

దేశీయంగా విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో రూపకల్పన 2

15 వరకు బదిలీల గడువు పొడిగింపు 2

అల్పపీడనం.. భారీ వర్షాలు 2

గురువారం ఢిల్లీలో రాజీనామా అనంతరం మోపిదేవి, మస్తాన్‌రావు



మోపిదేవి, బీద రాజీనామా

చైర్మన్‌కు సమర్పించిన ఇద్దరు వైసీపీ రాజ్యసభ ఎంపీలు

తక్షణమే ఆమోదించిన ఉపరాష్ట్రపతి.. టీడీపీలో మోపిదేవి చేరిక లాంఛనమే 11

మస్తాన్‌రావును చేర్చుకోవడానికి బీజేపీ యత్నం?.. టీడీపీలోకి ఆహ్వానించిన వేమిరెడ్డి, మాగుంట

చర్చించి నిర్ణయం తీసుకుంటానన్న బీద.. సరైన సమయంలో చెబుతా: గొల్ల బాబూరావు

సర్కారీ షాపులకు గుడ్‌బై

కొత్త పాలసీలో పూర్తిగా ప్రైవేటు మద్యం దుకాణాలే!

ఆరు రాష్ట్రాల్లోని పాలసీలపై అధ్యయనం

ప్రభుత్వానికి ఎక్సైజ్ అధికారుల నివేదికలు

తెలంగాణ పాలసీకే ప్రభుత్వ వర్గాల మొగ్గు?

దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయం

దుకాణాలకు ఆన్‌లైన్‌లో లాటరీ ప్రక్రియ

2 వేల కోట్ల ఆదాయం రావచ్చని అంచనా

షాపుల్లో మళ్లీ పర్మిట్ రూమ్‌లకు అనుమతి

సెప్టెంబరు మొదటి వారంలో నోటిఫికేషన్

అక్టోబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం షాపులకు గుడ్‌బై చెప్పడానికి రంగం సిద్ధమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో అమలైన మద్యం పాలసీ ముగింపు దశకు చేరింది. సెప్టెంబరు తర్వాత రాష్ట్రంలో ఎక్కడా ప్రభుత్వ మద్యం దుకాణాలు కనిపించవు. పూర్తిగా ప్రైవేటు షాపులే ఉండేలా ఎక్సైజ్ శాఖ కొత్త పాలసీని రూపొందిస్తోంది. ఆరు రాష్ట్రాల్లోని మద్యం పాలసీలపై ఆ శాఖ

మిగతా 3వ పేజీలో...

కరడు గట్టిన స్మగ్లర్‌కు కాషాయ తీర్థం!?



గంగిరెడ్డి చేరికకు బీజేపీ పచ్చజెండా

టీడీపీ నేతల అభ్యంతరాలతో వాయిదా

అలిపిరిలో చంద్రబాబు హత్యకు యత్నించినవారికి ఆశ్రయమిచ్చారని గంగిరెడ్డిపై ఆరోపణలు

శేషాచలం అటవీ సంపద అక్రమ రవాణా

కడప, తిరుపతి, చెన్నైల్లో కబ్జాలు, సెటిల్‌మెంట్లు

మొన్ననే పిలిపించి విచారించిన పోలీసులు

వైసీపీ ఓటమితో కేసుల భయం 11

ఓ రాష్ట్ర నేత ద్వారా బీజేపీలో చేరికకు పావులు కదిపిన గంగిరెడ్డి?



అదానీ మళ్లీ నంబర్‌వన్

రూ.11.60 లక్షల కోట్ల నికర సంపద

హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 వెల్లడి

2

భాగ్యనగరం

దేశంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న 3వ నగరం.. ముంబై, ఢిల్లీ తర్వాత హైదరాబాదే

నగరంలో 104 మంది సహస్ర కోటీశ్వరులు

అగ్రభాగాన రూ.76,100 కోట్లతో మురళీ దివి కుటుంబం



త్వరలో రాహుల్ 'డోజో' యాత్ర!

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు భారత్ జోడో యాత్ర, మణిపూర్ నుంచి ముంబై వరకు భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహించిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ.. త్వరలో భారత్ 'డోజో' యాత్ర చేపట్టనున్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా 'ఎక్స్'లో వెల్లడించారు. డోజో అనేది మార్షల్ ఆర్ట్స్ నేర్పే స్కూలు లేదా మైదానం అన్న సంగతి తెలిసిందే. న్యాయయాత్ర సందర్భంగా ప్రతి రోజూ సాయంత్రం తాను బస చేసిన శిబిరం వద్ద ప్రత్యేకంగా కార్యకర్తలతో కలిసి రాహుల్ జియు-జిత్సు ఆర్ట్స్‌ను ప్రాక్టీసు చేసేవారు. ఆ ప్రాక్టీసు వీడియోను కూడా గురువారం ఆయన పోస్టు చేశారు. 'వేల కిలోమీటర్ల ప్రయాణంలో రోజూ ప్రాక్టీసుచేసేవాళ్లం. శారీరకంగా దృఢంగా ఉండడం సహచర యాత్రికులు, మేం బసచేసిన పట్టణాలకు చెందిన యువతను ఒక చోటకు చేర్చేవాళ్లం. యువతకు ధ్యానం, జియు-జిత్సు, అయికిడో, అహింసాయుత మార్షల్ ఆర్ట్స్ టెక్నిక్‌లను పరిచయం చేయడం మా లక్ష్యం' అని పేర్కొన్నారు. గురువారం (ఆగస్టు 29) జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకున్న ప్రజలతో తన అనుభవాలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. 'భారత్ డోజో యాత్ర త్వరలో రాబోతోంది' అని పేర్కొన్నారు.

బేతవోలుకు భాషా సమ్మాన్ అవార్డు ప్రదానం

» ఈ అవార్డు లభించడం ఓ వరం: బేతవోలు రామబ్రహ్మం

న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు, సంస్కృత భాషల్లో 40కి పైగా కావ్యాలు, నాటకాలు రచించిన ప్రముఖ సాహితీ వేత్త, పండితుడు బేతవోలు రామబ్రహ్మం ప్రతిష్ఠాత్మకమైన భాషా సమ్మాన్ అవార్డు అందుకున్నారు. 2021వ సంవత్సరానికిగాను ఆయన్ను ఈ అవార్డు వరించింది. ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ ఆడిటోరియంలో గురువారం అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ ఈ అవార్డును ఆయనకు అందజేశారు. రూ.లక్ష నగదు, తామ్రపత్రంతో ఆయన్ను సత్కరించారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల గ్రామానికి చెందిన బేతవోలు రామబ్రహ్మం 1948లో జన్మించారు. తెలుగు యూనివర్సిటీతో పాటు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా పని చేశారు. పురస్కారం స్వీకరించిన తర్వాత బేతవోలు మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తనకు ఈ పురస్కారం లభించడం ఒక వరమని అన్నారు.

నేడు జువ్వలదిన్నె హార్బర్ ప్రారంభం

» వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించనున్న ప్రధాని

నెల్లూరు-ఆంధ్రజ్యోతి/కావలి, ఆగస్టు 29: నెల్లూరు జిల్లా మత్స్యకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఆయన ఇదేరోజు మహారాష్ట్రలోని వాద్వాన్ పోర్టును ప్రారంభించనున్నారు. ఆ సందర్భంగా జువ్వలదిన్నె హార్బర్ సహా దేశవ్యాప్తంగా 218 ఫిషరీస్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు.. శంకుస్థాపన చేయనున్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే ఈ కార్యక్రమంలో మోదీ వర్చువల్ విధానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. 2014-19లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పురుడు పోసుకున్న జువ్వలదిన్నె హార్బర్‌కు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా ఖర్చు భరించేలా రూ.288 కోట్ల అంచనాతో రూపకల్పన చేశారు. స్థలసేకరణ పూర్తిచేసి అప్పగించారు. నిర్మాణానికి అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. తర్వాత 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో చేపట్టిన పనుల్లో మందగమనం కనిపించింది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు. ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించి చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యారు. కొత్త కాంట్రాక్టర్‌తో పనులు పూర్తిచేయించారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

» ఎల్లుండికి వాయుగుండంగా మారే అవకాశం

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తర, దానికి ఆనుకుని మధ్య బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనించి శుక్రవారం కల్లా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో మరింత బలపడనుంది. తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడి పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఉత్తరకోస్తాలో ముసురు వాతావరణం కొనసాగింది. ఎక్కువచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని, కోస్తాలో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, దక్షిణ కోస్తాలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 31న కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, ఉత్తరకోస్తాలో భారీ నుంచి అతి భారీ, దక్షిణ కోస్తాలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా మారిందని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఇక, గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్రలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మరింత బలపడి శుక్రవారంకల్లా అరేబియా సముద్రంలో తుఫాన్‌గా మారనుంది. అయితే, నైరుతి రుతుపవనాల సీజన్‌లో తుఫాన్లు రావడం అరుదని, అవి భూమిపైకి రావడం మరింత అరుదని నిపుణులు చెబుతున్నారు. 2008 తరువాత భూ ఆధారిత తుఫాన్ రావడం ఇప్పుడేనని, 1891 నుంచి ఇలాంటి 15వ తుఫాన్‌గా వివరిస్తున్నారు. తుఫాన్ రావడానికి సముద్రం, ఉపరితలం వేడిగా ఉండడంతోపాటు భారీగా తేమ అవసరమని, అరేబియా సముద్రంలో వాతావరణం అందుకు అనువుగా ఉందని విశ్లేషిస్తున్నారు.

భాగ్యనగరం


దేశంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న 3వ నగరం

» ముంబై, ఢిల్లీ తర్వాత మనమే

» దేశంలో అదానీ మళ్లీ నెంబర్‌వన్

» రూ.10.14 లక్షల కోట్లతో 2వ స్థానంలో ముఖేశ్ అంబానీ

» హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 వెల్లడి




ముంబై, ఆగస్టు 29: మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నిజంగానే భాగ్యనగరం అని తాజాగా మరోమారు వెల్లడైంది. దేశంలో అత్యధిక సంఖ్యలో బిలియనీర్లు ఉన్న నగరాల జాబితాలో దక్షిణాదిలో నెంబర్‌వన్‌గా నిలవటమేగాక దేశంలో ఢిల్లీ, ముంబై తర్వాత మూడో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో 18 మంది బిలియనీర్లు (వందకోట్ల డాలర్లు అంటే రూ.8,388 కోట్ల నికర సంపద ఉన్న వారు), 104 మంది సంపన్నులు (రూ.వెయ్యి కోట్ల నికర సంపద ఉన్నవారు) ఉన్నారని గురువారం విడుదలైన హురున్ ఇండియా రిచ్ లిస్ట్ -2024 వెల్లడించింది. ఇప్పటి వరకూ మూడోస్థానంలో ఉన్న బెంగళూరును వెనక్కినెట్టి హైదరాబాద్ ఆ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపింది. రూ.76,100 కోట్ల నికర సంపదతో మురళీ దివి కుటుంబం హైదరాబాద్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉంది. నగరానికి చెందిన పి.పిచ్చిరెడ్డి (రూ.54,800 కోట్లు), పీవీ కృష్ణారెడ్డి (రూ.52,700 కోట్లు), బి.పార్థసారథిరెడ్డి (రూ.29,900 కోట్లు) రిచ్ లిస్ట్ జాబితాలో ఉన్నారు. కాగా, దేశవ్యాప్తంగా బిలియనీర్ల పరంగా చూస్తే గౌతమ్ అదానీ తిరిగి నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గత ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ సంస్థ ఆరోపణల నేపథ్యంలో అదానీ సంపద 57 శాతం ఆవిరైపోయి రూ.4.74 లక్షల కోట్లకు పడిపోయింది. దీంతో రూ.8.08 లక్షల కోట్లతో ముఖేశ్ అంబానీ హురున్ రిచ్ లిస్ట్-2023లో అగ్రస్థానంలో నిలిచారు. అయితే, అదానీ తిరిగి పుంజుకున్నారు. రూ.11.60 లక్షల కోట్ల నికర సంపదతో ఈ ఏడాది భారత్‌లో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. గత ఏడాదితో పోల్చితే ఆయన సంపద ఏకంగా 95 శాతం పెరిగింది. అదానీ తర్వాత రిలయెన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముఖేశ్ అంబానీ రూ.10.14 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. అంబానీ సంపద గత ఏడాదితో పోల్చితే 25 శాతం పెరిగింది. అదానీ, అంబానీల తర్వాత మూడోస్థానంలో.. రూ.3.14 లక్షల కోట్ల నికర సంపదతో హెచ్‌సీఎల్ కంపెనీ యజమాని శివ్‌నాడర్ నిలిచారు. రూ.2.89 లక్షల కోట్లతో సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా యజమాని సైరస్ పూనావాలా 4వ స్థానాన్ని, రూ.2.5 లక్షల కోట్లతో సన్ ఫార్మస్యూటికల్స్ దిలీప్ షాంఘ్వి 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మహిళల పరంగా చూస్తే రూ.47,500 కోట్ల నికర సంపదతో జోహో కంపెనీ యజమానురాలు రాధా వెంబూ తొలిస్థానంలో ఉన్నారు. 20 ఏళ్ల కైవల్య వోహ్రా (రూ.3,600 కోట్లు), 22 ఏళ్ల ఆదిత్ పాలిచా (రూ.4,300 కోట్లు).. సంపన్నుల జాబితాలో అత్యంత పిన్న వయస్కులుగా నిలిచారు. వీరిద్దరూ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో వ్యవస్థాపకులు. రూ.7,300 కోట్ల సంపదతో షారూక్ ఖాన్ తొలిసారిగా హురున్ రిచ్ లిస్ట్‌లో తన పేరు నమోదు చేసుకున్నారు. సినీ రంగానికి చెందిన ప్రముఖుల జాబితాలో తొలిస్థానంలో షారూక్ ఉండగా.. రెండో స్థానంలో రూ.4,600 కోట్లతో ఆయన వ్యాపార భాగస్వామి జూహీచావ్లా ఉన్నారు. తర్వాత స్థానాల్లో హృతిక్ రోషన్, అమితాబ్ బచన్, కరణ్ జోహర్ నిలిచారు. ఈసారి 16 మంది కార్పొరేట్ ఉన్నతోద్యోగులు కూడా హురున్ లిస్ట్‌లో చేరారు. వీరిలో అరిస్టా నెట్‌వర్క్స్ సీఈఓ జయశ్రీ ఉల్లాల్ (రూ.32,100 కోట్లు), డీ మార్ట్ సీఈఓ ఇగ్నేషియస్ నావిల్ నోరోన్హా (రూ.6,900 కోట్లు) తదితరులున్నారు. భారత్‌లో ప్రతి ఐదు రోజులకు కొత్తగా ఒక బిలియనీర్ ఆవిర్భవిస్తున్నట్లుగా హురున్ రిచ్ లిస్ట్ వెల్లడించింది.

సంపన్నుల సంపదలో 46 శాతం వృద్ధి

హురున్ భారత సంపన్నుల జాబితాలో ఈసారి మొత్తం 1539 మంది స్థానం సంపాదించుకున్నారు (వీరిలో 334 మంది బిలియనీర్లు). గత ఏడాది జాబితాతో పోల్చితే ఈసారి 220 మంది అదనంగా చేరారు. అలాగే, గత ఏడాదితో చూస్తే సంపన్నుల మొత్తం సంపద ఈసారి 46 శాతం పెరిగింది. దేశంలోని నగరాల పరంగా చూస్తే 386 మంది సంపన్నులతో (వీరిలో 92 మంది బిలియనీర్లు) ముంబై తొలిస్థానంలో ఉంది. 217 మంది సంపన్నులతో (వీరిలో 68 మంది బిలియనీర్లు) రెండో స్థానంలో ఢిల్లీ నిలిచింది. కాగా, గత ఏడాది హురున్ లిస్టులో 3వ స్థానంలో ఉన్న బెంగళూరును అధిగమించి తొలిసారిగా ఆ స్థానాన్ని హైదరాబాద్ కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లో ఉన్న సంపన్నుల సంఖ్య 104 (వీరిలో 18 మంది బిలియనీర్లు). గత ఏడాదితో పోల్చితే 17 మంది ఎక్కువ. తదుపరి స్థానాల్లో బెంగళూరు (100), చెన్నై (82), కోల్‌కతా (69), అహ్మదాబాద్ (67), పుణె (53), సూరత్ (28), గురుగ్రామ్ (23) ఉన్నాయి. రిచ్ లిస్ట్‌పై హురున్ ఇండియా వ్యవస్థాపకుడు, ఆ సంస్థ ప్రధాన పరిశోధకుడు అనస్ రెహమాన్ జునైద్ మాట్లాడుతూ, ఆసియాలోనే సంపదను సృష్టించే ఇంజిన్‌గా భారత్ ఆవిర్భవిస్తోందన్నారు. భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 29 శాతం పెరగగా, చైనాలో 25 శాతం తగ్గుదల నమోదైందన్నారు.

బీజింగ్‌ను తలదన్నిన ముంబై

సంపన్నుల పరంగా చైనా రాజధాని బీజింగ్‌ను ముంబై దాటిపోయిందని ఈ ఏడాది మార్చిలోనే హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ వెల్లడించింది. బిలియనీర్ల నగటు సంపద చైనాలో రూ.26,840 కోట్లు కాగా.. భారత్‌లో అది రూ.31,873 కోట్లు అని ఈ జాబితా తెలిపింది. బీజింగ్‌లో 91 మంది బిలియనీర్లు ఉండగా ముంబైలో 92 మంది ఉన్నారని.. తద్వారా దక్షిణాసియా బిలియనీర్ల రాజధానిగా ముంబై రికార్డు నెలకొల్పిందని పేర్కొంది.



ప్రముఖ న్యాయ కోవిదుడు నూరానీ కన్నుమూత

» రాజ్యాంగ నిపుణుడు, రచయితగా గుర్తింపు



ముంబై, ఆగస్టు 29: ప్రముఖ న్యాయకోవిదుడు, రాజ్యాంగ నిపుణుడు, రచయిత, మేధావిగా గుర్తింపు పొందిన ఎ.జి.నూరానీ గురువారం ముంబైలో కన్ను మూశారు. ఆయన వయసు 94 ఏళ్లు. ఆయన పూర్తి పేరు అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ. 1930 సెప్టెంబరు 16న ముంబయిలో జన్మించారు. ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో విద్యనభ్యసించిన ఆయన సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టుల్లో ప్రతిభావంతుడైన న్యాయవాదిగా పేరు గడించారు. పలు జాతీయ, ప్రాంతీయ పత్రికలకు నిత్యం వ్యాసాలు రాస్తూ కాలమిస్టుగా గుర్తింపు పొందారు. 'హైదరాబాబాద్ విధ్వంసం' (డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్), కశ్మీర్ డిస్ప్యూట్-1947-2012, ఆర్టికల్ 370 వంటి పుస్తకాలు రాశారు. మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్, బ్రిటిష్ పాలనలో బాంబే హైకోర్టులో మొట్టమొదటి భారతీయ బారిస్టర్‌గా పనిచేసిన బద్రుద్దీన్ త్యాబ్జీల జీవిత చరిత్రలు రాశారు. షేక్ అబ్దుల్లా, కరుణానిధిల తరపున కేసులు వాదించారు. రాజ్యాంగ అంశాలు, ముస్లింల సమస్యలపై పలు ఉపన్యాసాలు ఇవ్వడంతో పాటు సదస్సుల్లో పత్రాలు సమర్పించారు. ఆయన మృతి పట్ల జమ్మూ-కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సంతాపం తెలిపారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ సంతాపం తెలుపుతూ రాజ్యాంగం, కశ్మీర్, చైనా వంటి అంశాలతో పాటు.. మంచి ఆహారాన్ని ఆస్వాదించడంపైనా పుస్తకాలు రాశారని తెలిపారు. మేధావుల్లో ఉన్నతుడని ప్రస్తుతించారు.

15 వరకు బదిలీలకు గడువు

16 ప్రభుత్వ శాఖల్లో పొడిగింపు

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలోని 16 శాఖల్లో బదిలీల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్సైజ్ మినహా మిగిలిన శాఖల్లో బదిలీలను ఆగస్టు 31లోగా పూర్తి చేయాలని ఈ నెల 17వ తేదీన ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కానీ దాదాపు అన్ని శాఖల్లోనూ బదిలీలు ఇంకా ఒక కొలిక్కి రాకపోవడం, ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ ఉన్న నేపథ్యంలో బదిలీలు నిర్వహిస్తే ఆ కార్యక్రమానికి ఆటంకం కలుగుతుందన్న ఉద్దేశంతో గడువు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్సైజ్ పాలసీని కొత్తగా రూపొందిస్తున్నందున అది పూర్తయ్యాక ఆ శాఖలో బదిలీలు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. సెప్టెంబరు 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఎక్సైజ్‌లో బదిలీలు ఉంటాయని ప్రభుత్వం గతంలో తెలిపింది. ఇప్పుడు అన్ని శాఖల బదిలీల గడువును సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగించింది. 16వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

నేవీలోకి ఐఎన్ఎస్ అరిఘాత్

» నౌకాదళానికి అప్పగించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

» రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

» అణ్వస్త్రాల దాడుల నుంచి భారత్‌కు రక్షణ

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారత నేవీ అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది. ఏ దేశమైనా అణ్వస్త్రాలతో దాడి చేస్తే మూడో కంటికి తెలియకుండా వారిపై విరుచుకుపడే శక్తి కలిగిన అణు జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాత్' నౌకాదళంలో చేరింది. విశాఖపట్నం నేవల్ బేస్‌లో గురువారం అత్యంత రహస్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తవానికి దీన్ని సెప్టెంబరులో ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా జాతికి అంకితం చేస్తారనే ప్రచారం జరిగింది. దానికి భిన్నంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో స్వదేశీయంగా రూపొందించిన రెండో అణు జలాంతర్గామి ఇది. దీన్నే నేవీ 'సెకండ్ స్ట్రయిక్' సామర్థ్యంగా అభివర్ణిస్తోంది. అయితే ఎవరిపైనా ముందుగా అణ్వాయుధం ప్రయోగించకూడదనేది భారత్ పెట్టుకున్న నిబంధన.



రెండు అందుబాటులోకి.. మరో రెండు నిర్మాణంలో..

రెండు దశాబ్దాల క్రితమే నేవీ అణు జలాంతర్గాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. విశాఖపట్నంలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో డీఆర్‌డీవో సాయంతో వీటి నిర్మాణం ప్రారంభమైంది. తొలుత రూపుదిద్దుకున్న ఐఎన్ఎస్ అరిహంత్ 2016లో నేవీలో చేరింది. ఆ మరుసటి ఏడాదే రెండోదైన అరిఘాత్ పరీక్షలకు సిద్ధమైంది. అన్నీ పూర్తయిన తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతులు మీదుగా గురువారం దీన్ని నౌకాదళానికి అప్పగించారు. ఎస్ఎస్‌బీఎన్ ప్రాజెక్టు పేరుతో నాలుగు అణు జలాంతర్గాముల నిర్మాణానికి నేవీ నడుం కట్టగా.. ఇప్పటికి రెండు అందుబాటులోకి వచ్చాయి. మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. యుద్ధ నౌకలు, విమానాలు, విమాన వాహక నౌకలు ఏదో ఒక నౌకాదళం కేంద్రంగా చేసుకొని పనిచేస్తాయి. ఈ అణు జలాంతర్గాములు మాత్రం ప్రధాని ఆధ్వర్యంలో నడిచే 'స్పెషల్ స్ట్రాటజిక్ ఫోర్స్' నేతృత్వంలో పనిచేస్తాయి. ఇవి ఎప్పుడు... ఎక్కడ ఉంటాయో ఎవరికీ తెలియదు. ఐఎన్ఎస్ అరిఘాత్ ఇండో పసిఫిక్ రీజియన్‌లో పహారా కాస్తుందని విశ్వసనీయ సమాచారం.

ఐఎన్ఎస్ అరిఘాత్ విశేషాలు

బరువు : 6వేల టన్నులు
పొడవు : 111.6 మీటర్లు
వెడల్పు : 11 మీటర్లు
డ్రాఫ్ట్ (లోతు): 9.5 మీటర్లు


వేగం : సముద్ర ఉపరితలంలో గంటకు 22 నుంచి 28 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. సముద్ర గర్భంలో గంటకు 44 కి.మీ. వేగంతో వెళ్తుంది.

ఇతర ప్రత్యేకతలు : దీనిలోని కె-15 బాలిస్టిక్ క్షిపణులు 750 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలవు. ఇలాంటివి ఒకేసారి 12 మిస్సైళ్లను మోసుకుపోగల సామర్థ్యం అరిఘాత్‌కు ఉంది. దీనిలో కె-4 క్షిపణులు కూడా నాలుగు ఉంటాయి.

అరిహంత్ కంటే అరిఘాత్ మెరుగైనది: రాజ్‌నాథ్



ఐఎన్ఎస్ అరిహంత్ కంటే అరిఘాత్ మరింత శక్తివంతమైనదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఐఎన్ఎస్ అరిఘాత్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణ్వాయుధాల విషయంలో అగ్రరాజ్యాలతో భారత్ సమానంగా నిలుస్తుందని, శాంతి స్థాపనకు, వ్యూహాత్మక ప్రయోజనాలకు ఇది దోహదపడుతుందని అన్నారు. అరిఘాత్ నిర్మాణంలో భారత నౌకాదళం, డీఆర్‌డీవో సమన్వయంతో పనిచేశాయని ప్రశంసించారు. దీని ద్వారా దేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం లభించిందన్నారు. కార్యక్రమంలో నేవీ ఉన్నతాధికారులు, డీఆర్‌డీఓ, ఎస్ఎస్‌టీఎల్ అధికారులు పాల్గొన్నారు.



ఆర్టీ-పీసీఆర్ కిట్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

మంకీపాక్స్ నిర్ధారణకు ఆర్టీ-పీసీఆర్ కిట్

» ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

» విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో రూపకల్పన

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'మంకీపాక్స్ వ్యాధి నిర్ధారణ కోసం దేశీయంగా విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో ఆర్టీ-పీసీఆర్ కిట్ అభివృద్ధి చేయడం అభినందనీయం' అని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ, జోన్ ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మొట్టమొదటి ఆర్టీ-పీసీఆర్ కిట్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కిట్‌ను తక్కువ ధరతో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మెడ్‌టెక్ ప్రతినిధులు తెలిపారు. మెడ్‌టెక్ జోన్ భాగస్వామి ట్రాన్సాసియా దయాగ్నోస్టిక్స్.. ఎర్బామ్‌డెక్స్ మంకీపాక్స్ ఆర్టీపీసీఆర్ కిట్ పేరిట ఈ కిట్‌కు రూపకల్పన చేసినట్లు సీఎంకు వివరించారు. 'మేక్ ఇన్ ఏపీ' బ్రాండ్ రాష్ట్రానికి రావడానికి ఈ కిట్ దోహదపడుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం నుంచి మెడ్‌టెక్ జోన్‌కు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు.

ఏఐ సిటీగా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ లోగో రూపొందించాలన్నారు. రాజధానిలో ఎటు చూసినా సాంకేతిక సౌలభ్యత ఉట్టిపడేలా నిర్మాణం ఉండాలన్నారు. అమరావతి దేవతల రాజధాని అని, అలాంటి గొప్ప రాజధాని పట్ల గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి రాజధానిని భ్రష్టు పట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన 37వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పురపాలక మంత్రి నారాయణ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'అమరావతి లో త్వరలో అన్ని పనులకూ టెండర్లు పిలిచి జనవరి ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభించేలా ముందుకెళ్తాం' అని తెలిపారు. రాయపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్డును ఆనుకుని సీఆర్డీఏ కార్యాలయాన్ని ప్రభుత్వం నిర్మిస్తుందని, ఈ భవనం నిర్మాణానికి రూ.160 కోట్లు కేటాయిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుందన్నారు. జీ ప్లస్ 7 విధానంలో 3.62 ఎకరాల్లో తలపెట్టిన సీఆర్‌డీఏ కార్యాలయాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో ఏ మాత్రం చేపట్టామో అంతకు మించి అంగుళం నిర్మాణం కూడా ముందుకు కదల్లేదని అధికారులు తెలపగా, దీనిని 90 రోజుల్లో పూర్తి చేసి కొత్త కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

హ్యాపీనెస్ట్‌కూ వైసీపీ గ్రహణం వీడాలి

'సీడ్ క్యాపిటల్‌లో మొత్తం 14.46 ఎకరాల్లో జీ ప్లస్ 18 అంతస్తులు ఉండేలా మొత్తం 12 టవర్లను నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దానికి తగ్గట్టుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రారంభించగానే కేవలం గంటలోనే అన్ని ప్లాట్లు బుక్ అయిపోయాయి. దీంతో రూ.714 కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు రూ.930 కోట్లకు పెరిగింది. అయినప్పటికీ ప్లాట్లు బుక్ చేసుకున్న వారు నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు' అని మంత్రి తెలిపారు.

15లోగా కౌలు చెల్లింపు

రాజధానికి భూములిచ్చిన రైతులకు గత ఏడాది కౌలు నిధులు రూ.175 కోట్లను వచ్చే నెల 15లోగా రైతుల ఖాతాలకు జమ చేసేలా సీఎం ఆదేశాలిచ్చారన్నారు. ఖజానా ఖాళీ అయిపోయినందున, కొంత గ్యాప్ తర్వాత మిగిలిన రూ.225కోట్లు చెల్లిస్తామన్నారు. అలాగే, ల్యాండ్ పూలింగ్ ద్వారా రాజధానికి భూములిస్తున్న రైతులకు ప్రాధాన్య క్రమంలో వారి గ్రామాల్లోనే తిరిగి ప్లాట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా 3,550 ఎకరాలు భూసమీకరణ ద్వారా సేకరించాల్సి ఉందన్నారు. గత నెల రోజులుగా 120 ఎకరాలు భూమిని సీఆర్డీఏకు ఇచ్చారన్నారు. తాజాగా భూములిచ్చిన వారికి సీఆర్డీఏ వద్ద ఉన్న భూముల్లో ప్రాధాన్యత ప్రకారం రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

మెట్రోకు మళ్లీ కదలిక

సమావేశంలో విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులపై చర్చ జరిగిందని మంత్రి చెప్పారు. విజయవాడలో రెండు దశల్లో మెట్రో ప్రాజెక్టు చేపట్టేలా డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. మొదటి దశలో విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టు వరకు 25.95 కిలోమీటర్లు, బస్టాండ్ నుంచి పెనమలూరు వరకు రూ.12.45 కిలోమీటర్ల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. మొత్తం మొదటి దశలో 38.40కి.మి. మేర నిర్మాణానికి తాజా అంచనాల ప్రకారంరూ. 11 వేల 9 కోట్లు ఖర్చవుతుందన్నారు. రెండో విడతలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి అమరావతి రాజధానికి మొత్తం 27.80కి.మి. మేర మెట్రో నిర్మాణం చేసేలా డీపీఆర్ రూపకల్పన చేసారని, దీనికి రూ.14 వేల 121 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇక విశాఖపట్నంలో మొదటి దశలో స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34.40 కిలోమీటర్ల మేర, గురుద్వారా నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ వరకూ 5.07 కిలోమీటర్ల మేర రెండో కారిడార్, తాటిచెట్ల పాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కిలోమీటర్ల మేర మూడో కారిడార్ నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ఫేజ్ వన్‌కు సంబంధించిన అంచనాలను వీలైనంత త్వరగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సీఎం ఆదేశించారన్నారు.

విశాఖలో ఏఐ యూనివర్సిటీ: లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వర్సిటీని ఏర్పాటు చేస్తామని, దానిని ప్రపంచస్థాయికి తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ ప్రకటించారు. రోబోటిక్స్, హెల్త్ కేర్, విద్యా రంగాలతో ఐటీని అనుసంధానం చేస్తామని చెప్పారు. ఏపీ ఐటీ అసోసియేషన్ ప్రతినిధులతో విశాఖపట్నం నోవాటెల్‌లో గురువారం రాత్రి ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ విశాఖపట్నాన్ని 100 బిలియన్ డాలర్ల ఎకానమీ నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. టాప్ టెన్ ఐటీ కంపెనీలను రాష్ట్రానికి రప్పిస్తామన్నారు. ఐటీ అభివృద్ధికి పునాదులు వేసిన చంద్రబాబును ఇకపై 4.0 వెర్షన్‌లో చూడబోతున్నామన్నారు.

రాజకీయాలకు కొత్తే.. వ్యాపారంలో కాదు

» మా ఎదుగుదల ఓర్వలేకే అసత్య ప్రచారాలు

» కమ్మ వెంకటరావుతో నేరుగా సంబంధం లేదు

» భ్రమర టౌన్‌షిప్ సీఎండీ గల్లా రామచంద్రరావు వివరణ



గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 29: 'వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపార పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరకు డీఎస్పీకి రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపించుకోవాల్సిన పరిస్థితులను చవిచూశాం' అని భ్రమర టౌన్‌షిప్ సీఎండీ గల్లా రామచంద్రరావు అన్నారు. గురువారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా తమ ఎదుగుదలను చూసి ఓర్చుకోలేని వారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. చల్లా రమేశ్ అనే వ్యక్తి ద్వారానే పిడుగురాళ్ల ప్రాంతంలో భూములు కొనుగోలు చేశామని చెప్పారు. కమ్మ వెంకటరావు కూడా భూములు అమ్మారని, ఆ తర్వాత అధిక రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. పిడుగురాళ్లలో తమ వెంచర్‌కి సంబంధించిన భూములన్నీ చల్లా రమేశ్ తమ ప్రతినిధిగా చూస్తున్నారని, ఆ భూముల వ్యవహారంలో కమ్మ వెంకటరావుతో తమకు నేరుగా ఎటువంటి సంబంధాలూ లేవని ఆయన వివరణ ఇచ్చారు. రైతులకు సంబంధించిన భూములు కొనుగోలు చేసినప్పుడు వారికి పూర్తి మొత్తం చెల్లించిన తర్వాతే రిజిస్ట్రేషన్ పెట్టుకుంటామని చెప్పారు. కమ్మ వెంకటరావుతో పాటు కావ్య రామిరెడ్డి, లింగారెడ్డి మరికొందరు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఎకరం రూ.28 లక్షలకు కొనుగోలు చేశామని, ఇప్పుడు వారు రేటు పెంచి ఎకరాకు రూ.46లక్షలు, మళ్లీ రూ.60 లక్షలు డిమాండ్ చేస్తున్నారి తెలిపారు. పదేళ్లుగా వ్యాపారం చేస్తున్నామని, ఎక్కడా రైతులతో, కస్టమర్లతో తమకు విభేదాలు లేవన్నారు. తాము అప్పటి గుంటూరు ఎంపీ జయదేవ్ బంధువులమని భావించి, గత ప్రభుత్వంలో తమ వెంచర్లకు అనుమతులు ఇవ్వడంలో ఆలస్యం చేశారని, కొన్నిచోట్ల అనుమతులు నిరాకరించారని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు తమకు అవకాశం కల్పించాడని, తన భార్య గల్లా మాధవి మూడు నెలల క్రితమే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, తమ ఎదుగుదలను చూసి ఓర్చుకోలేని వారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. తమ వ్యాపార సంస్థను వ్యాపార పరంగానే చూడాలని రాజకీయంగా చూడొద్దని రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు.


ఆధార్‌తో లడ్డూలు తీసుకునేందుకు క్యూలైన్లో నిలబడిన భక్తులు

ఆధార్ చూపితేనే లడ్డూలు!

దర్శనం చేసుకోని భక్తుల విషయంలో టీటీడీ నిర్ణయం
ఒక భక్తుడికి రెండు మాత్రమే
దళారీలను అరికట్టేందుకే విక్రయాల్లో మార్పులు అంటున్న దేవస్థానం

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ విక్రయాల్లో టీటీడీ మార్పులు చేసింది. ఇకపై దర్శనం చేసుకోని భక్తులు లడ్డూలు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు చూపాలని, వారికి కేవలం రెండు లడ్డూలు మాత్రమే విక్రయించాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం తిరుమలలోని లడ్డూకాంప్లెక్స్‌లో దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడికీ ఓ లడ్డూను ఉచితంగా ఇవ్వడంతో పాటు అదనంగా లడ్డూలు కావాలంటే రూ.50 చొప్పున విక్రయించేది. దర్శనం చేసుకోకపోయినా రూ.50 చొప్పున అదనపు లడ్డూలు పొందే వెసులుబాటు ఉండేది. అయితే ఇటీవల లడ్డూలను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే దళారీల సంఖ్య పెరిగిపోయిందనే ఫిర్యాదులతో టీటీడీ మార్పులు చేపట్టింది. గురువారం వేకువజాము నుంచి దర్శన టికెట్, టోకెన్ కలిగిన భక్తులకు ఉచిత లడ్డూతో పాటు అదనంగా రెండు లడ్డూలు విక్రయించారు. దర్శనం చేసుకోని భక్తుల నుంచి ఆధార్ కార్డు తీసుకుని ఆ వివరాలను నమోదు చేసిన తర్వాత రెండు లడ్డూలను రూ.50చొప్పున విక్రయించారు. దళారీలను అరికట్టేందుకు టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయం మంచిదే అయినప్పటికీ రద్దీరోజుల్లో భక్తులు ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. రద్దీరోజుల్లో చాలా మంది భక్తులు దర్శనం లభించకపోయినప్పటికీ కనీసం లడ్డూలైనా తీసుకువెళదామని భావిస్తారు. అయితే టీటీడీ తాజా నిర్ణయంతో అలాంటి భక్తులకు ఆధార్‌కార్డుపై కేవలం రెండు లడ్డూలు మాత్రమే అందనున్నాయి.

సామాన్య భక్తుల కోసమే ఈ నిర్ణయం

సామాన్య భక్తుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనం వద్ద గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. దళారుల బెడదను అరికట్టడమే లక్ష్యంగా, శ్రీవారి భక్తులకు విక్రయించే లడ్డూ ప్రసాదాలను మరింత పారదర్శకంగా విక్రయించేందుకు టీటీడీ చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. దర్శనం చేసుకోని భక్తులకు ఆధార్‌తో లడ్డూలను విక్రయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. లడ్డూకాంప్లెక్స్‌లోని 48 నుంచి 62వ నెంబరు వరకు ఉన్న కౌంటర్లలో ఈ లడ్డూలను పొందవచ్చన్నారు. ఆధార్‌పై రెండు లడ్డూలు తీసుకునే భక్తులు మరుసటి రోజు మరో రెండు లడ్డూలు కూడా పొందవచ్చన్నారు. ఇక దర్శనం చేసుకున్న భక్తులకు గతంలోలానే ఒక ఉచిత లడ్డూతో పాటు అదనంగా లడ్డూలు కావాలంటే లభ్యతను బట్టి 4 నుంచి 6 లడ్డూలు కొనుగోలు చేయవచ్చన్నారు. సోషల్‌మీడియా, కొన్ని ఛానళ్లలో ప్రసారమవుతున్న నిరాధార ఆరోపణలను భక్తులు నమ్మవద్దని కోరారు.

సర్కారీ షాపులకు గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు అధ్యయనం చేసి ఇటీవల ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. వాటిలో తెలంగాణ తరహా పాలసీనే ఉత్తమంగా ఉందనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. తాజాగా ఏర్పాటుచేసిన కేబినెట్ సబ్ కమిటీ ముందు ఈ నివేదికలు ఉంచి పాలసీకి తుది రూపు తీసుకురానున్నారు. అయితే దాదాపుగా తెలంగాణ పాలసీకే ప్రభుత్వ వర్గాలు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

దరఖాస్తులపై ఆదాయ లక్ష్యం

రాష్ట్రంలో 2017లో చివరిసారిగా ప్రైవేటు మద్యం షాపులకు పాలసీ విడుదలైంది. 2019లో అది ముగిసిన తర్వాత అదే సంవత్సరం అక్టోబరు 1 నుంచి వైసీపీ సర్కారు ప్రభుత్వ మద్యం షాపుల పాలసీని అమల్లోకి తెచ్చింది. అప్పటివరకూ 4,380 షాపులు ఉంటే వాటిని 3,500కు కుదించి ప్రభుత్వ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మరోసారి షాపుల సంఖ్యను 2,934కు కుదించారు. ఇవికాకుండా టూరిజం కేంద్రాల్లో షాపుల పేరుతో మొత్తం 3,392కు పెంచారు. ఇప్పుడు దాదాపుగా అదే సంఖ్యలో షాపులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. 2023లో తెలంగాణ లిక్కర్ పాలసీ ప్రకటించినప్పుడు దరఖాస్తు ఫీజు కింద రూ.2,628 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు రాష్ట్రంలో కూడా ఈ రూపంలో కనీసం రూ.2వేల కోట్ల వరకూ వస్తుందని అంచనా వేస్తున్నారు. కొత్త పాలసీలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు(నాన్-రిఫండబుల్)గా నిర్ణయించారు. ఒక్కో షాపునకు సగటున 40 దరఖాస్తుల ప్రకారం చూసినా రూ.2,300కోట్ల వరకు ఆదాయం వస్తుంది. అయితే మొత్తం దుకాణాల్లో 10శాతం అంటే దాదాపు 300 వరకూ గీత కార్మికులకు కేటాయించాలి. వాటికి ఎక్కువ దరఖాస్తులు వచ్చే అవకాశం ఉండదు. దీంతో రూ.2వేల కోట్ల వరకూ ఆదాయం వస్తుందని భావిస్తున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే

కొత్త పాలసీని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తున్నారు. దరఖాస్తుల నుంచి లాటరీ వరకూ మొత్తం ఆన్‌లైన్‌లోనే ప్రక్రియ చేపడతారు. తొలుత లాటరీకి వెళ్లాలా? వేలం ప్రక్రియ చేపట్టాలా? అనే అంశాలపై కసరత్తు చేశారు. వేలం విధానంలో ప్రారంభంలో ఆదాయం ఎక్కువ వచ్చినా, ఆ తర్వాత స్థిరత్వం ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎక్కువ ధరకు లైసెన్స్‌లు పొందినవారు మధ్యలోనే షాపును వదిలేస్తే అది ఆదాయ నష్టంతో పాటు, ఇతర అంశాలపైనా ప్రభావం చూపుతుందని, అందువల్ల లాటరీ విధానంలో ఎంపిక చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో తొలిసారి బార్ పాలసీని ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. అది వేలం విధానం కాగా ఇప్పుడు లాటరీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. అలాగే పాత విధానం తరహాలో షాపుల్లో పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇవ్వనున్నారు. గతంలో ప్రైవేటు షాపు పక్కనే మద్యం సేవించేందుకు పర్మిట్ రూమ్ ఉండేది. ప్రభుత్వ షాపుల విధానంలో వాటిని తొలగించారు. దానివల్ల మందుబాబులు రోడ్లపైనే మద్యం తాగే దుస్థితి వచ్చింది. దానిని అరికట్టేందుకు రూమ్‌లకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

వారం, పది రోజుల్లో పాలసీ

కొత్త మద్యం పాలసీని ప్రభుత్వం వారం, పది రోజుల వ్యవధిలో ప్రకటించనుంది. ప్రభుత్వ మద్యం షాపుల పాలసీ సెప్టెంబరుతో ముగుస్తుంది. అక్టోబరు 1 నుంచి ప్రైవేటు షాపుల పాలసీ అమల్లోకి వస్తుంది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లాటరీ ప్రక్రియను 20 రోజుల్లో పూర్తిచేసేలా షెడ్యూలు రూపొందిస్తున్నారు. మరోవైపు సెప్టెంబరు 5 నుంచి ఎక్సైజ్‌లో బదిలీలు ప్రారంభం కావాలి. ఈలోగా ఎక్సైజ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణ జీవోలు విడుదల చేయాలి. ఒకేసారి అటు బదిలీలు, ఇటు కొత్త పాలసీ అంటే ఇబ్బందులు వస్తాయని భావించిన అధికారులు ప్రస్తుతానికి సిబ్బందిని సర్దుబాటు చేసి పాలసీ ప్రక్రియ ముగించాలని భావిస్తున్నారు. పాలసీ అమల్లోకి వచ్చాక బదిలీలు చేపట్టాలనే ఆలోచన చేస్తున్నారు.

వైసీపీ కమీషన్ పాలసీ

రాష్ట్రంలో తొలినుంచీ ప్రైవేటు మద్యం షాపుల పాలసీనే ఉంది. లైసెన్సీలు ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేసి వాటిని షాపుల్లో విక్రయిస్తారు. ఫలితంగా వారికి 10శాతం మార్జిన్ లభిస్తుంది. అందులోనే షాపుల అద్దెలు, ఖర్చులు, సిబ్బంది జీతాలు చెల్లించుకునేవారు. 2014 తర్వాత టీడీపీ ప్రభుత్వంలో ప్రయోగాత్మకంగా 10శాతం షాపులను ఎక్సైజ్ శాఖ ద్వారా నడిపించే విధానం అమలు చేశారు. కానీ వాటిలో ప్రైవేటు షాపుల స్థాయిలో అమ్మకాలు జరగలేదు. దీంతో ప్రభుత్వ మద్యం షాపులతో ప్రయోజనం లేదని అప్పట్లోనే తొలగించారు. కానీ వైసీపీ ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో ప్రభుత్వ షాపుల విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వ షాపులు అయితే మద్య నిషేధం అమలు చేయడం సులభమవుతుందని మొదట్లో ప్రచారం చేసింది. కానీ రెండు నెలలకే అసలు విషయం బయటపడింది. సొంత బ్రాండ్లు అమ్ముకోవడానికి, మద్యం కంపెనీల వద్ద కమీషన్ల వసూలే లక్ష్యంగా ఆ పాలసీని అమలు చేశారు. ప్రైవేటు షాపులైతే ప్రజలు ఎక్కువగా తాగే బ్రాండ్లనే అందుబాటులో ఉంచుతాయి. ప్రభుత్వ షాపుల్లో అందుకు విరుద్ధంగా వైసీపీ పెద్దలు చెప్పిన బ్రాండ్లనే బలవంతంగా అమ్మించారు. వినియోగదారులకు మరో దారి లేకుండా నాసిరకం బ్రాండ్లు తాగేలా చేశారు. ఫలితంగా వైసీపీ పెద్దలకు కేవలం కమీషన్ల రూపంలోనే రూ.3,113కోట్లు వెళ్లాయి.

నేడు సెబ్ రద్దు జీవో

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దుచేసే జీవోను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయనుంది. ఎక్సైజ్ శాఖను పునర్‌వ్యవస్థీకరించాలని, సెబ్‌ను రద్దు చేయాలని తాజాగా కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే శాఖ పునర్‌వ్యవస్థీకరణపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. అందుకు అనుగుణంగా సెబ్‌ను రద్దుచేసి, పూర్తిగా పాత విధానంలోకి ఎక్సైజ్ శాఖను తీసుకురానున్నారు.

కేబినెట్ సబ్‌కమిటీ నియామకం

నూతన మద్యం పాలసీ రూపకల్పనలో సిఫారసులకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ కమిటీలో ఉన్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత విధానం, అందులో ఇబ్బందులు, లోపాలను గుర్తించి కొత్త పాలసీ ఎలా ఉండాలనే దానిపై ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. ఇతర రాష్ట్రాల్లో పాలసీలపై చేసిన అధ్యయనం వివరాలను పరిశీలించి ముసాయిదా పాలసీని మంత్రిమండలికి సమర్పిస్తారు.


మరమ్మతు పనులు పూర్తయ్యాక నింపిన నీటితో పుష్కరిణి

తిరుమలలో పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తి

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలలో పుష్కరిణిలోని నీటిని తొలగించి మరమ్మతుల అనంతరం తిరిగి నీటిని నింపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచి 31 వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేసి, తిరిగి నీటితో నింపారు. ఆదివారం నుంచి భక్తులను పుష్కరిణిలోకి అనుమతించనున్నారు.

చవితి మండపాలకు సింగిల్ విండోలో అనుమతులు



» పోర్టల్ ప్రారంభించిన హోంమంత్రి అనిత

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవ మండపాలకు సింగిల్ విండోలో అనుమతులు ఇవ్వనున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇందుకోసం రూపొందించిన పోర్టల్‌ను విశాఖపట్నంలోని సర్క్యూట్ హౌస్‌లో గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇకపై వినాయక మండపాలకు అనుమతి కోసం వివిధ శాఖల కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఉత్సవాలను నిర్వహించాలనుకునేవారు 7995095800 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే ఎన్‌ఓసీ కోసం అనుసరించాల్సిన ప్రక్రియకు సంబంధించిన వివరాలు వచ్చేస్తాయన్నారు. తర్వాత gneshutsav.net వెబ్‌సైట్‌లో లాగిన్ అయి మండపం ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రాంతం, కమిటీ సభ్యుల వివరాలు, స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ, నిమజ్జనం, ఊరేగింపు రూట్ మ్యాప్ వంటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ, విద్యుత్ శాఖ, అగ్నిమాపకశాఖ అధికారులు పరిశీలించి సంతృప్తి చెందితే ఫీజును ఆన్‌లైన్‌లోనే చెల్లించి రశీదుని తిరిగి అదే పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే క్యూఆర్ కోడ్ కలిగిన ఒక ఎన్‌ఓసీని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారని, సంబంధిత కమిటీ సభ్యులు మీ సేవా కేంద్రం నుంచి ఎన్‌ఓసీని తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

ప్రతి పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్‌లు

» ఏసీఏ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ (వన్ టౌన్), ఆగస్టు 29: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించనున్నట్టు విజయవాడ ఎంపీ, ఏసీఏ చైర్మన్ కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. ఇటీవల బధిర అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో గాయపడ్డ దివ్యాంగుడు యశ్వంత్‌కు విజయవాడలో డాక్టర్ భార్గవ్‌రామ్ అత్యాధునిక శస్త్రచికిత్స చేసి నయం చేశారు. నాలుగు నెలల వ్యవధిలోనే యశ్వంత్ 140 కి.మీ వేగంతో బౌలింగ్ చేసి శ్రీనగర్‌లో జరిగిన మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కు ట్రస్ట్ ఆస్పత్రిలో గురువారం వైద్యులు డాక్టర్ భార్గవ్ రామ్, యూవీ రమణ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని యశ్వంత్‌కు శస్త్ర చికిత్స చేసి అతనిలో ఆత్మస్థైర్యాన్ని నింపిన డాక్టర్ భార్గవ్ రామ్‌కు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మూగ, బధిర క్రీడాకారులను ఆదుకునేందుకు కొత్తగా విధి విధానాలు రూపొందిస్తామని చెప్పారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నేతృత్వంలో గ్రామీణ ప్రాంత క్రికెటర్‌లకు అండగా ఉండేందుకు తగు ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. పాఠశాలల్లో క్రికెట్ టోర్నమెంట్‌లు, రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు.


కడపల్లె అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మందు పార్టీ చేసుకుంటున్న ఉపాధ్యాయుడు, పక్కనే విద్యార్థులు

డ్రిల్లు మాస్టారి మందుపార్టీ!

» 'గురుకులం'లో... విద్యార్థుల సమక్షంలో...
» డీసీవో విచారణ ..ఉన్నతాధికారులకు నివేదిక

శాంతిపురం, ఆగస్టు 29: ఉద్యోగరీత్యా వ్యాయామ ఉపాధ్యాయుడు..కానీ, ఆయనే క్రమశిక్షణ తప్పాడు. దేవాలయం లాంటి గురుకులంలో మద్యం తాగాడు. అదీ విద్యార్థుల సమక్షంలో! చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో వారం కిందట చోటుచేసుకున్న ఈ ఘటన గురువారం వెలుగు చూసింది. శాంతిపురం మండలం కడపల్లెలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తాము నివాసం ఉన్న గదిలో వ్యాయమ ఉపాధ్యాయుడు మురళి, మరికొందరు కలిసి మద్యం సేవించారు. వారికి కావలసిన తినుబండారాలు, ఇతర వస్తువులను హాస్టల్ విద్యార్థులతో తెప్పించుకొన్నారు. పిల్లలను అక్కడే ఉంచుకొని మందు పార్టీ చేసుకొన్నారు. ఇందుకు సంబంధించి వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకున్న పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రాజేంద్ర ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారిణి పద్మజ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమాధికారి బాలకృష్ణ పాఠశాలకు చేరుకొన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను విడివిడిగా విచారించారు. ఈ విచారణలో వ్యాయమ ఉపాధ్యాయుడితో పాటు మరికొందరు కలిసి మద్యం తాగినట్లు తేలిందని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రాజేంద్ర తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, ఇతర ఉన్నతాధికారులకు పంపినట్టు చెప్పారు.

ప్రతి ఎకరాకూ నీరందాలి

» నిర్లక్ష్యం చూపితే అధికారులపై చర్యలు
» 'సాగర్, చింతలపూడి'పై మంత్రి రామానాయుడు సమీక్ష

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలు, చింతలపూడి ఎత్తిపోతల పథకాల పరిధిలోని ప్రతి ఎకరానికీ సాగునీరందేలా చర్యలు చేపట్టాలని జల వనరుల శాఖ ఇంజనీర్లను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నిర్లక్ష్యం చేసే ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం సచివాలయంలో జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. గతంలో టీడీపీ హయాంలో రూ.2195 కోట్లు కేటాయించామని, ప్రాజెక్టు పనులు కీలక దశకు చేరుకున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదన్నారు.

భాషల ప్రాచీనతకు శాసనాలే పునాదులు

» మాతృభాష గొప్పతనం అందరికీ తెలియాలి
» ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే సాగాలి
» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
» తొలి తెలుగు శాసనం లభించిన కలమల్లలో తెలుగుభాషా దినోత్సవం


కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్లలోని తొలి తెలుగు శాసనాలను పరిశీలిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఎర్రగుంట్ల, ఆగస్టు 29: భాషల ప్రాచీనతకు శాసనాలే పునాదులని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని తొలి తెలుగు శాసనాలు లభించిన కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్ల చెన్నకేశవ, సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా తెలుగుభాష, తెలుగు కవులు, సాహితీవేత్తలు, ఇతిహాసాల గురించి ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం తెలుగు భాషా దినోత్సవ వేడుకలకు కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇచ్చార్జి సి.భూపేశ్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. 'ఇంట్లో, వీధిలో, బడిలో, గుడిలో అమ్మ ఒడిలో, నారుమడిలో మాతృభాషనే మాట్లాడాలి. తెలుగు ఔన్నత్యాన్ని కాపాడేందుకు అందరం ప్రతిజ్ఞ చేయాలి. మన భాష సంస్కృతికి చుక్కాని లాంటిది. అది మనతో ఆగిపోరాదు. శాసనాల సంరక్షణకు ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని భాషను ప్రోత్సహించాలి. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగుభాషలోనే సాగాలి. శాసనాల పరిశోధనలను కొనసాగించాలి. తెలుగుభాషను ప్రాచీన భాషగా గుర్తించారు. విజ్ఞానం అందరికి అందాలనే సంకల్పంతో వ్యవహారిక భాషా ఉద్యమానికి గిడుగు రామ్మూర్తి శ్రీకారం చుట్టారు. ఆయన పుట్టిన రోజును తెలుగుభాషా దినోత్సవంగా చేసుకోవడం సంతోషకరం. వికసిత్ కడప, వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ భారత్‌కు జరిగే ప్రయాణంలో అందరి భాగస్వామ్యం కావాలి ప్రపంచంలో ఎంతో గుర్తింపు పొందిన ప్రధాని మోదీ, పూర్వ రాష్ట్రపతులు కూడా మాతృభాషలో చదివి అంతటి గొప్పవారయ్యారన్నారు, కలమల్ల శాసనాలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చాలి' అని అన్నారు.

మళ్లీ గేట్లెత్తారు!

» భారీగా వరద ప్రవాహం.. శ్రీశైలం 10 గేట్లు ఎత్తివేత
» నాగార్జున సాగర్ గేట్లన్నీ ఎత్తి 3.14 లక్షల క్యూసెక్కులు విడుదల
» పులిచింతల నుంచి దిగువకు 2,71,983 క్యూసెక్కుల ప్రవాహం
» ప్రకాశం బ్యారేజీ ఇన్‌ఫ్లో 2,15,929 క్యూసెక్కులు
» 1.98 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి


నాగార్జున సాగర్ 26 గేట్ల నుంచి కృష్ణమ్మ పరవళ్లు

నరసరావుపేట-ఆంధ్రజ్యోతి/విజయపురి సౌత్/శ్రీశైలం, ఆగస్టు 29: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. రాష్ట్రంలోని అన్ని జలాశయాల గేట్లనూ మరోసారి ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యాంలు పూర్తిగా నిండాయి. శ్రీశైలానికి ఎగువ పరివాహక ప్రాంతాలు, జూరాల నుంచి 2,86,434 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాం అధికారులు గురువారం పది క్రస్టు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,79,830 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 2,75,218 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 884.80 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 214.3637 టీఎంసీలుగా ఉంది. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,523 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు, డ్యాం క్రస్టుగేట్ల ద్వారా 2,79,830 క్యూసెక్కులు.. మొత్తం 3,48,235 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్‌లోని మొత్తం 26 క్రస్ట్ గేట్లన్నీ ఎత్తి 3.14 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలకు గాను 312.04 టీఎంసీల నిల్వ ఉంది. కాగా.. సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. దీంతో 13 గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజీకి 2,71,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 42.57 టీఎంసీల నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీకి 2,15,929 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 70 గేట్లు ఎత్తి 1,98,700 క్యూసెక్కులు దిగువకు.. అంటే సముద్రంలోకి వదులుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పేదల పెన్నిధి

యూపీఏ హయాంలో ఆరంభమైన ఓ బృహత్తర కార్యక్రమానికి జన్‌ధన్ యోజనగా నరేంద్రమోదీ పేరుమార్చారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థికమంత్రి చిదంబరం గురువారం వ్యాఖ్యానించారు. తమ పాలనలో అమలుజరిగిన ఆ పథకంలో భాగంగా 2005–2014మధ్యకాలంలో పేదలకోసం లక్షలాది బ్యాంకు ఎకౌంట్లు తెరుచుకున్నాయని ఆయన అన్నారు. ఇది రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ సి. రంగరాజన్ మెదడులో మెరిసిన ఆలోచననీ, 2005లో 'జీరోబాలెన్స్ ఎకౌంట్ పథకాన్ని ఆరంభించినప్పుడు వై.వి.రెడ్డి ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్నారనీ, ఆ తరువాత దువ్వూరి సుబ్బారావు ఆ కర్తవ్యాన్ని కొనసాగించారని చిదంబరం గుర్తుచేశారు. 2012లో ఈ పథకానికి 'బేసిక్‌సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఎకౌంట్ (బిఎస్‌బిడిఎ)'గా పేరుమార్చామని, ఆ తరువాత నరేంద్రమోదీ వచ్చి దీనిని జన్‌ధన్ యోజనగా పిలిచారని చిదంబరం చెప్పుకొచ్చారు. ఆర్బీఐ మాజీ గవర్నర్లందరికీ ఈ సందర్భంగా ప్రశంసలు దక్కాల్సిందేనని అన్నారాయన. జన్‌ధన్ యోజన మొదలై బుధవారంనాటికి పదేళ్ళయిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సహా బీజేపీ పెద్దలంతా ఆ పథకాన్ని ఆకాశానికెత్తేసిన నేపథ్యంలో చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ఆలోచనలను, పథకాలను ఎదుటిపక్షం ఎగరేసుకుపోయిందన్న విమర్శ రాజకీయాల్లో ఉన్నదే. ఆయన వ్యాఖ్యల్లో నిజం లేకపోలేదు కానీ, వాటి వెనుక ఉన్న రాజకీయోద్దేశాలను పక్కనబెడితే, జన్‌ధన్ విజయవంతమైందని మాజీ ఆర్థికమంత్రి కూడా భావిస్తున్నట్టు ఉంది.

ఆర్థికవ్యవస్థకు వెలుపల ఉండిపోయిన కోట్లాదిమందిని ఆర్థికవ్యవస్థ పరిధిలోకి తెచ్చిన ఈ బృహత్ పథకం అద్భుత విజయాలు సాధించిందని ప్రభుత్వం ప్రకటించింది. పదేళ్ళ అనంతరం 53.13 జన్‌ధన్ యోజన లబ్ధిదారులు ఉండగా, అందులో ముపె[illegible]ట్లమంది మహిళలు. ఖాతాల్లో జమచేసిన మొత్తం 2.31లక్షలకోట్లు. 2015 మార్చిలో 15.67కోట్ల ఖాతాలున్నాయని అంటున్నందున పెరుగుదల మూడురెట్లకుపైగానే ఉన్నట్టు. 66శాతం ఖాతాదారులు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్నారట. రూపే కార్డులు ఇచ్చినందున ఖాతాదారులకు తమ ఖాతాల్లో ఉన్న సొమ్ముతో లావాదేవీలు నిర్వహించుకోగలరు. బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉండిపోయినవారికి పూర్తి ఉచితంగా ఖాతాలు తెరవడం, పొదుపు, రుణం, బీమా ఇత్యాది అవకాశాలను వాటిద్వారా కల్పించడం పేదలకు కచ్చితంగా మేలుచేస్తుంది. ఆధార్ వ్యవస్థ మరింత పదునుదేలడం, మొబైల్ సేవలు విస్తరించడం, మారుమూల గ్రామాల్లో సైతం ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం వంటివి ఈ లక్ష్యసాధనకు ఉపకరించాయి. జన్‌ధన్–ఆధార్–మొబైల్ (జామ్) అనుసంధానం ద్వారా ఏర్పడిన ఈ వ్యవస్థ, అప్పటికే వేగం పుంజుకున్న డైరక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)ను మరింత సునాయాసం చేసింది. వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రజలకు అందించాల్సిన వస్తువులు, సేవలకు బదులు వారి ఖాతాల్లో కొంతసొమ్ము వేస్తే వదిలిపోతుందన్న భావన ఈ జీరోఖాతాలకు పునాది. సబ్సిడీలు దారిమళ్ళకుండా, దళారులూ మధ్యవర్తులు మధ్యలో దోచేయకుండా ఈ ఖాతాల్లోకి ప్రత్యక్షబదిలీ

నిరంతరాయంగా జరిగిపోతోందని ప్రభుత్వం సంతోషిస్తోంది. 2020–22మధ్య కేవలం మూడేళ్ళలోనే 8లక్షలకోట్లు నేరుగా ఈ బ్యాంకు ఖాతాల్లో పడ్డాయి. సంపాదించిన సొమ్ము దొంగలబారిన పడకుండా, పొదుపును బట్టి మరింత అప్పు పుట్టే అవకాశం పెరిగినందునా పేదలు వడ్డీవ్యాపారుల బారినపడకుండా ఈ వ్యవస్థ ఉపకరిస్తోంది. మహిళలకు సొంతఖాతాలు, వాటిలో డబ్బులు ఉండటం, పొదుపు, రుణాలకు అవకాశాలు పెరగడం వారి సాధికారతకు, ఆర్థిక స్వావలంబనకు వీలుకల్పిస్తుంది. సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి ఈ పథకం ప్రబల నిదర్శనమని, సామాజికంగా ఇది అద్భుతాలు చేసిందని, నేరాలు, మద్యం వినియోగం బాగా తగ్గాయని ప్రభుత్వం చెబుతోంది. జన్‌ధన్ పథకంలో ఇప్పటివరకూ సాధించిన ప్రగతికి సంతోషిస్తూనే, దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలకు ఈ ఖాతాలు కీలకంగా మారిన తరుణంలో ఈ విధానానికి ఆవల మిగిలిపోయినవారిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఖాతాలు లేనికారణంగా వారు సంక్షేమపథకాలకు దూరంకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పదేళ్ళ ప్రయాణంలో ఈ పథకం సాధించిన ఫలితాలు, ప్రభావాలతో పాటు, ఇంకా మిగిలివున్నదెంతో అధ్యయనం చేయగలిగితే విజయాన్ని మరింత కచ్చితంగా అంచనావేయవచ్చు.

ఈ రాజకీయ భావ దారిద్ర్యం తీరేదెలా?





■ యోగేంద్ర యాదవ్

రాజకీయ సిద్ధాంతం ఏమిటి? ఎవరు రాజకీయ తాత్త్వికుడు? రాజకీయ చింతన మరణించిందని ఎవరైనా ఒకరు ఎలా తీర్మానిస్తారు? ఇవీ, ఇంకా ఇతర ఆసక్తిదాయకమైన ప్రశ్నలను, నా 'చింతనాత్మక రాజకీయాలు యేవీ?' (ఆంధ్రజ్యోతి, ఆగస్టు 19) అన్న వ్యాసానికి ప్రతిస్పందిస్తూ పలువురు నాకు గుప్పించారు. వ్యాసాలు, సామాజిక మాధ్యమాల పోస్టులు, వ్యక్తిగతమైన లేఖలు, సందేశాలు, సంభాషణలు నన్ను ముంచెత్తాయి. 'చింతనాత్మక రాజకీయాలు యేవీ?' అన్న ప్రశ్నను సరైన సమయంలో వేశానన్న విషయాన్ని అవి ధ్రువీకరించాయి. ఆ ప్రశ్నను మరింత స్పష్టాతి స్పష్టం చేయవలసిన అవసరాన్ని కూడా ఆ తొలి ప్రతిస్పందనలు సూచించాయి.

అసలు ఈ 'రాజకీయ చింతన' ఏమిటి? (ఇది క్షీణించిపోవడం పట్ల నేను దుఃఖిస్తున్నాను, ఎందరో పరితాపం చెందుతున్నారు). అది, దైనందిన రాజకీయ వ్యాఖ్యానాలు, సైద్ధాంతిక వాద ప్రతివాదాలు, విధాన నిర్దేశాలను మించిన విస్తృత రాజకీయ పర్యాలోచనల ప్రస్తావన. ఈ రీతి రాజకీయ వివేచనను ఆ వ్యాసంతో మొదలుపెట్టినప్పటికీ మూడు విస్తృత ప్రశ్నలకు సాధారణ సమాధానాలు ఇచ్చేందుకై ఆ ఉపక్రమానికి విరామం పాటిస్తున్నాను.

మొదటి ప్రశ్న: ఏ వెల్లులకు మన ప్రస్థానం? ఎటువంటి రాజకీయ వ్యవస్థను సృష్టించాలని మన శుభ కామన? రాజకీయ దార్శనికత ఆవశ్యకమయ్యే నిర్ణయాత్మక ప్రశ్న ఇది. రెండో ప్రశ్న: మన ప్రస్థానంలో నేడు మనం ఎక్కడ ఉన్నాం? మనం వెళ్లాలని సంకల్పించుకున్న గమ్యానికి సమీపంలో ఉన్నామా? లేక సుదూరంలో ఉన్నామా? ఇదొక అనుభవపూర్వక ప్రశ్న (ఎంపిరికల్ క్వశ్చన్). దీనికి కార్యకారణ సంబంధాన్ని అవగాహన చేసుకొనేందుకు రాజకీయ విశ్లేషణ అవసరం. మూడవ ప్రశ్న: ఏమి చేయాలి? మనం ఎక్కడ ఉన్నామో అక్కడ నుంచి మనం వెళ్లదలుచుకున్న గమ్యానికి ఎలా వెళ్లాలి? ఇదొక నిర్దేశాత్మక ప్రశ్న. రాజకీయ కౌశలం, ఎత్తుగడలుగా రూపాంతరీకరణ కాగల రాజకీయ వివేచనా శక్తిని అది అపేక్షిస్తుంది. రాజకీయ తాత్త్వికులు అందరూ తమ దేశ పరిస్థితులు, కాలావధులకు లోబడి ఆ ప్రశ్నలన్నిటికీ ప్రతిస్పందించాలి. రాజకీయ సిద్ధాంతం, రాజకీయ తత్త్వశాస్త్రం, రాజకీయ భావజాలం లేదా రాజకీయ భావనాశక్తి.. ఏ పేరుతోనైనా పిలవండి, ఏ ప్రయోజనకరమైన రాజకీయ ఆచరణకు అయినా రాజకీయాల గురించి అటువంటి ఆలోచనా విధానం తప్పనిసరి.

సమున్నత రాజకీయ ఆచరణకు దోహదం చేసే సుసంగతమైన, గుణప్రదమైన రాజకీయ చింతనా సంప్రదాయాన్ని ఆధునిక భారతదేశం అభివృద్ధిపరిచింది. విశాల భావాలు, నిష్పాక్షిక దృక్పథంతో ఆచరణ సాధ్యమైన సిద్ధాంతాలను వెలయించిన రాజకీయ చింతకులు అన్ని భావజాలాల పరిధిలో మనకు ఎంతో మంది ఉన్నారు పైన పేర్కొన్న మూడు ప్రశ్నలకు వారు తమ తమ మార్గాలలో సాధారణ, పరస్పర సంబంధం కలిగివున్న సమాధానాలు ఇచ్చారు. అవి మన గతాన్ని అర్థం చేసుకునేందుకు, వర్తమానాన్ని వివేచించేందుకు, భవితవ్యాన్ని దర్శించేందుకు మనకు విశేషంగా దోహదం చేశాయి. ఐరోపాలోని రాజకీయ తాత్త్వికులవలే కాకుండా మన రాజకీయ చింతకులలో అత్యధికులు రాజకీయ క్రియాశీలురు. ఇప్పటి ఆలోచనాపరులకు భిన్నంగా వారు తమ తమ మాతృభాషా సంస్కృతులు, దేశీయ చింతనతో పేగుబంధం ఉన్న మేధోశీలురు. అయినా వారు ఆధునిక పాశ్చాత్య భావప్రవంతులను తరచి చూసి, వాటి నుంచి స్ఫూర్తి పొందారు. ఆ బాహ్య భావనలను గుడ్డిగా స్వీకరించడం కాకుండా ప్రాంతీయ సందర్భం, జాతీయవాద సంవేదనలతో వాటిని వడగట్టి తేర్చిన శ్రేష్ఠ ఆలోచనలతో మన జాతి జీవనంలో నవ్య భావోదయానికి స్రష్టలు అయ్యారు. విద్యాలందు మాత్రమే స్పర్థిస్తున్న భావాల భండారమే 'ఆధునిక భారతీయ రాజకీయ చింతన'. అదే మన జాతీయోద్యమానికి, మన రాజ్యాంగానికి, వలసపాలనానంతర రాజకీయాలకు ప్రాతిపదికలు సమకూర్చింది. రమారమి ఒక శతాబ్దం పాటు–1870ల నుంచి 1960ల దాకా– మహోన్నతంగా వర్ధిల్లిన ఆ చింతనా సంప్రదాయం హఠాన్మరణం కానప్పటికీ త్వరిత గతిన ప్రాధాన్యం కోల్పోయింది, అపాయకరంగా అవనతి అయింది. 21వ శతాబ్ది భారతదేశంలో రాజకీయ భావ దారిద్ర్యం, విశాల రాజకీయ అవగాహనా లేమి, సమగ్ర రాజకీయ వివేకం లోటు ఆ మహోన్నత చింతనా సంప్రదాయ క్షీణ ఫలాలే.

> రాజకీయ ఆచరణకు దోహదం చేసే సుసంగతమైన, గుణప్రదమైన రాజకీయ చింతనా సంప్రదాయాన్ని ఆధునిక భారతదేశం అభివృద్ధిపరిచింది. ఐరోపాలోని రాజకీయ తాత్త్వికుల వలే కాకుండా మన రాజకీయ చింతకులలో అత్యధికులు వర్తమాన భారతదేశంలో రాజకీయ భావదారిద్ర్యం, విశాల రాజకీయ అవగాహనా లేమి, సమగ్ర రాజకీయ వివేకం లోటు ఆ మహోన్నత చింతనా సంప్రదాయ క్షీణ ఫలాలే. ఆ చింతనా ధార మన రిపబ్లిక్‌కు ఒక జీవగర్ర. దాని స్ఫూర్తి ఒక జీవ మంత్రం. మనం ఆ జీవ స్ఫూర్తిని ఆవాహన చేసుకోవాలి.

ఈ సాధారణ ధోరణికి మినహాయింపులు ఉన్నాయి. ఆధునిక భారతీయ చింతనా సంప్రదాయంలో మూడు 'సజీవ' స్రవంతుల– స్త్రీ వాదం, సామాజిక న్యాయం, 'అభివృద్ధి' – ను నేను ప్రస్తావించాను. భారతీయ 'విశిష్టత', పితృస్వామ్య అణచివేతలను స్త్రీ వాదం చర్చిస్తోంది. వాటికి వ్యతిరేకంగా పోరాడుతోంది. జెండర్ ఎలా కులం, వర్గంతో సంకీర్ణమవుతోందో నిశితంగా వివేచిస్తోంది. చట్టం పరిమితులు, ప్రగతిశీల శక్తిగా రాజ్యవ్యవస్థ బలహీనతలు, భారతీయ సమాజ నేపథ్యంలో స్వలింగ సంపర్కుల హక్కులు మొదలైన అంశాలపై చురుకైన వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇవన్నీ, జాతీయవాద చింతనలోని 'మహిళల ప్రశ్న'ను దాటి మన రాజకీయ భావనాశక్తిని కొత్త మార్గాల్లో సాగేలా పురిగొల్పుతున్నాయి. సామాజిక న్యాయంపై చర్చలు బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రభావాల నుంచి ఇంకా బయటపడనప్పటికీ కుల అంతరాలు, జాతి వివక్షల మధ్య సమాంతరాలపై చర్చలు జరుగుతున్నాయి. కుల వ్యవస్థ రాజకీయ ఆర్థికత, పస్మాండ ముస్లింలు, మహాదళితుల సమస్యలపై చర్చలు కొత్త ఆలోచనలకు దారితీస్తున్నాయి.

'అభివృద్ధి'కి సంబంధించిన ప్రత్యామ్నాయ నమూనాలపై సహేతుక, వివేకవంతమైన చర్చలు ఇప్పుడు మహాత్మాగాంధీ ఆలోచనా సీమలను దాటిపోయి కేవలం పర్యావరణంపైనే కాకుండా నూతన ఆర్థిక, రాజకీయ వ్యవస్థల విషయమై కూడా మన ఆలోచనా ప్రగతికి మార్గదర్శకమవుతున్నాయి. అయినప్పటికీ ఇవన్నీ కలిసికట్టుగా కూడా ఆధునిక భారత రాజకీయ చింతన విలుప్తత మిగిల్చిన అపార శూన్యతను పూరించలేవు.

నా వాదనను వివరించేందుకు నేను ప్రస్తావించిన చింతకుల జాబితాలోని పేర్లపై తొలి ప్రతిస్పందనలు తమ దృష్టి నిలిపాయి., ఆక్షేపించాయి. ఈ పేర్ల విషయంలో నా తప్పును ఒప్పుకుంటున్నాను. నా ఉదాహరణల కాల పరిధిని అపార్థం చేసుకున్నందున ఆ విమర్శలకు ఆస్కారమేర్పడింది. 1947లో సజీవంగా ఉన్న చింతకులతో నా జాబితా ప్రారంభమయింది (కనుకనే జ్యోతిబా పూలే, గోపాలకృష్ణ గోఖలే పేర్లు చోటుచేసుకోలేదు). నా సమకాలికులు అయిన నిశిత సామాజిక, రాజకీయ సిద్ధాంతవేత్తలను కూడా నేను పేర్కొనలేదు (ఇందుకు మేధావులు, క్రియాశీలురు అయిన స్నేహితులకు నా క్షమాపణలు). ఆ జాబితా సైద్ధాంతికంగా తటస్థమైనది. తత్కారణంగానే నాకు ఏ మాత్రం భావసారూప్యతలేని హిందూత్వ, ఇస్లామిక్ చింతకులను కూడా ఆ జాబితాలో చేర్చాను.

రాజకీయ చింతనను ఒక పరిమితార్థంలోనే పరిగణనలోకి తీసుకున్నాను. ఆ ఈ కారణంగానే సామాజిక సిద్ధాంతవేత్తలు ఆండ్రే బెటిల్లె, జెపిఎస్ యుబెరోయ్, ఇంతియాజ్ అహ్మద్, వీణాదాస్; తత్త్వశాస్త్ర కోవిదులు దయాకృష్ణ, రామచంద్ర గాంధీ; రచయితలు నిర్మల్ వర్మ, రఘువీర్ సహాయ్ మొదలైన వారిని ప్రస్తావించలేదు. అయితే కమలాదేవి చటోపాధ్యాయ, అరుణా అసఫ్ అలీ, సరోజినీనాయుడు మొదలైన మహిళా చింతకులను మినహాయించడాన్ని ప్రొఫెసర్ నందినీ సుందర్‌తో సహా పలువురు ఆక్షేపించారు. ఇది, నా జాబితాకు ఒక విలువైన సవరణ అని అంగీకరిస్తున్నాను. స్వతంత్ర భారత చింతకులలో ఇఎమ్ఎస్ నంబూద్రిపాద్‌ను; ఆ తరువాయి తరంలోని డిఆర్ నాగరాజ్, క్లాడ్ ఆల్వేర్స్‌ను కూడా చేర్చి ఉండవల్సింది. మన మధ్యనే ఉన్న అరుణారాయ్, దిలీప్ సిమ్‌యోన్, వందనా శివ, దేవనూర మహదేవ, ఆనంద్ తెల్తుంబ్డెలను నేను ఆదర్శంగా తీసుకున్న రాజకీయ చింతనా సంప్రదాయానికి ప్రతినిధులుగా ఉదహరించివుండవల్సింది. తొలితరం రాజనీతిశాస్త్ర విశారదులలో రణధీర్ సింగ్, రషీదుద్దీన్ ఖాన్, రామ్ బాపట్, శాంతి స్వరూప్, రాఘవేంద్రరావు, మనోరంజన్ మొహంతి పేర్లు కూడా చేర్చి ఉండవల్సింది. రాజనీతి శాస్త్రాన్ని, రాజకీయ చైతన్యశీలతను సంధానించిన విద్వజ్జులు వారు.

ఇంకా మరెంతో మంది చింతకులను, ముఖ్యంగా నేను చదవలేని భాషలలో రాస్తున్న వారిని నా జాబితాలో చేర్చలేకపోయానన్న విషయం నాకు బాగా తెలుసు. ఆ మినహాయింపులు నా పరిమితులే గానీ, నేను ముందుకు తెచ్చిన ప్రాథమిక వాదనకు అవి పరిమితులు కానే కావు. నేను ఈ చర్చను ఆరంభించేందుకు ప్రేరేపించిన లక్ష్యం ఏమిటి? ఆధునిక భారత రాజకీయ చింతన 'మరణాన్ని' గుర్తించి పరితాపం చెందడం ఎంతమాత్రం కాదు. మనం ఈ పరిస్థితి (దుస్థితి కాదూ?)కి ఎందుకు వచ్చాం, మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యానికి ప్రాణరక్షకమైన చింతనా సంప్రదాయాన్ని పునశ్శక్తిమంతం చేసేందుకు ఏమి చేయాలి, ఏమి చేయగలమని సమష్టిగా వివేచించేందుకు ఆహ్వానించడమే. అవును, 'జీవ మంత్రమేది అహో, ఈ మిత్తవ జాముల్లో' అని ఆక్రోశించనవసరం లేదు. ఆధునిక భారతీయ రాజకీయ చింతన మన రిపబ్లిక్‌కు ఒక సమున్నతమైన జీవగర్ర. దాని స్ఫూర్తి ఒక జీవ మంత్రం. మరి ఆ జీవ స్ఫూర్తిని ఆవాహన చేసుకునేందుకు పూనుకుందామా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మరో 'వయనాడ్'.. ఎలా ఆపాలి?




■ సునీతా నారాయణ్

మట్టివాసన

వయనాడ్ ఒక ప్రదేశం మాత్రమే కాదు. పర్యావరణ దుర్ఘటనలకు అదొక ప్రతీక. అటువంటి విపత్తులు మరెన్నో సంభవించేందుకు ఆస్కారమున్న పరిస్థితులకూ వయనాడ్ ఒక తాజా ప్రతీక. సరిగ్గా నెల రోజుల క్రితం వయనాడ్‌లో భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడిన దుస్సంఘటనకు బాధ్యులు ఎవరు? ఎవరి అలక్ష్యం ఆ ఉపద్రవానికి దారితీసింది? ప్రాణనష్టం, ఆస్తినష్టం హృదయ విదారకంగా వాటిల్లేందుకు కారణమైన ప్రమాదం అనివార్యమైనది కాదు. నేను నా గత కాలమ్‌లో ఈ అంశాలను చర్చించాను (ఆగస్టు 15, 'వయనాడ్ విపత్తుకు కారకులు ఎవరు?').

వయనాడ్ విలయం వాటిల్లి నాలుగు వారాలు గడిచిపోయాయి. మన దృష్టి వేరే ప్రదేశాలలో వాటిల్లిన ప్రాకృతిక విధ్వంసాల పైకి మళ్లింది. అక్కడా ఇక్కడా, ఈ ధరిత్రిపై మరెక్కడైనా కొట్టివేయలేని ఒక సుస్థిర సత్యంగా ఉన్న వాతావరణ మార్పు, వయనాడ్ వినాశనంలో నిర్వహించిన పాత్రనూ నా గత కాలమ్‌లో వివరించాను. పశ్చిమ కనుమలలోని వయనాడ్ ప్రాంతం ఇప్పటికే దుర్బల పర్యావరణ సీమగా మారిపోయింది. విచక్షణారహిత మానవ కార్యకలాపాల మూలంగా వాతావరణ వైపరీత్యం పెచ్చరిల్లడంతో వయనాడ్ ఒక విషాద సీమగా పరిణమించింది. అందుకే పర్యావరణ విపత్తులు సంభవించేందుకు ఆస్కారమున్న పరిస్థితులకు వయనాడ్ ఒక ప్రతీక అన్నాను. మరి మరో 'వయనాడ్' సంభవించకుండా ఉండాలంటే మనమేమి చేయాలి?

తొలుత వయనాడ్‌లో అభివృద్ధి కార్యకలాపాలు అమలవుతున్న తీరుతెన్నులను అవగతం చేసుకుందాం. నా సహచరులు రోహిణి కృష్ణమూర్తి, పులాహ రాయ్ ఆ 'అభివృద్ధి'ని నిశితంగా పరిశీలించారు. జూలై 29 అర్ధరాత్రి వయనాడ్ జిల్లాలో సంభవించిన దుర్ఘటన నివారింప సాధ్యం కానిదని వారి దర్యాప్తులో వెల్లడయింది. భీతి గొల్పుతున్న వాస్తవమది. మరింతగా వివరిస్తాను. వెల్లెరిమల గ్రామ పరిధిలో కొండచరియలు విరిగిపడ్డాయి. సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా కె. కస్తూరి రంగన్ కమిటీ నివేదిక (2013) పేర్కొన్న గ్రామాలలో వెల్లెరిమల కూడా ఒకటి. 'పశ్చిమ కనుమల సమగ్ర సుస్థిరాభివృద్ధికి అనుసరించవలసిన పద్ధతులను' సిఫారసు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన ఆ కమిటీలో నేనూ ఉన్నాను. గ్రామ వైశాల్యంలో ఇరవై శాతానికి పైగా సున్నిత పర్యావరణ ప్రదేశాలు ఉన్న గ్రామాలు అన్నిటిలోనూ ప్రకృతి వనరులను మరింతగా ధ్వంసం చేసే అభివృద్ధి కార్యకలాపాలపై కఠిన ఆంక్షలు విధించి తీరాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. ముఖ్యంగా మైనింగ్, క్వారీయింగ్ లాంటి విధ్వంస కార్యకలాపాలను అసలు అనుమతించవద్దని కూడా కస్తూరి రంగన్ కమిటీ స్పష్టంగా సూచించింది.



మన దేశంలో సున్నిత పర్యావరణ ప్రాంతాలు మానవ ఆవాస ప్రదేశాలే గానీ నిర్జన స్థలాలు ఎంత మాత్రం కావు. ఆ ప్రాంతాలను సంరక్షించే విధానాలు సమ్మిళితంగా ఉండి తీరాలి. పర్యావరణ పరిరక్షణలో అక్కడి ప్రజలను సంపూర్ణ భాగస్వాములుగా చేసుకోవాలి. విషాదసీమ వయనాడ్ ఘోషిస్తున్న సత్యమది.

నవంబర్ 2013లో కస్తూరి రంగన్ కమిటీ నివేదికను కేంద్రం ఆమోదించింది. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని ఐదవ సెక్షన్ కింద వయనాడ్ జిల్లాలో 60,000 చదరపు కిలోమీటర్ల సువిశాల ప్రాంతం పర్యావరణ పరంగా సున్నితమైనదని ప్రకటించింది. మైనింగ్, క్వారీయింగ్‌తో సహా ఆ ప్రాంతంలో నిర్దిష్ట అభివృద్ధి కార్యలాపాలు జరగకూడదని ఆంక్షలు విధించింది. అయితే కేరళ ప్రభుత్వం ఆ సిఫారసులకు ఒక సవరణను కోరింది సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా పేర్కొన్న గ్రామాలలో నిలిపివేయడానికి వీలులేని ఇతర అభివృద్ధి కార్యకలాపాలు కొనసాగుతున్నందున అటువంటి గ్రామాలను పూర్తిగా సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా ప్రత్యేకించకూడదని తమ సొంత కమిటీ ఒకటి నిర్ధారించిందని, కనుక ఆ గ్రామాలను మాత్రమే పాక్షికంగా సున్నిత పర్యావరణ గ్రామాలుగా ప్రకటించాలని కేరళ ప్రభుత్వం అభ్యర్థించింది. కస్తూరి రంగన్ కమిటీ సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా పేర్కొన్న 13 గ్రామాలకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను పులహరాయ్ పరిశీలించారు. ఆ 13 గ్రామాలలోను 15 క్వారీయింగ్ ప్రదేశాలు ఉన్నట్లు వెల్లడయింది. ఒక్క నూల్‌పూర్ఝు గ్రామంలోనే 6 క్వారీయింగ్ ప్రదేశాలు ఉన్నాయి. అటవీ ప్రాంతంగా ప్రత్యేకించిన భూములలోనే అవన్నీ ఉన్నాయి. ఈ నియమోల్లంఘన కథ ఇంకా ఉంది. 2017లో మైనింగ్ నిబంధనలను కేరళ ప్రభుత్వం సవరించిందని రోహిణి పరిశోధనలో వెల్లడయింది. ఒక నివాస గృహానికి 50 మీటర్ల ఆవల అటవీ భూములు, కొండ వాలు ప్రాంతాల్లో గానీ ఎక్కడైనా సరే పేలుడు సామగ్రిని ఉపయోగించేందుకు ఆ సవరణలు అనుమతిచ్చాయి. అంటే మీ ఇంటి వెనుక ఉన్న కొండలను అస్థిరపరిచే పరిస్థితులను సృష్టించడం చట్టబద్ధమే అవుతుంది.

ఈ పరిస్థితులను నివారించేందుకు మనమేమి చేయాలి అన్నది ఇప్పుడు అసలు ప్రశ్న. పశ్చిమ కనుమల పర్యావరణ రక్షణకు తొలుత మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసులను, ఆ తరువాత కస్తూరి రంగన్ కమిటీ సూచనల అమలును సున్నిత పర్యావరణ ప్రాంతాల ప్రజలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ ప్రాంతాలలో పర్యటించినప్పుడు పర్యావరణ పరిరక్షణ చర్యల పట్ల ప్రజల విముఖతను నేను స్వయంగా గమనించాను. పరిరక్షణ పద్ధతులు, చర్యలను ప్రజలు వీధులలోకి వచ్చి నిరసిస్తున్నారు. వారు తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారా? వాస్తవమేమిటంటే సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా ప్రకటించడం ద్వారా తమ తోటలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చని, తాము అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులపై ఆంక్షలు విధించవచ్చని వారు భయపడుతున్నారు. వారి భయాందోళనలకు కారణమేమిటి? పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం, అదీ హేతుబద్ధం కాని నిర్ణయాలు తీసుకుని అమలుపరుస్తుండడమే సుమా!

పర్యావరణ పరిరక్షణ విధానాల రూపకల్పనలో మనం ఈ వాస్తవాలను తప్పక దృష్టిలో ఉంచుకోవాలి. పర్యావరణ వ్యవస్థల నిర్వహణకు అనుసరిస్తున్న పద్ధతులను మనం శీఘ్రగతిన మార్చుకోవల్సివుంది. వాతావరణ మార్పు పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇది తప్పనిసరి. పర్యావరణంపై మానవ కార్యకలాపాల ప్రభావం తీవ్ర స్థాయిలో ఉంటున్నందున ప్రకృతి వనరులకు హాని కలిగిస్తున్న సదరు కార్యకలాపాలపై కఠిన ఆంక్షలు విధించి తీరాలనే భావన ప్రాతిదికన పర్యావరణ పరిరక్షణ విధానాలను రూపొందిస్తున్నారు. ఇది సరైన విషయమే కావచ్చు గానీ మన దేశంలో సున్నిత పర్యావరణ ప్రాంతాలు మానవ ఆవాస ప్రదేశాలే గానీ నిర్జన స్థలాలు ఎంత మాత్రం కావు. ఇది వాస్తవం. ఆ ప్రాంతాలు జనవాసాలు మాత్రమే కాదు, వ్యవసాయ భూములకు నెలవులు కూడా. మరి అటువంటి సున్నిత పర్యావరణ ప్రాంతాలను సంరక్షించే విధానాలు సమ్మిళితంగా ఉండి తీరాలి. పర్యావరణ పరిరక్షణలో అక్కడి ప్రజలను సంపూర్ణ భాగస్వాములుగా చేసుకోవాలి. ఇందుకు ఆ ప్రాంతాలలోని సామాజిక సముదాయాలకు ప్రయోజనకరమైన ప్రోత్సాహకాలు సమకూర్చాలి.

కాఫీ, తేయాకు తోటల పెంపకం, పర్యావరణ–పర్యాటకం మొదలైన హరిత జీవనాధారాల ప్రాతిపదికన అభివృద్ధి పథకాలు రూపొందించుకోవడం చాలా చాలా ముఖ్యం. ప్రజల భూములను వారి భాగస్వామ్యంతో సంరక్షించడాన్ని మనం నేర్చుకోవాలి. వయనాడ్ విపత్తు చెప్పుతున్న సత్యమది. వాతావరణ మార్పు చిక్కులు జటిలమవుతోన్న ఈ కాలంలో విషాదసీమ వయనాడ్ పాఠాలు స్పష్టంగా ఉన్నాయి. మనం వాటిని నేర్చుకోవాలి. నేర్చుకోవడమంటే పర్యావరణకు అనుసరించే పద్ధతులను మార్చుకోవడమే. పర్యావరణ పరిరక్షణలో గుణప్రదమైన మార్పును సత్వరమే సాధించలేనిపక్షంలో మన మనుగడ శాశ్వతంగా అపాయంలో పడుతుంది.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

వర్గీకరణం.. రణం.. సార్వకాలీన సత్యం!!



■ రాహుల్ కుమార్

రాజకీయాల్లో రణ నినాదాలు, ఆర్భాట ప్రకటనలు, శుష్క వాగ్దానాలు మాత్రమే కాదు.. అర్థవంతమైన మౌనాలు ఉంటాయి. మిగతా వాటి సంగతి ఎలా ఉన్నా ఒక దానిపై అర్థవంతమైన మౌనం ప్రస్తుతం రాజ్యమేలుతోంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్రాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పుని ఇచ్చిన తర్వాత ప్రధాన జాతీయ పార్టీలు దాన్ని ఘనంగా పాటిస్తున్నాయి! ఎస్సీల్లో సంపన్నశ్రేణికి చెందిన వారికి రిజర్వేషన్లను మినహాయించటం మంచిదనే అభిప్రాయాన్ని నలుగురు న్యాయమూర్తులు వ్యక్తంచేయటంపై మాత్రం పార్టీలు స్పందించాయి. దళిత వర్గానికి చెందిన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్ సంపన్న శ్రేణి మినహాయింపుపై విపులంగా వ్యాఖ్యలు చేశారు. నిజానికి సంపన్నశ్రేణిపై న్యాయమూర్తులది కేవలం సూచన మాత్రమే. అది ప్రధాన తీర్పులో భాగం కాదు. అయినా దానికి రెండు జాతీయ పార్టీలూ ప్రాధాన్యాన్ని ఇచ్చాయి. బీజేపీ సూటిగా స్పందించకుండా కేంద్ర క్యాబినెట్ అభిప్రాయం పేరుతో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఒక ప్రకటనను చేయించింది. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే కేంద్రం నడుచుకుంటుందనీ అందులో సంపన్నశ్రేణి ప్రస్తావన లేదు కాబట్టి దాన్ని అమలుపరచబోమని మంత్రి చెప్పారు. ఎంత తరచి చూసినా అదొక విధాన ప్రకటనలా అనిపించదు. వర్గీకరణ తీర్పుపై అసంతృప్తితో ఉన్న కొన్ని ఎస్సీ వర్గాలను సమాధానపరచటానికి దాన్ని చేసినట్టుగా కనపడుతుంది. రాజ్యాంగంలో వర్గీకరణ విషయమూ లేదు. సంపన్నశ్రేణి ప్రస్తావనా లేదు. మండల్ కమిషన్ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు సంపన్నశ్రేణి విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సంపన్నశ్రేణి గురించి వివరణ ఇప్పించిన తర్వాత వర్గీకరణ అమలుపై మాత్రం బీజేపీ నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాత్రం సంపన్నశ్రేణిపై తమ పార్టీ వైఖరి ఏమిటో స్పష్టంగానే వెల్లడించారు. దాన్ని ఎస్సీలకు వర్తింపచేయకుండా చట్టం చేయాలని డిమాండు చేశారు. కానీ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ పార్లమెంటు ఒక చట్టాన్ని చేయాలని మాత్రం డిమాండు చేయలేదు. మొత్తం సమస్యను అధ్యయనం చేయటానికి ఒక కమిటీని కాంగ్రెస్ నియమించింది. ఆ కమిటీ ఇచ్చే నివేదికపై నిర్ణయం తీసుకునే వరకూ వర్గీకరణపై ఎవరూ మాట్లాడకూడదనీ ఆదేశించింది. పార్టీ పాలిత రాష్ట్రాల్లో కూడా వర్గీకరణపై నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చిచెప్పింది. ఇక బీజేపీ వైపు నుంచి అట్లాంటి కమిటీ కూడా ఏర్పాటైనట్లు లేదు.

నిజానికి వర్గీకరణ సమస్య కొత్తది కాదు. ఎస్సీ వర్గాల మధ్యనే గాక సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని వాదించే మేధావులు, రాజకీయవేత్తల మధ్య ఎప్పటి నుంచో దానిపై చర్చలు సాగుతున్నాయి. ఆర్థికంగా, విద్యాపరంగా ఎదిగిన కులాల్లోని వారే రిజర్వేషన్లను అత్యధికంగా ఉపయోగించుకున్నారని చెప్పటానికి సమాచారం చాలా ఉంది. మిగతా కులాలకు చాలా వరకూ అవి చేరలేదన్న సంగతీ అనేక పరిశీలనల్లో తేలింది. అయినా పార్టీలు వర్గీకరణను అమల్లో పెట్టటానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నాయని ప్రశ్నించుకుంటే కులాల సంఖ్యాబలాలనే అందుకు కారణంగా చెప్పుకోవాలి. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములను నిర్ణయించేది సంఖ్యాబలమే కాబట్టి అది అధికంగా ఉండి రాజకీయ ప్రభావాన్ని చూపించే కులాలను దూరం చేసుకోటానికి పార్టీలు సిద్ధంగా లేవు. రకరకాల కారణాలతో అధిక పదవులనూ సంపదలనూ ఆదాయాలనూ అనుభవిస్తున్న వర్గాలు ఏ ఒత్తిళ్లు లేకుండా వాటిని వదులుకున్న సందర్భాలు చరిత్రలో లేవనే చెప్పాలి. అన్ని వర్గాలకూ కులాలకూ వర్తించే సార్వకాలీన సత్యం ఇది!

> ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములను నిర్ణయించేది సంఖ్యాబలమే కాబట్టి అది అధికంగా ఉండి రాజకీయ ప్రభావాన్ని చూపించే కులాలను దూరం చేసుకోటానికి పార్టీలు సిద్ధంగా లేవు. రకరకాల కారణాలతో అధిక పదవులనూ సంపదలనూ ఆదాయాలనూ అనుభవిస్తున్న వర్గాలు ఏ ఒత్తిళ్లు లేకుండా వాటిని వదులుకున్న సందర్భాలు చరిత్రలో లేవనే చెప్పాలి.



ఎస్సీల్లోనే కాదు బీసీల్లోనూ పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్ల ఫలాలను కొన్ని కులాలే అత్యధికంగా అందుకున్నాయి. బిహార్‌లో చేపట్టిన సామాజిక ఆర్థిక కులగణనలో వెల్లడైన నిజమదే. ఓబీసీల్లోని మూడు నాలుగు కులాలే సింహభాగం రిజర్వుడు ఉద్యోగాలను, పదవులను చేజిక్కించుకున్నాయి. భూములు, భవనాలు, వస్తు, వాహనాలూ వారి దగ్గరే అధికంగా ఉన్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా వెల్లడించిన సమాచారంలో చాలా పరిమితులు ఉంటాయి. ఆస్తులు, సంపద గురించి ఉన్నదున్నట్లుగా ప్రజలు ఒకపట్టాన చెప్పరు. అయినా ఆ పరిమిత సమాచారమే కులాల ఆర్థిక స్థితిగతులను కాస్త విపులంగా తెలుసుకోటానికి ఉపయోగపడుతుంది.

సామాజికంగా అణచివేతకు గురైన ఏ కులమూ ఇప్పుడు గతంలో లాగా లేదు. సంఖ్యాబలం బాగా ఉన్న ప్రతికులంలోనూ ఆర్థికపరమైన అంతరాలతో కూడిన వర్గాలు ఏర్పడ్డాయి. ఆర్థిక సంస్కరణలు అమలు తర్వాత ఈ అంతరాలు ఇంకా పెరగటం వల్ల ఓబీసీ కులాల్లో రాజకీయ సంఘీభావం కనపడటం లేదనీ ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోఫ్ జఫలాట్ వ్యాఖ్యానించటమే ఇందుకు నిదర్శనం. హిందీ రాష్ట్రాల్లో ఓబీసీ రాజకీయ పార్టీలు బలహీనపడటానికి వర్గపరమైన ఆర్థిక అంతరాలే కారణమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఫ్రెంచ్ దేశస్థుడైనా జఫలాట్ లాగా దేశంలో ఓబీసీ రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసినవారు చాలా అరుదునే చెప్పాలి. ఇక ఓబీసీల్లోని ఆధిపత్య కులాల పట్ల అసంతృప్తితో ఉన్న ఇతర కులాలను చేరదీసి రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వటం వల్లే హిందీ రాష్ట్రాల్లో బీజేపీ స్థిరంగా బలపడింది. ఒక్క హిందూత్వ రాజకీయాలపైన మాత్రమే ఆధారపడితే బీజేపీ ఎన్నికల్లో చాలా ఒడిదుడుకులకు లోనయ్యేది.


ఎస్సీ కేటగిరిలోని కులాలను సంఖ్యాబలం దృష్టితో పరిశీలిస్తేనే రిజర్వేషన్ల వర్గీకరణపై ఎందుకంత వ్యతిరేకత వస్తుందో కొంత మేరకైనా అర్థం చేసుకోగలం. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం చూస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలు 1,38,78,078 ఉన్నారు. మొత్తం 60 కులాలను ఎస్సీ జాబితాలో చేర్చారు. ఈ 60 కులాల్లోనూ లక్ష పైచిలుకు జనాభా ఉన్న కులాలు ఏడు మాత్రమే ఉన్నాయి. ఈ ఏడు కులాల జనాభాని లెక్కగడితే 1,31,26,029 మంది తేలారు. అంటే అక్షరాల 94.58 శాతం జనాభా ఈ ఏడు కులాల్లోనే ఉంది. మిగతా 53 కులాల మొత్తం జనాభా 7,52,049 (5.42 శాతం) మాత్రమే.

ఏడు కులాల మధ్య కూడా జనాభా పంపిణీలో వ్యత్యాసాలు విపరీతంగా ఉన్నాయి. ఈ ఏడు కులాల్లోని మాదిగ (67,02,609), మాల–మాలసాలె (57,03,491) లను కలిపి లెక్కిస్తే జనాభాలో 94.5 శాతం వాళ్లే కనపడతారు. మిగిలిన అయిదు కులాల.. ఆది ఆంధ్ర, ఆది ద్రవిడ, బేడజంగం, రెల్లి... జనాభా 5.5 శాతం మాత్రమే. ఈ అంకెలు చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. మాదిగలకు గణనీయ సంఖ్యాబలం లేకపోతే వర్గీకరణ పోరాటంలో వాళ్లు గెలిచి ఉండేవారు కాదు. అక్షరాస్యతలో ఆది ఆంధ్ర (62.4శాతం), ఆది ద్రవిడ (62.6శాతం), మాల (60.13శాతం), రెల్లి (56.2శాతం) పోల్చితే మాదిగలు (51.3శాతం) దిగువన ఉన్నప్పటికీ సంఖ్యా బలానికి రాజకీయ చైతన్యం తోడై వర్గీకరణ కోసం ఏళ్లపాటు ఆందోళన కొనసాగించటానికి దోహదం చేసింది. రిజర్వేషన్ల ఫలాలను అధికంగా అనుభవిస్తున్న కులాలకు దీటుగా ఆ ఫలితాలను అనుభవించలేని కులాలకు తగిన సంఖ్యాబలం లేకపోతే, వారి పోరాటాల ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించలేం! జనాభాలో దళితులు అయిదో వంతు ఉన్న ఉత్తరప్రదేశ్‌లో కూడా కులాల సంఖ్యాబలంలో ఇలాంటి అసమానతలే కనిపిస్తాయి. అక్కడ జాతవ్‌లు (అనుబంధ కులాలతో కలిపి) 2,24,96,047 మంది ఉన్నారు. రాజకీయంగా వారిదే ఆధిపత్యం. మొత్తం ఎస్సీ జనాభాలో (4,13,57,608) జాతవ్‌ల వాటా 54.39 శాతం ఉంది. పాసి–తార్‌మలి కులం (65,22,166) రెండో స్థానంలో ఉంది. మొత్తం 66 ఎస్సీ కులాల్లో 10వేల లోపు జనాభా ఉన్న కులాలు 36 ఉన్నాయి. లక్షపైన ఉన్న కులాలు 15 ఉన్నాయి. ఆర్థిక, విద్యాపరమైన తేడాలు అక్కడ కులాల మధ్య కూడా చాలా ఎక్కువ. జాతవ్‌ల్లో అక్షరాస్యులు 53 శాతం ఉంటే ముసాహర్‌ల్లో 19.16 శాతం మందికి మాత్రమే అక్షర జ్ఞానం ఉంది.

జనాభా లెక్కల్లో నమోదైన సమాచారం కొంతమేరకే వాస్తవ చిత్రాన్ని అందిస్తుంది. దాన్ని నిశితంగా పరిశీలించినా ఎస్సీ, ఎస్టీ కులాల్లో అసమానతలు కొట్టొచ్చినట్లు కనపడతాయి. ఇక వివిధ కేటగిరీ ఉద్యోగాల్లో, పదవుల్లో లెక్కలను నిర్దిష్టంగా ప్రభుత్వాలు సేకరిస్తే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి. ఎవరు ఎక్కడ ఉన్నారో తేలుతుంది. రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ప్రకటించినా రాజకీయ దృష్టితో అసంబద్ధంగా దాన్ని చేపడితే ఉపేక్షించబోమని స్పష్టంచేసింది. విద్య, ఉద్యోగాలకు సంబంధించి వివిధ స్థాయిల్లో తగినంత ప్రాతినిధ్యం లేదని పక్కాగా సమాచారాన్ని సేకరించిన తర్వాతే సంబంధిత కులాలకు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాలని నిర్దేశించింది. అట్లా జరగని పక్షంలో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు న్యాయసమీక్షకు నిలబడాల్సి వస్తుందనీ హెచ్చరించింది. జనాభా సంఖ్యకు దామాషాగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉండాలనీ కాకుండా, సముచిత ప్రాతినిధ్య కోణం నుంచి మాత్రమే తగిన వాటాలు కల్పించాలని తీర్పు సారాంశంగా అర్థం చేసుకోవచ్చు. సుప్రీంకోర్టు షరతులు, వ్యాఖ్యల నేపథ్యంలో వర్గీకరణను చేపట్టి రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించటం ప్రభుత్వాలకు కత్తిమీద సామే అవుతుంది.

వర్గీకరణ డిమాండ్లను దీర్ఘకాలిక ఆర్థిక మార్పుల నేపథ్యంలో పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. కులానికి కులం మొత్తంగా కొన్నిచోట్ల సామాజికంగా, ఆర్థికంగా ఒకే స్థాయిలో వెనుకబడి ఉండొచ్చు. ముఖ్యంగా ఆధునిక ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చొచ్చుకెళ్లని మారుమూల గ్రామాల్లో కొన్నిచోట్ల అంతర్గత తారతమ్యాలు కింది కులాల్లో కొట్టొచ్చినట్లు కనపడకపోవచ్చు. కానీ వాటి సంఖ్య గణనీయమని ఇప్పుడు చెప్పుకోలేం. కులాల మధ్యా అంతర్గతంగా విడివిడి కులాల్లోనూ ఆర్థిక, విద్యా అసమానతలే క్రమేపీ పైచేయిని సాధిస్తున్నాయి. వర్గీకరణ డిమాండ్లకు అవే కారణమవుతున్నాయి. అధికారార్జనకు రాజకీయ పాచికగా మారకపోతే... ఆర్థిక, సామాజిక, కులగణనతో కొంత నిఖారె[illegible] చిత్రం కనపడే అవకాశమూ ఉంటుంది. అప్పుడు చేపట్టే చర్యల ద్వారా కులగణన కోసం అలుపెరగకుండా వాదనలు చేస్తున్న కాంగ్రెస్ తదితర పార్టీల అసలు రంగులు బయటపడతాయి. కచ్చితమైన లెక్కలు వచ్చినప్పుడు ఎస్సీ, ఎస్టీల్లో సంపన్నశ్రేణి విభజన అవసరమో కాదో కూడా స్పష్టమవుతుంది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)





కూచిపూడికి పునర్వైభవం

విదేశాల్లో కూచిపూడిని కాపాడుకుంటున్నారు

మనం మాత్రం కళను మరిచిపోతున్నాం..

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన

- తెలుగు వారసత్వ సంపదను పరిరక్షించుకుందాం..
- కళలకు ప్రాధాన్యమిద్దాం..
- తెలుగు భాషా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'తెలుగు వారి వారసత్వ ఆస్తి అయిన కూచిపూడి నాట్యం ప్రపంచ గుర్తింపును సాధించింది. అయితే, కూచిపూడి గురించి నేటితరం తెలుసుకోలేకపోతోంది. ఈ నాట్యానికి పునర్వైభవం తీసుకొచ్చేలా చేస్తాం. మన తెలుగు భాష, మన నాగరికత, మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో చంద్రబాబు ప్రసంగించారు. కూచిపూడి నాట్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మన కృష్ణాజిల్లాలో పుట్టి, ప్రపంచ గుర్తింపుపొందిన కూచిపూడిని మనవారు పట్టించుకోకపోవటంపై చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుజాతి ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలంటే.. భాషపై మమకారంతో పాటు తెలుగు వారసత్వ ఆస్తులైన కళలపై కూడా శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. వారసత్వ కళలైన నాట్యం, నాటకాలు, సంగీతం, చిత్రలేఖనం వంటి వాటిపై దృష్టి సారిస్తామన్నారు. వీటిని అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించేందుకు వీలుగా ఐసీసీఆర్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకుంటామని, డ్రామా అకాడమీలు, సంగీత్ నాటక్ అకాడమీల బ్రాంచీలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల తెలివితేటలు పెరగవన్నారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యాభ్యాసం జరగాలని, అలాంటివారే తెలివితేటలు కలిగిన వారవుతారని అధ్యయనంలో తేలిందని చంద్రబాబు పేర్కొన్నారు.

జీవితం కోసం తెలుగు అవసరమని, జీతం కోసమే ఆంగ్లమన్నారు. ఆంగ్ల చదువులు చదవకపోయినా ప్రపంచ దేశాల్లో స్థిరపడి రాణిస్తున్న వారి ఉదంతాలను చంద్రబాబు ప్రస్తావించారు. గిడుగు రామ్మూర్తిని స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషోద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

విదేశాల్లో ఉంటున్న వారిలా.. ఇక్కడ ఉంటున్నవారు కూడా తెలుగు భాషా వికాసం, మన కళలు, వారసత్వ సంపదలను పరిరక్షించుకునేందుకు కృషి చేయాలన్నారు.

కొండపల్లి బొమ్మల కళాకారుడు సాంబశివరావుకు అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అవార్డులు అందుకున్నవారు వీరే..

గిడుగు రామ్మూర్తి 161వ జయంతి సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వివిధ రంగాల్లో ప్రముఖులైన ఏడుగురికి అవార్డులు, నగదు బహుమతులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందజేశారు. ఆచంట బాలాజీనాయుడు-నాటకం (ఎన్టీఆర్ జిల్లా), మల్లాది సూరిబాబు-కర్నాటక సంగీతం (ఎన్టీఆర్ జిల్లా), శారదా రామకృష్ణ-ఆంధ్ర నాట్యం (ఎన్టీఆర్ జిల్లా), జి.లక్ష్మీ నరసయ్య-రైటర్ (కృష్ణా), సాంబశివరావు-కొండపల్లి బొమ్మల కళాకారుడు (ఎన్టీఆర్ జిల్లా), అశోక్ కుమార్-అలకనంద ప్రచురణలు (ఎన్టీఆర్ జిల్లా), మోదుమూడి సుధాకర్-సంగీతం (ఎన్టీఆర్ జిల్లా)కు అవార్డులు అందజేశారు.

క్రీడా ర్యాలీ



6లో..

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియం నుంచి గురువారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్రీడల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హాజరుకాగా, ప్రత్యేక ఆకర్షణగా ఒలింపియన్లు పీవీ సింధు (బ్యాడ్మింటన్), యర్రాజీ జ్యోతి, దండిక జ్యోతికశ్రీ (అథ్లెటిక్స్), ధీరజ్ (ఆర్చరీ) హాజరయ్యారు.

దర్జాగా దోపిడీ



కీసర స్టాక్ యార్డులో ఇసుక లోడింగ్

జిల్లాలో రెండు లక్షల టన్నుల ఇసుక మాయం

నందిగామ నియోజకవర్గంలోని 8 స్టాక్‌యార్డుల్లో..

- టీడీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కు
- లోడింగ్ చార్జీలు కూడా చెల్లించకుండా ఇసుక తరలింపు
- కీసర స్టాక్‌యార్డులో లక్ష టన్నులు హాంఫట్
- నియోజకవర్గంలోని మిగిలిన యార్డుల్లోనూ ఇదే పరిస్థితి

- కంచికచర్ల మండలం కీసర స్టాక్‌యార్డులో 2,24,555 టన్నుల ఇసుక ఉన్నట్లు జూలై 6న కలెక్టర్ ప్రకటించారు. ఆగస్టు 28 నాటికి ఈ స్టాక్ యార్డు నుంచి 80,335 టన్నుల ఇసుక విక్రయం జరిగిందని, టన్ను ఇసుక రూ.290 చొప్పున ప్రభుత్వానికి రూ.2.33 కోట్లు జమ అయ్యిందని తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం కీసర స్టాక్ యార్డులో 1,44,220 టన్నుల ఇసుక నిల్వ ఉండాలి. కానీ, క్షేత్రస్థాయిలో 40 వేల టన్నులు కూడా లేదనేది అధికారులు చెబుతున్న మాట. అంటే సుమారు లక్ష టన్నుల ఇసుక గుట్టలు మాయమైపోయాయి.
- ఒక్క కీసరే కాదు.. నందిగామ నియోజకవర్గంలోని 8 స్టాక్‌యార్డుల్లో 2 లక్షల టన్నుల ఇసుక దోపిడీకి గురైందని తెలుస్తోంది. స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై ఈ దోపిడీకి తెరతీయడంతో ప్రభుత్వానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇసుక కష్టాలకు చెక్ పెట్టేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది ప్రారంభించే సమయానికి వర్షాకాలం ప్రారంభం కావడంతో కేవలం జిల్లాలోని 8 స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉన్న 5.54 లక్షల టన్నుల ఇసుకను ఉచితంగా ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ఆయా స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుక నిల్వలను అధికారికంగా ప్రకటించారు. అయితే, ఉచిత ఇసుక ప్రారంభమైన నాటి నుంచి దోపిడీ మొదలైంది. అధిక ఇసుక నిల్వలు ఉన్న స్టాక్ యార్డులన్నీ నందిగామ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు, ఆయన బంధుగణం ఇసుక దోపిడీకి తెరదీశారు. ఈ దోపిడీకి నిలువెత్తు నిదర్శనమే కీసర స్టాక్ యార్డులోని ప్రస్తుత నిల్వ. ఒక్క కీసరలోనే కాదు మోగలూరులో జూలై 6 నాటికి 1,39,865 టన్నుల నిల్వ ఉండగా, ఇక్కడా సుమారు 50 వేల టన్నుల ఇసుక పక్కదారి పట్టింది. ప్రభుత్వం లోడింగ్ ఖర్చుల కింద టన్నుకు రూ.290 వసూలు చేస్తోంది. ఈ దోపిడీ కారణంగా ఆ మొత్తం ఖజానాకు చేరడం లేదు. మొత్తం 8 స్టాక్ యార్డుల్లో కలిపి సుమారు 2 లక్షల టన్నుల ఇసుక దోపిడీ జరిగిందని ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ లెక్కన సుమారు రూ.6 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండి పడగా, అంతకు నాలుగైదు రెట్లు నాయకుల జేబుల్లోకి చేరాయి.

పర్యవేక్షణ శూన్యం

ఇసుక స్టాక్ యార్డులపై పోలీసు శాఖ కానీ, ఇంటెలిజెన్స్ విభాగం కానీ, మైనింగ్ శాఖ అధికారుల కనీస పర్యవేక్షణ కానీ ఉండట్లేదు. దీంతో స్థానికంగా కాస్త బలమైన నాయకుడిదే రాజ్యం అన్నట్లుగా మారిపోయింది. కీసర స్టాక్‌యార్డు అక్రమాలపై ఆరోపణలు వస్తుండటంతో గురువారం విజయవాడ మైనింగ్ ఏడీ వీరాస్వామి స్టాక్‌యార్డును సందర్శించారు. యార్డులోని పరిస్థితిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒకరోజు 50 లారీలు స్టాక్‌యార్డులోకి వస్తే వాటికి టోకెన్లు ఇచ్చి బిల్లులు ఇవ్వమని చెబుతున్నాం. కానీ, వంద టోకెన్లు ఎందుకు ఇస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని దరిద్రం నందిగామ స్టాక్ యార్డులోనే ఉంది. మిగిలిన స్టాక్‌యార్డుల్లో 100 నుంచి 200 లారీల్లో లోడ్ చేస్తుంటే, ఇక్కడ మాత్రం 70 కూడా పోయలేకపోతున్నారు. టోకెన్లు లేని బండ్లను లోపలికి ఎందుకు రానిస్తున్నారు' అంటూ ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఓ అధికారి సమక్షంలోనే 12 లారీలు ఇసుక లోడ్‌తో వెళ్లాయి. ఆయన రికార్డులను పరిశీలించగా, కేవలం రెండు లారీలకే ఆన్‌లైన్ బుకింగ్ టోకెన్లు ఉండటం గమనార్హం.



కీసర స్టాక్‌యార్డులో మైనింగ్ ఏడీ వీరాస్వామి తనిఖీలు

ఏం జరుగుతోందంటే..

కంచికచర్లకు చెందిన ఓ టీడీపీ నాయకుడు, ఆయన సోదరుడి కుమారుడు నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లన్నింటినీ తమ గుప్పెట పట్టారు. వీరు తమ సొంత లారీలను పెట్టుకుని నేరుగా స్టాక్‌యార్డులోకి వెళ్లి లోడింగ్ చార్జీలు కూడా చెల్లించకుండా ఇసుకను తీసుకెళ్లిపోతున్నారు. కీసర స్టాక్ యార్డుకు మండల పరిషత్

మిగతా 6వ పేజీలో...

వెయింగ్ బ్రిడ్జిలు ఏవీ?

స్టాక్‌యార్డుల వద్ద ఎక్కడా వెయింగ్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయలేదు. దీంతో లారీల్లో ఎంత లోడు చేస్తున్నారనే దానికి లెక్కల్లేవు. పొక్లయినర్ల బకెట్లతో ఇసుక తోడి లారీల్లో పోస్తున్నారు. ఒక బకెట్ 2.25 టన్నులు ఉంటుందని ఉజ్జాయింపుగా లెక్క వేస్తున్నారు. 10 టైర్ల లారీలో 9 బకెట్లు వేస్తున్నారు. అంటే.. సుమారు 20 టన్నుల లోడింగ్ చేస్తున్నారు. అయితే, 20 టన్నులు వేసుకుని వెళ్తే తమకు గిట్టుబాటు కావడం లేదని లారీల వారు గొడవ చేస్తుండటంతో అదనంగా మరో నాలుగైదు బకెట్లు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 టన్నుల లోడింగ్ చేయడం ఓవర్ లోడింగ్ కిందకు వస్తుంది. కానీ, ఇలాంటి నిబంధనలేవీ ఇక్కడ అమలు కావడం లేదు. అదనంగా వేసే ఒక్కో బకెట్‌కు రూ.700 వరకు వసూలు చేస్తున్నారు.

ఆ కేసు ఏమైనట్టు?

రవాణా శాఖలో పెండింగ్‌లోనే ట్యాక్స్ ఎగవేత కేసు

వైసీపీ హయాంలో రూ.కోట్లలో రవాణా పెద్దల అవినీతి

ట్యాక్స్ ఎగవేతపై డీలర్‌షిప్ రద్దుతో సరి

రవాణా శాఖ అధికారుల పాత్రపై వీడని మిస్టరీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా శాఖలో కోట్ల రూపాయల ట్యాక్స్ ఎగవేత కేసు అంతుచిక్కని మిస్టరీగా మారింది. ఈ కేసులో డీలర్ లైసెన్సును రద్దుచేసి చేతులు దులుపుకొన్నా.. బాధ్యులైన రవాణా శాఖ అధికారులపై విచారణ మాత్రం ఆగిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తొక్కిపెట్టిన ఈ కేసుపై ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వమైనా సమగ్ర విచారణ జరిపి నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

రూ.కోట్లలో అవినీతి

వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ కేంద్రంగా రవాణా శాఖలో భారీ అవినీతి జరిగింది. వీటిలో ప్రధానమైనది వాహన్ సైట్ ట్యాంపరింగ్ కాగా, రెండోది రాధా మాధవ్ టయోటా ట్యాక్స్ ఎగవేత. ఈ రెండింటిలో రవాణా శాఖ అధికారుల పాత్ర ప్రత్యక్షంగా ఉందని ఫిర్యాదులు రావటం, ప్రాథమిక విచారణలో నిజమేనని తేలటం జరిగింది. ఆ తర్వాత సమగ్ర విచారణలు మాత్రం ఆగిపోయాయి. వాహన్ సైట్ హ్యాకింగ్ స్కామ్‌ను మమ.. అనిపించి చేతులు దులుపుకోగా, ట్యాక్స్ ఎగవేత కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ కేసుపై సమగ్ర విచారణ ఎందుకు జరపటం లేదన్నది మిస్టరీగానే ఉండిపోయింది. బాధ్యులైన అధికారులపై కేసులు పెట్టారు. ప్రాథమిక విచారణలో బాధ్యులెవరో తేలకపోతే సమగ్ర విచారణకు ఆదేశించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జరిగింది ఇదీ..

విజయవాడ రూరల్ మండల పరిధిలోని ఎనికేపాడులో రాధా మాధవ్ టయోటా కార్ల షోరూమ్ కేంద్రంగా భారీ స్కామ్ జరిగింది. అప్పట్లో ఈ షోరూమ్‌లో కొనుగోలు చేసిన కార్లకు సంబంధించి రవాణా శాఖకు కట్టాల్సిన పన్ను చెల్లించలేదు. ఇది రూ.కోట్లలోనే ఉంటుందని రవాణా శాఖ అధికారులే తేల్చారు. అలాగే, సదరు షోరూమ్‌లో చాలామంది కార్లను కొనుగోలు చేసినా డెలివరీ ఇవ్వలేదు. దీనిపై రవాణా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. వీటిని చాలాకాలం తొక్కిపెట్టారు. బాధితులు మీడియా దృష్టికి తీసుకురావటం, పత్రికల్లో కథనాలు రావటంతో ఫిర్యాదులు తీసుకునే అవకాశం కల్పించారు. ఈ ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారో ఇప్పటి వరకు తెలియదు. ఆ సంస్థ డీలర్‌షిప్‌ను రద్దు చేసిన అధికారులు.. దీనికి బాధ్యత వహించాల్సిన రవాణా శాఖ అధికారులపై చర్యలు తీసుకోకపోవటం గమనార్హం. రవాణా శాఖ ఉన్నత స్థాయిలో సరైనటువంటి పర్యవేక్షణ చేయక పోవటం వల్లే ప్రభుత్వానికి నష్టం జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ప్రాథమిక విచారణ కూడా జరిగింది. అప్పట్లో రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఈ స్కామ్‌కు కారణమని రవాణా శాఖ కమిషనర్ తెలిపారు. అప్పట్లో రవాణా శాఖలో ఉన్న మరో కీలక అధికారిని కమిషనర్ సస్పెండ్ చేశారు. కమిషనర్ చర్యలు దుందుడుకుతనమని సస్పెండ్‌కు గురైన అధికారి అప్పటి వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నాటి నుంచి ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది. సస్పెండ్‌కు గురైన అధికారిని కావాలనే ఇరికించారా? ఇంకెవరైనా ఉన్నారా? దీనికి ఎవరు బాధ్యత వహించాలి? అనే అంశాలను వైసీపీ ప్రభుత్వం తేల్చలేదు. ఇప్పటికీ మిస్టరీగా మారిన పెండింగ్ కేసుపై టీడీపీ కూటమి ప్రభుత్వమైనా సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉంది.

జెడ్పీ బదిలీల్లో కిరికిరి



- ముందుస్తుగానే పదోన్నతులు ఇచ్చి

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమిపాలైంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమికి చెందిన శాసనసభ్యులు గెలుపొందారు. దీంతో భవిష్యత్తులో ఉద్యోగుల బదిలీలు జరుగుతాయని ముందే ఊహించిన జెడ్పీ చైర్‌పర్సన్, పాలకవర్గం సభ్యులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు విడతలుగా 20 మందికిపైగా జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లకు ఇతర ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చారు. వారిని కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారు. తామే ఉద్యోగులకు పదోన్నతులు ఇప్పించామని సోషల్ మీడియాలో తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులతో ప్రచారం చేసుకున్నారు. కీలకస్థానాలు ఖాళీ లేకుండా ముందస్తుగానే ఉద్యోగులను బదిలీ చేశారు.

- తెరవెనుక కథ నడుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భర్త?
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పట్టించుకోబోమని చెబుతున్న వైనం
- ఐదేళ్లు దాటిన వారినే బదిలీ చేస్తామని హుకుం

జిల్లా పరిషత్‌లో వింతపోకడలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక భర్త తీరుతో ప్రతిష్టంభన నెలకొంది. ఉద్యోగులను బదిలీ చేయాలని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇచ్చినా వాటిని పట్టించుకునేది లేదని, తమ ఇష్టానుసారంగానే బదిలీలు జరుగుతాయని ఆయన చెబుతుండటంతో ఉద్యోగులు తమ పరిస్థితి ఏమిటని లోలోపలే మదనపడుతున్నారు. రెండు రోజుల్లో ముగియనున్న బదిలీల అంశంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని శాసనసభ్యులంతా కూటమికి చెందినవారు కావడంతో, జెడ్పీ పాలకవర్గం వైసీపీ ఆధీనంలో ఉండటంతో శాసనసభ్యుల ప్రతిపాదనలను పట్టించుకోకుండా మొండివైఖరికి పోవడంతో బదిలీల వ్యవహారం వివాదాస్పదమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.


ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్ యాజమాన్యంలో ఇంజనీరింగ్ విభాగం, ఎంపీడీవోలు, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, పాఠశాలల్లో పనిచేసే రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్‌లలో పనిచేసే ఉద్యోగులు, జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు.. ఇలా మొత్తం 500 మందికిపైగా ప్రస్తుతం జరగనున్న బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో అధికశాతం మంది కూటమికి చెందిన శాసనసభ్యుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుని మరీ బదిలీల కోసం దరఖాస్తులను సమర్పించారు. ఉద్యోగుల నుంచి బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆయా విభాగాలవారీగా జాబితాలను అధికారులు తయారు చేసి సిద్ధంగా ఉంచారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఈ దరఖాస్తులను పరిశీలించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంది. ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని, జీరో సర్వీసు ఆధారంగా ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఈ పద్ధతి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని అన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలో మాత్రం అమలు చేయబోమని చెబుతుండటం గమనించదగ్గ అంశం. ఐదేళ్లపాటు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను మాత్రమే బదిలీ చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ వర్గీయులు చెబుతుండటంతో జెడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. బుధవారం వరకు అన్ని విభాగాల్లో మాదిరిగానే జెడ్పీలోనూ బదిలీలు ఉంటాయని ఊహించిన ఉద్యోగులు, గురువారం నాటికి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల ఆధారంగా బదిలీలు చేసేది లేదనే సంకేతాలు

మిగతా 6వ పేజీలో...

ఉద్యోగం వదులుకుని.. వ్యవసాయాన్నే నమ్ముకుని..

అప్పులు పెరిగి యువరైతు బలవన్మరణం

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 29 : ఆర్థిక అవసరాలు తీర్చలేని ఉద్యోగం కంటే, ఆదుకునే వ్యవసాయమే మేలని నాగలి పట్టిన ఓ యువరైతు విషాదాంతమిది. ఐటీఐ చదివినా అక్కరకు రాని జీతాల కంటే, పదిమందికి అన్నంపెట్టే కాయకష్టమే ఇష్టమని నేలను నమ్ముకున్న ఓ కర్షకుడి కన్నీటి కథ ఇది. వివరాల్లోకి వెళితే.. అప్పుల బాధలు తాళలేక మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన నల్లమట్టి రామారావు (25) గురువారం బలవన్మరణం చెందడం కలకలం రేపింది. నల్లమట్టి శ్రీనివాసరావు, మాణిక్యం దంపతుల కుమారుడైన రామారావు ఐటీఐ వరకు చదువుకున్నాడు. గ్రామానికి సమీపంలోని కర్మాగారంలో ఉద్యోగంలో చేరాడు. వచ్చే జీతం కుటుంబ అవసరాలకు చాలకపోవడంతో ఆ ఉద్యోగం వదిలేశాడు. ఐదేళ్లుగా తమకున్న ఐదెకరాలతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని పత్తి, విర్చి పంటలు సాగు చేశాడు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవటంతో ఆదాయం రాలేదు. అప్పులు మాత్రం కొండలా పెరగటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అత్తగారి ఊరు చందర్లపాడు మండలం గురివిపాలెం వెళ్తానని ఇంటి నుంచి బయల్దేరాడు. నందిగామ మండలం చందాపురం గ్రామ సమీపంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం అందించటంతో వారు వచ్చి విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామారావు మృతిచెందాడు. మృతుడికి భార్య నందిని, మూడేళ్ల కుమార్తె రాజ్యలక్ష్మి, నాలుగు నెలల కుమారుడు అవినాష్ ఉన్నారు. యువ రైతు బలవన్మరణంతో రావిరాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నల్లమట్టి రామారావు (ఫైల్)

ప్రతిభకు పురస్కారం


సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నుంచి అవార్డులు అందుకుంటున్న ఆచంట బాలాజీ నాయుడు


అశోక్‌కుమార్ | చల్లపల్లి స్వరూపారాణి | కందిమళ్ల సాంబశివరావు | మల్లాది సూరిబాబు | పి.సత్యనారాయణ రెడ్డి | పాటిబండ్ల ఆనందరావు | ఆచార్య ములే విజయలక్ష్మి | బొర్రా గోవర్ధన్


గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమ,


కేపీఎన్‌డీ వరప్రసాద్ | జి.లక్ష్మి నరసయ్య | మోదుమూడి సుధాకర్ | పలమనేరు బాలాజీ | ఎస్.విజయకుమార్ | శారదా రామకృష్ణ | వనపర్తి దుర్గారావు


దుర్గగుడిలో హుండీల లెక్కింపు

కనకదుర్గమ్మకు రూ.2.76 కోట్ల కానుకలు

వన్‌టౌన్, ఆగస్టు 29 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. 18 రోజులకుగాను నగదు రూపేణ రూ.2,76,66,261లు సగటున రోజుకు రూ.15,37,014 కానుకలు వచ్చాయి. కానుకల రూపేణ హుండీలలో 523 గ్రాముల బంగారం, 7 కిలోల 30 గ్రాముల వెండి లభించింది. యూఎస్‌ఏ డాలర్లు 327, ఆస్ట్రేలియా డాలర్లు 35, ఇంగ్లాండ్ పౌండ్లు 10, కెనడా డాలర్లు 5, కువైట్ దినార్లు 2, యూరోలు 25, మలేషియా రింగిట్స్ 1, సౌదీ రియాల్స్ 5, 10 సింగపూర్ డాలర్లు, 98 కతార్ రియాల్స్ లభించాయి. ఈ హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలు రూ.61,260లు సమకూరాయి.

దుర్గమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలు కల్పించి అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

అన్నవితరణకు విరాళం

విజయవాడ విద్యాధరపురానికి చెందిన ఎ.శ్రీనివాసరావు గురువారం ఆలయానికి విచ్చేసి ఎ.దినేష్ పేరిట అన్న వితరణకు రూ.1,00,000లు ఉప కార్యనిర్వహణాధికారి లీలా కుమార్ ద్వారా చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు.

దుర్గగుడిలో ఇకపై తెలుగు పద్య పురాణం

వన్‌టౌన్, ఆగస్టు 29 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించే పంచహారతుల అనంతరం వేదస్వస్తి.. పురాణ పఠనం నిర్వహించనున్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గురువారం తొలిసారిగా పురాణపఠనంలో తెలుగుపద్యాలను వినిపించారు. ఇకపై ప్రతిరోజూ పురాణపఠనం అనంతరం తెలుగు నన్నయ్య భారతం, పోతన భాగవతం నుంచి భక్తిరస పూరిత తెలుగుపద్యాలను వినిపించాలని నిర్ణయించారు. సాహిత్య విలువలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో మంచి సాహిత్యం వెల్లివిరిసిందని, తెలుగు సాహిత్య గొప్పతనాన్ని భక్తిరసాన్ని అమ్మవారికి వినిపిస్తే తెలుగుభాషా పరిపుష్టమవుతుందని భావించారు. ఈ క్రమంలో పంచహారతుల సేవలో తెలుగు పద్యాల పఠన కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు.

వైసీపీ వ్యవస్థలను నిర్వీర్యం చేసింది.. ముంబై నటి ఘటనే నిదర్శనం : దేవినేని ఉమా



గొల్లపూడి, ఆగస్టు 29 : వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయనేందుకు ముంబై నటి, డాక్టర్ కాదంబరి జైత్వానిపై జరిగిన అమానుష ఘటనే నిదర్శమని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రమేయంతోనే సలహాదారు సజ్జల పోలీస్ అధికారులతో కలిసి ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి స్నేహితుడి కోసం వైసీపీ నేతలు, పోలీసులు కలిసి ఒక మాఫియాలా ఏర్పడి కిడ్నాప్ చేసి నటి, ఆమె కుటుంబాన్ని ఇక్కడకు తీసుకు వచ్చి చిత్ర హింసలకు గురిచేశారన్నారు. ఈఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి జగన్మోహన్ రెడ్డి, సజ్జల, కుక్కల విద్యాసాగర్ సహా బాధ్యులైన ప్రతి ఒక్కరిపైన కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీసు అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు.

నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలి

- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం



మాట్లాడుతున్న హరిబాబు

పాయకాపురం, ఆగస్టు 29 : కూటమి ప్రభుత్వం కౌలు రైతులతో క్షేత్రస్థాయిలో సంప్రదించి నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయంలో సగభాగం కౌలు రైతులు సాగుచేస్తున్నారని రిజర్వ్ బ్యాంక్ స్టేట్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని ఉన్నప్పటికీ క్రిందిస్థాయిలో బ్యాంకుల నుంచి కౌలు రైతులకు రుణాలు అందటం లేదన్నారు. భూ యజమాని అనుమతి లేకపోతే కౌలు గుర్తింపు కార్డులు రావడం లేదని, ఫలితంగా ఈ పంట నమోదవడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే పంటల నష్టపరిహారం, బీమా కౌలురైతులకు అందక అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడితే అవసరమైన సర్టిఫికెట్లు లేక ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా కూడా రాకుండా పోతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన కౌలు చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శులు పంచకర్ల రంగారావు, సైదులు, వై.కేశవరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉషోదయ'కు టైమ్స్ బిజినెస్ అవార్డు



లబ్బీపేట, అగస్టు 29 : వ్యాపారరంగంలో అత్యుత్తమ పురోగతి సాధించే సంస్థలకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం అందించే టైమ్స్ బిజినెస్ అవార్డును ఈ సంవత్సరం ఉషోదయ సూపర్ మార్కెట్‌కు వరించింది. నగరంలోని ఓ హోటల్లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ ఈ అవార్డును అందజేశారు. పలు సంస్థలు తమ వ్యాపార రంగంలో సాధించిన పురోగతిని పరిగణనలోకి తీసుకుని అత్యుత్తమ పురోగతిని సాధించిన సంస్థకు ఈ అవార్డును అందజేశారు. 2024 సంవత్సరం పాపులర్ సూపర్ మార్కెట్ అవార్డును ఉషోదయ సూపర్‌మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బెస్ట్ సూపర్‌మార్కెట్ అవార్డును సాధించింది. ఈ సందర్భంగా మంత్రి భరత్ ఉషోదయ సూపర్ మార్కెట్ అధినేత మన్నవ యుగంధర్‌కు అవార్డును అందజేశారు.

క్రీడారంగానికి మంచిరోజులు

- ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం
- పేద క్రీడాకారుల శిక్షణ, కిట్లకు మంత్రి రూ.3.16లక్షల విరాళం
- ప్రత్యేక ఆకర్షణగా ఒలింపియన్లు సింధు, జ్యోతి, జ్యోతికశ్రీ, ధీరజ్
- క్రీడాకారులతో నగరంలో భారీ ర్యాలీ

క్రీడల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి



ర్యాలీలో మంత్రి రామ్‌ప్రసాద్, పీవీ సింధు, శాప్ ఎండీ గిరిషా

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 29 : శాప్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్


క్రీడాకారిణితో మంత్రి మాటామంతీ

పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా క్రీడల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హాజరుకాగా, ప్రత్యేక ఆకర్షణగా పారిస్ ఒలింపియన్లు పీవీ సింధు(బ్యాడ్మింటన్), యర్రాజీ జ్యోతి, దండిక జ్యోతికశ్రీ(అథ్లెటిక్స్), బొమ్మదేవర ధీరజ్(ఆర్చరీ)లు హాజరై స్టేడియం నుంచి డీవీ మేనర్ వరకు క్రీడాకారులు, వివిధ పాఠశాలు, కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి మంత్రి, క్రీడారంగ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం క్రీడా కాన్వాస్‌పై సంతకాలు చేశారు. విద్యార్థులు, క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, హాకీ క్రీడ ద్వారా దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడాదినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, దీంతో క్రీడారంగానికి మంచి రోజులొచ్చాయన్నారు. క్రీడలపై ఆసక్తి కలిగిన వారికి శాప్ నుంచి పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయని, ఔత్సాహికులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పేద క్రీడాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించేందుకు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. శాప్ ద్వారా పేద క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ, కిట్లను అందించేందుకు తన నెల జీతం రూ.3.16 లక్షలు మంత్రి విరాళంగా ప్రకటించారు.

ఒత్తిడిని జయించాలి : పీవీ సింధు

ప్రతీఒక్కరూ ఫిట్నెస్‌కు ప్రాధాన్యమివ్వాలి. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ఏదొక క్రీడను ఎంపిక చేసుకుని కష్టపడి విజయాలను చేరుకోవాలి. కష్టపడితే ఏ లక్ష్యాన్ని అయినా అలవోకగా చేరుకోవచ్చు.. ఒడిదుడుకులను తట్టుకొని నిలవాలి.

క్రీడా ఆణిముత్యాలకు సత్కారం

జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ వీసీ ఎండీ పీఎస్ గిరిషా, పీవీ సింధు, ఉన్నతాధికారులతో కలిసి క్రీడా ఆణిముత్యాలను ఘనంగా సత్కరించారు. ధీరజ్ శ్రీ కృష్ణ(యోగా) జి.నగేష్‌బాబు(బాస్కెట్‌బాల్), భావన(సాఫ్ట్ టెన్నిస్), ఎం.అంకిత(వాలీబాల్), గిరిబాబు(వాటర్‌స్పోర్ట్సు)లను సత్కరించారు. కార్యక్రమంలో శాప్ ఏడీ వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు ఎ.మహేష్, కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, క్రిష్ సీఈవో యు.శ్రీనివాసరావు, వివిధ సంఘాల ప్రతినిధులు కేపీ రావు, నామిశెట్టి వెంకట్, యలమంచిలి శ్రీకాంత్, ఆకుల రాఘవేంద్రలు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి త్రికరణశుద్ధిగా పనిచేస్తాం


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

వన్‌టౌన్, ఆగస్టు 29 : సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ త్రికరణశుద్ధితో పనిచేస్తుందని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. విజయవాడ కమిషనరేట్, కాకరపర్తి భావనారాయణ కళాశాల, లయన్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై గురువారం కేబీఎన్ కాలేజీలో అవగాహన సదస్సు జరిగింది. అనంతరం హెల్మెట్‌తో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సైబర్ నేరాల కట్టడిపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని, తీసుకోవాల్సిన చర్యలపై ప్రచారం చేస్తున్నామన్నారు. డిజిటల్ పరికరాలకు సంబంధించి ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల క్రమంలో హెల్మెట్లు ధరించి పోలీసులతో బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. నూతన వ్యవస్థలో 200 మంది సైబర్ కమాండోలు విధులు నిర్వహిస్తున్నారని, 2 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. కేబీఎన్ కళాశాల నుంచి 300 మంది సైబర్ సోల్జర్స్ ఉన్నట్టు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాధ్యమైనంత మేరకు సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ త్రికరణశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు జి.రామకృష్ణ, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, అదనపు డీసీపీ ఎ.వి.ఎల్. ప్రసన్నకుమార్, ఏసీపీ రాజారావ్, ఎస్‌డి తేజేశ్వరరావు, కొత్తపేట సీఐ కొండలరావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాస్, హిందూ హైస్కూల్ విద్యాసంస్థల పరిపాలనాధికారి వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధుర్యాన్ని చాటి చెప్పండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పిలుపు


తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29 : తెలుగు భాషలోని మాధుర్యాన్ని, భాషా విశిష్టతను అందరికీ చాటి చెప్పాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా జేసీ గీతాంజలి శర్మతో కలిసి తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు కవులు, భాషావేత్తలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, తెలుగును వ్యవహారిక భాషగా ప్రజాదరణ కల్పించేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి అనన్య సామాన్యమన్నారు. భారతీయ భాషల్లో తెలుగుకు ప్రత్యేకత ఉందన్నారు. మన భాషపై ఆంగ్ల పెత్తనం అవసరం లేదన్నారు. ఆంగ్లభాష రాని తల్లిదండ్రులు తమ పిల్లలు కొన్ని ఆంగ్ల పదాలు మాట్లాడితే మురిసిపోతున్నారని, వాస్తవికంగా పిల్లలకు అటు ఆంగ్లభాషపై, ఇటు తెలుగుభాషపై పట్టు లేకుండా పోతోందన్నారు. మాతృభాషలో పట్టు ఉంటే మిగిలిన భాషల్లో పట్టు సులభంగా వస్తుందన్నారు. దేశంలో రెండు వేల ఏళ్ల కితమే తెలుగు భాష ఆవిర్భవించిందన్నారు. ప్రాచీన భాషల్లో తెలుగుభాష ఆరవ భాషగా పేరు పొందిందన్నారు. కాగా కార్యాలయాల్లో ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని, తెలుగుభాషను పాలనాభాషగా చేయాలని కవులు, పండితులు కలెక్టరుకు మహజరు సమర్పించారు. పాఠశాలల్లో తెలుభాషను మాధ్యమంగా ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా కవులు చింతలపాటి మురళీకృష్ణ, ఎంవీజీ ఆంజనేయులు, పన్యారం సాంబశివరావు, కారుమూరి రాజేంద్రప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, ధన్వంతరి ఆచార్య, ఎండీ సిలార్, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి యోగేశ్వరరావు, వెచ్చ సత్యనారాయణ మూర్తి, ధూళిపూడి రామభద్ర ప్రసాద్, ఎన్‌బాబులను కలెక్టరు ఘనంగా సత్కరించారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు

- ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు

విజయవాడ స్పోర్ట్సు : పాఠశాల స్థాయిలో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ఉత్తమ క్రీడాకారులకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్సు ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి భానుమూర్తి రాజు మాట్లాడారు. రాష్ట్రంలోనే స్కూల్ ఆఫ్ స్పోర్ట్సు ఎక్సలెన్స్‌లో రెండో స్థానం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాధించడం గర్వకారణమన్నారు. తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లాలో ప్రథమ, రాష్ట్రంలో రెండో స్థానం సాధించిన నున్న హైస్కూల్ హెచ్‌ఎం వజ్రాల భూపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు టి.విజయవర్మ, టి.శ్రీలతను సత్కరించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు.

జడ్పీ బదిలీల్లో కిరికిరి

(5వ పేజీ తరువాయి)

వెలువడంతో తమ పరిస్థితి ఏమిటనే అంశంపై చర్చించుకుంటున్నారు.

కార్యాలయానికి రాని వైనం

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత వైసీపీ ఓటమి పాలవడంతో జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదు. జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగిన సమయంలో, ఇటీవల ఉద్యోగులకు పదోన్నతుల పత్రాలు అందించే సమయంలో మినహా మిగిలిన రోజుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయానికే రాలేదని ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో ఉద్యోగుల ఇబ్బందులు, పరిపాలనాపరమైన అంశాలపై చర్చించేందుకు అవకాశమే లేకుండా పోయిందని ఉద్యోగులు అంటున్నారు. పోనీ జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు ప్రయత్నిస్తే, ఇంటికి ఎందుకు వచ్చారని, ఆఫీస్‌కు వస్తామని, అక్కడే మాట్లాడతామని జెడ్పీ చైర్‌పర్సన్ భర్త తనదైన శైలిలో చెప్పి ఉద్యోగులను పంపేస్తున్నారు. దీంతో జెడ్పీ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

● బదిలీలు సాఫీగా జరిగేనా?

ఉమ్మడిజిల్లాలో జిల్లా పరిషత్ యాజమాన్యంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల జాబితాలను శాసనసభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలు, ఇతరత్రా నిబంధనల మేరకు తయారుచేసి సిద్ధంగా ఉంచారు. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ భర్త ఉద్యోగుల బదిలీల అంశంలో తలదూర్చి ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేసేవారిని మాత్రమే బదిలీచేస్తామని చెబుతున్నారనే సమాచారం బయటకు పొక్కింది. దీంతో శాసనసభ్యులు జెడ్పీ సీఈవోకు ఫోన్‌చేసి ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వ సూచనల మేరకు చేయాలని చెబుతుండటం గమనార్హం. దీంతో జెడ్పీ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుగొయ్యి అన్న చందంగా మారింది. గతంలోనూ ఉద్యోగుల బదిలీల అంశంలో తమదే తుది నిర్ణయమనే ధోరణిలో జెడ్పీ చైర్‌పర్సన్ వ్యవహరించారు. దీంతో అప్పట్లో జరిగిన బదిలీల్లో అన్యాయానికి గురైన కొందరు ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లి తాము కోరుకున్న ప్రాంతాల్లో విధుల్లో చేరారు. ఈ అంశంపై అప్పట్లో జెడ్పీ సీఈవోకు హైకోర్టు అక్షింతలు కూడా వేసింది. ప్రస్తుతం జెడ్పీలో ఉద్యోగుల బదిలీల పరిణామాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయనే అంశంపై సర్వత్రా చర్చ నడుస్తోంది.


మల్కాపురం మునేటికి వెళ్లే మార్గంలో తీసిన కందకం

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట!

- చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 29 : ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. మండలంలోని మల్కాపురం మునేటి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో మునేటికి వెళ్లే మార్గాన్ని ఎక్స్‌వేటర్‌తో కందకం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాలు తెలంగాణాకు సరిహద్దుగా ఉండటంతో అక్రమార్కులు సులువుగా ఇసుక తరలిస్తున్నారన్నారు. వారిని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముక్త్యాల, బూదవాడ, అన్నవరం, గరికపాడు, తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట, గండ్రాయి, మల్కాపురం గ్రామాల సరిహద్దులో చెక్‌పోస్టుల బలోపేతంతో పాటు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలు రేపు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 29 : మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ స్కూల్ గ్రౌండ్స్‌లో ఈనెల 31న ఉదయం 9 గంటలకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అథ్లెటిక్స్ అండర్ 14, 16, 18, 20, 23 కేటగిరీల్లో బాలబాలికలు, పురుషుల, మహిళా విభాగాల్లో ఎంపికలను నిర్వహిస్తున్నట్టు కృష్ణాజిల్లా సెక్రటరీ బొడ్డు నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని సెప్టెంబరు 14 నుంచి 16 వరకు గుంటూరు జిల్లా ఏఎన్‌యూ గ్రౌండ్స్‌లో జరిగే ఏపీ అంతర్‌జిల్లాల(రాష్ట్రస్థాయి) జూనియర్, అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. వివరాలకు కోచ్‌లు కె.కృష్ణమోహన్ 9493101040, జి.వంశీ కిరణ్ 06302822291లలో సంప్రదించాలన్నారు.

దర్జాగా దోపిడీ

(5వ పేజీ తరువాయి)

అధికారి ఒకరిని పర్యవేక్షణాధికారిగా నియమించారు. ఈయనకు లారీకి వెయ్యి రూపాయలు ఇస్తే ఎలాంటి సీరియల్‌తో పనిలేకుండా లోడింగ్ చేస్తున్నారు. ఉచిత ఇసుక పక్కదారి పడుతుందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో ఈ అధికారే తనకు డబ్బులు ఇచ్చిన వారి లారీలకు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసేస్తున్నారు. టీడీపీ నాయకుల లారీలకు ఆన్‌లైన్ బుకింగ్‌తో పనిలేదు. నేరుగా స్టాక్‌యార్డులోకి వెళ్లడం.. ఇసుక తీసుకుపోవడమే. వారికి అడ్డుచెప్పే వారే లేరు. మొగులూరు స్టాక్‌యార్డు పర్యవేక్షణాధికారిగా పరిటాల గ్రామ పంచాయతీ సెక్రటరీని నియమించారు. ఈయన కూడా టీడీపీ నాయకుల లారీలకు అడ్డు చెప్పడం లేదు. తమ లారీలను అడ్డుకోకుండా ఉన్నందుకు నెలకు ఇంతని మామూలు రూపంలో ఈయనకు ముట్టజెబుతున్నట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 109, 118, 129
చికెన్ విత్ స్కిన్ 210
చికెన్ స్కిన్‌లెస్ 220
నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

బుద్దా వెంకన్నకు సత్కారం



వన్‌టౌన్, ఆగస్టు 29: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నను గురువారం వన్‌టౌన్‌లోని ఆయన కార్యాలయంలో పశ్చిమ ఫ్యాబ్రికేటర్లు, వెల్డింగ్ వర్కర్ల యజమానుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. దుశ్శాలువా కప్పి ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మధురాంతకం శ్రీనివాసరావు, కోశాధికారి అకినపల్లి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, ఇంజనీర్ కె. దివాకర్ బాబు, నందం భవానీప్రసాద్, మధురాంతకం సాయి చైతన్య, షేక్ కరీం, మున్నా, భట్టు రాజు, భజనలాల్ కిషోయి, యనమదల రవీంద్రబాబు, షేక్ జమీల్, షేక్ బాజి, ఉన్నారు.


రామ్మోహన్ గ్రంథాలయంలో


బెజవాడ బార్‌లో


పీబీ సిద్దార్థ కాలేజీలో


లయోలా కళాశాలలో


స్టెల్లా కాలేజీలో

మాతృభాషను కాపాడుకోవాలి

గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో పలు కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ మాతృభాషపై మమకారం పెంచుకోవాలని సూచించారు. తెలుగు భాష పరిరక్షణ ఉద్యమంలో గిడుగు చేసిన కృషి మరువలేనిదన్నారు. మాతృభాషను కాపాడుకోవాలన్నారు.

విజయవాడ కల్చరల్, ఆగస్టు 29 : ఆంధ్ర లయోలా కళాశాల ప్రాచ్య భాషా పరిషత్ సంయుక్త తెలుగు భాషోద్యమ సమాఖ్య సంయుక్తంగా ఆంధ్ర లయోలా కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం గురువారం నిర్వహించారు. విమ్స్ మదర్ థెరెస్సా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌కు చెందిన సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. మాతృభాషను కాపాడుకోవాలని, మాతృభాష గౌరవానికి తమదైన సేవలు అందించాలన్నారు. కళాశాల ప్రధానా చార్యులు రెవ.ఫాదర్ జీఏపీ కిషోర్ ప్రసంగించారు. కళాశాల ప్రాచ్య భాషా పరిషత్ శాఖాధిపతి డాక్టర్ కోలా శేఖర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సమావేశంలో డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.కిరణ్ కుమార్, తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యదర్శి డాక్టర్ ముప్పా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగులో మాట్లాడటం, పోస్టర్ ప్రజెంటేషన్, శతక పద్యాల పోటీ, సింగిల్ పేజీ కథా రచన మొదలైన పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సమావేశానికి సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.రవీంద్రబోస్, డాక్టర్ డి.కృష్ణారావు, డాక్టర్ బి.సుబ్బారావు, అమృతరావు, సంస్కృత అధ్యాపకులు బి.వెంకటేశ్వరరావు, హిందీ అధ్యాపకులు స్నేహల్ విమల్ శుక్లా పాల్గొన్నారు.

● సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగులో కవితలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ హాజరయ్యారు.


సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో

పీబీ సిద్ధార్థ కళాశాలలో...

విజయవాడ కల్చరల్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ అధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగాయి.కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ నేటితరం యువతీ యువకులు తెలుగు భాషా పదాలను సైతం ఆంగ్లభాషలో లిప్యంతరీకరించి రాయడం చాలా బాధాకరమన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం నేటి యువతరంపై వుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ ఎన్.శివకుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో తెలుగు భాష స్థితిగతులు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, విద్యారంగంలో తెలుగుభాష ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.నీరజ, సభాసంచాలకత్వం వహించారు. తెలుగు అధ్యాపకురాలు జి.శేషారత్నం తెలుగు గేయాన్ని ఆలపించారు. ఈ సభలో ముందుగా తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అతిథులు ప్రసంగించారు. తెలుగు కవులు, రాయలు, వివిధ రకాల తెలుగు పెద్దల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం విశిష్టతను తెలియచేస్తూ చక్కని గీతాలను, పద్యాలను మధురంగా ఆలపించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ క్రీడలను ప్రదర్శించారు. పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య, ఉపసంచాలకులు రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.జయలక్ష్మి పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ గిడుగు గొప్పతనం వివరిస్తూ తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమంలో గిడుగు కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, కమిటీ సభ్యుడు పవన్, చెన్నప్రగడ సదాశివరావు ప్రసంగించారు.

బెజవాడ బార్‌లో....

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాం ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కండెల వరప్రసాద్, జేడీ చక్రవర్తి, మౌర్య, శ్రీహరి, ప్రతాపరెడ్డి, మట్టా శివ రాంప్రసాద్, నాగార్జున, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్టెల్లాలో..

పటమట: మారిస్ స్టెల్లా కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పద్యాలు, సంస్కృతి సాహిత్యంపై ప్రాచీన తెలుగు కథల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా సప్తగిరి డిగ్రీ కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ జ్యోత్స్నరాణి హాజరై మాట్లాడుతూ తెలుగుభాష విశిష్టతను వివరించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ కుల్‌రేఖ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.మంగాదేవి, డాక్టర్ శ్రీనివాస్ రావు, ఉషాకుమారి, హారిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

కేబీఎన్ కళాశాలలో...


కేబీఎన్ కళాశాలలో..

వన్‌టౌన్: కేబీఎన్ కళాశాలలో జరిగిన మాతృభాషా దినోత్సవంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల తెలుగు విభాగం, తెలుగు సంపద సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతృభాష అంశంలో గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన భాషా వికాస కార్యక్రమాన్ని ఆయన అభివర్ణించారు. సాహితీవేత్త వాడ్రేవు సుందరరావు, కళాశాల అధ్యక్ష కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనుకుంట్ల శ్రీనివాసులు, తెలుగు సంపద సంస్థ ప్రధాన సలహాదారు డాక్టర్ రేమిళ్ల మూర్తి, లిపి గేమ్ ఇండియా ఉపాధ్యక్షురాలు అపర్ణ, హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి. నారాయణరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ఎం. రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ, తదితరులు ప్రసంగించారు. మాతృభాషా విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ జె.వి. చలపతిరావు, డాక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

● విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం, జాతీయ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథి ఇస్రో సీనియర్ సైంటిస్టు డాక్టర్ రేమిళ్ల మూర్తి పాల్గొని గిడుగు రామ్మూర్తి సేవలను గుర్తుచేసుకుని విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు. తెలుగు వెలుగుల చిత్రపటాల ప్రదర్శనను అతిథులు తిలకించారు. తొలుత తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులు సమర్పించారు. విజేతలకు బహుమతులు పంచారు. డాక్టర్ మూర్తిని దుశ్శాలువాతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పాటలు, పద్యాలు, రూపకాలు, సందేశాలను వినిపించారు.

● కూరపాటి పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. కార్యదర్శి కూరపాటి లక్ష్మీనారాయణరావు పిల్లలకు మిఠాయిలు పంచారు.


గాంధీజీ మునిసిపల్ కాలేజీలో

● గాంధీజీ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కౌశిక్ విద్యా సంస్థల నుంచి డాక్టర్ దిట్టకవి గోపాలాచార్యులు పాల్గొన్నారు. కళాశాల వైస్ చైర్మన్ కె.వి.పిచ్చయ్య, కార్యదర్శి, కరస్పాండెంట్ సి.ఎల్. కాంతారావు పాల్గొన్నారు. కళాశాల తెలుగు హెచ్‌వోడీ ఎ. స్వరూపరాణి, అధ్యాపకులు, విద్యార్థినులు, పాల్గొన్నారు. గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు.

పాత రాజరాజేశ్వరి పేట: శ్రీ విద్యాంజలి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేబీఎన్ కళాశాల ఆంధ్రోపన్యాసకుడు జేవీ చలపతిరావు తెలుగు భాషా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చలపతిరావును పాఠశాల హెచ్ఎం పుప్పాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.


కేక్ కట్ చేస్తున్న సర్వేశ్వరరావు

ఘనంగా అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు

ధర్నాచౌక్: అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు అలంకార్ థియేటర్‌లో ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన సర్దార్ ఎన్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఆయన అభిమానుల కోసం అలంకార్ థియేటర్‌లో ప్రత్యేకంగా 'మాస్' చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం హారీ కేక్‌ను కట్ చేశారు. టపాసులు కాల్చి సంబరాలు చేశారు. స్థానిక నిర్మల్ హృదయ్ భవన్‌లో పేదలు, వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. టి.శేఖర్, బి.కృష్ణ, కే.ప్రభాకర్, ఎస్.సత్యం, ఎం.లోకేష్, ఎస్‌కే.బాషా, జి.గణేష్, ఏ.చిన్ని, కే.వాసు, రాజా, ఎం.విజయకృష్ణ, వి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడు షాపుల సీజ్

భవానీపురం, ఆగస్టు 29 : వీఎంసీ డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సు తీసుకోని కారణంగా 45వ డివిజన్‌లోని మూడు వ్యాపార సంస్థలను భవానీపురం క్లస్టర్ శానిటరీ సూపర్‌వైజర్ శివరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సీజ్ చేశారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పలు షాపుల వారికి 15 రోజుల క్రితం లైసెన్సు తీసుకోమని నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో సీజ్ చేశారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, మేస్త్రీ రామిరెడ్డిలు పాల్గొన్నారు.

భవానీపురం ఎస్ఐగా ఆనంద్‌కుమార్ బాధ్యతల స్వీకారం



విద్యాధరపురం, ఆగస్టు 29: భవానీపురం పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐగా నియామకమైన డి. ఆనంద్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2007 బ్యాచ్‌కు చెందిన వ్యక్తి. రాజమండ్రి సమీపంలోని కోరుకొండ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఆయన భవానీపురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

విద్యారంగాన్ని నాశనం చేసిన జగన్: గద్దె రామ్మోహన్


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె

మొగల్రాజపురం, ఆగస్టు 29: సంస్కరణల పేరుతో మాటలు చెప్పి విద్యారంగాన్ని సర్వనాశనం చేశాడని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకునే పాఠశాలలను గత సీఎం జగన్ మూశాడని, వాటిని తిరిగి పునఃప్రారంభించాలని విద్యా శాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లానని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. తూర్పు నియోజక వర్గం ఏడవ డివిజన్ బందిల దొడ్డి సెంటర్‌లో గురువారం, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న డ్రెయినేజీ సమస్య, గత ప్రభుత్వం మూసేసిన సీఎస్ఐ పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాల గురించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంటిస్సోరి మహిళా కళాశాల, కృష్ణలంక రాణిగారి తోటలోని పాఠశాలను తిరిగి తెరిపించడానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ అంగీకరించారని చెప్పారు.

చలానాలు, ఆటో సీజ్‌ల నుంచి విముక్తి కల్పించండి

● ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఐఎఫ్‌టీయూ నాయకుల వినతి

వన్‌టౌన్, ఆగస్టు 29: నగరంలో ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఆటోలపై అధిక మొత్తంలో వేస్తున్న చలానాలు, ఆటోల సీజ్‌ల నుంచి విముక్తి కలిగించాలని ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఐఎఫ్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని కలిసిన వారు చిన్న చిన్న కారణాలకు కూడా ఆటోలు సీజ్ చేయటం తగదని వివరించారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, ఆటో, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. రవిచంద్ర, నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దిరాజు, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో సైన్స్ ప్రదర్శన

భారతీనగర్, ఆగస్టు 29: సైన్స్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఇస్రో శాస్త్రవేత్త సాంబశివ రావు అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధించిన విజయాలను పురస్కరించుకుని ఆంధ్రా లయోలా కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్(సైన్స్ ప్రదర్శన) నమూనాల ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంగళయాన్, గగన యాన్, ఆదిత్య వంటి మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ సగాయరాజు, ప్రిన్సిపాల్ పి. కిషోర్, ఫాదర్ డాక్టర్ పి.ఆర్.జాన్, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ రాజు, ఫిజిక్స్ విభాగాధిపతి పి.శ్రీనివాస, ఇస్రో సంస్థ బృందం వెంకట సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లు, సైడు కాల్వల పనులకు శంకుస్థాపన

భవానీపురం, ఆగస్టు 29 : 45వ డివిజన్ న్యూ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.11 లక్షల వ్యయంతో రోడ్లు, సైడు కాల్వల నిర్మాణ పనులకు కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. టీడీపీ నాయకులు మైలవరపు కృష్ణ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నందమూరి హరికృష్ణ వర్ధంతి


టీడీపీ జిల్లా కార్యాలయంలో హరికృష్ణకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

వన్‌టౌన్, ఆగస్టు 29: ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 6వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గన్నే వెంకట నారాయణ ప్రసాద్, టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు బోయిన సుబ్రహ్మణ్యంలు హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ హరికృష్ణ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, నటుడిగా తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, మరిపిళ్ల తిరుమలేష్, పెంద్ర రమేష్, కత్తుల మణికంఠ, పామర్తి కిషోర్ బాబు, శొంఠి శివరామప్రసాద్ గౌడ్, కోడూరు ఆంజనేయ వాసు, కరణం వెంకట రమణ, గుమ్మా బాలు, వాకా వెంకటేశ్వరరావు గౌడ్, జాస్తి సురేష్, పొన్నం రవి కుమార్, దాసు, దేవగళ్ల ఇబ్రాయిల్, పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముందుగా హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

పాత రాజరాజేశ్వరి పేట: 55వ డివిజన్ కంసాలిపేటలో టీడీపీ యువత రాష్ట్ర నాయకుడు ధనేకుల హరికృష్ణ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆయన నందమూరి హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 50 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 30 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన సజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని సజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మిను మునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేకపోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.



హేమ కమిటీకి సమంత ప్రశంసలు

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితీయడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకొన్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6tDC2Mxలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!



ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టి ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహా నటుడు పృథ్వీరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన 'శ్రీ సత్యనారాయణ మహత్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహానాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.

ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్ర్కీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'



స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.



తెలుగు భాషా దినోత్సవం రోజున...

కొత్తగా..

ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్థంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

సుభాషితం

ఇంద్రియాల స్వయంచాలకత

"ఓ అర్జునా! ఇంద్రియాలను లొంగదీసుకోవడం కష్టం. మనిషి వాటిని నిగ్రహించుకోవడానికి ఎంతగా ప్రయత్నించినా... ఆసక్తి తొలగిపోనంతవరకూ అవి అతని మనసును ఇంద్రియార్థాలవైపు బలవంతంగా లాక్కుపోతూనే ఉంటాయి" అని అర్జునుణ్ణి శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. ఈ శ్లోకం బాహ్య ఇంద్రియ విషయాలకు ఇంద్రియాల స్వయంచాలకత గురించి (వాటంతట అవే ప్రవర్తించే తీరు గురించి) వివరిస్తుంది. ధూమపానం వల్ల కలిగే నష్టాల గురించి బాగా తెలిసి కూడా... దాన్ని మానుకోలేక... కొనసాగించేవారు దీనికి ఉత్తమ ఉదాహరణ. సిగరెట్ మానుకుందామనుకున్న ప్పటికీ... తమకు తెలియకుండానే వెలిగించేశామని చాలామంది బాధపడుతూ ఉంటారు. రోడ్డు మీద ఇతరులతో చిన్న విషయాలకు కొట్లాడేవాళ్ళు లేదా నేరాల్లో పాల్గొన్నవారు తాము ఆ పనులను క్షణికావేశంతో చేశాం తప్ప ఉద్దేశపూర్వకంగా కాదని ప్రమాణపూర్తిగా చెబుతారు. కార్యాల



యంలో లేదా కుటుంబంతో కఠినమైన పదాలతో మాట్లాడే వ్యక్తులను విషయంలో కూడా ఇదే జరుగుతుంది. ఆ మాటలు అనాలని ముందుగా నిర్ణయించుకొని అన్నవి కావు కాబట్టి ఆ తరువాత పశ్చాత్తాపం చెందుతారు. ఇంద్రియాలు మనల్ని స్వాధీనం చేసుకుంటాయనీ, కర్మ బంధంలో మనల్ని బంధిస్తాయని ఈ ఉదాహరణలు సూచిస్తున్నాయి.

మెదడులోని కణాలు (న్యూరాన్లు) నడక లాంటి స్వయంచాలక కార్యకలాపాలను చూసుకోవడానికి 'హార్డ్ వైరింగ్' అని పిలిచే కూటములను మన చిన్న వయసులోనే ఏర్పాటు చేస్తాయి. ఇది మెదడు శక్తిని ఎంతగానో ఆదాచేస్తుంది. రోజువారీ జీవితంలో మనం సంపాదించిన నైపుణ్యాలు, అలవాట్ల విషయంలో కూడా ఇదే జరుగుతుంది. ఇలా నిర్మితమైన 'హార్డ్ వైరింగ్' ఎంత శక్తిమంతంగా మారుతుందంటే... దాని వల్ల వచ్చిన అలవాట్లను అధిగమించడం చాలా కష్టం. కొత్తదాన్ని తయారు చెయ్యడం తప్ప... ఉన్న హార్డ్ వైరింగ్‌ను విచ్ఛిన్నం చెయ్యడం అసాధ్యమని న్యూరో సైన్స్ చెబుతోంది.

"ఇంద్రియాలు చాలా శక్తిమంతమైనవి. తెలివైన వ్యక్తి మనస్సును కూడా అవి బలవంతంగా హరించగలవు" శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. ఇంద్రియాల స్వయం చలనాన్ని అధిగమించడానికి... సర్వశక్తి మంతుడైన పరమాత్మ ఎదుట ఆత్మసమర్పణ చేసుకోవాలని ఆయన బోధించాడు. ఇంద్రియాల గురించి అవగాహన పొందడం వల్లనే... వాటిని నియంత్రించడానికి అవసరమైన శక్తి సమకూరుతుంది. ఆ అవగాహన లేనప్పుడు.. ఇంద్రియాలతో పోరాడి వాటిని అదుపు చెయ్యలేం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

వారే సుజనులు


మనసి వచసి కాయే పుణ్య పీయూష పూర్ణాః
త్రిభువనముపకార శ్రేణిభిః ప్రీణయంతః
పరగుణ పరమాణూన్పర్వతీకృత్య నిత్యం
నిజహృది వికసంతః సంతి సంతః కియంతః...


అంటూ సుజనుల లక్షణాలను...తన నీతి శతకంలో భర్తృహరి వర్ణించాడు. దాన్ని...

హృదయ వచశ్శరీరముల నెంతయు పూర్ణ సుధాప్రపూర్ణులై
ముదము బహూపకారముల మూడు జగంబులకున్ ఘటించుచున్
వదలక సాధు సద్గుణలవంబులు కొండలు నేసి మెచ్చుచున్
మదిని వికాస యుక్తులగు మాన్యులు కొందరు వొల్తురిద్ధరన్...

అని తెలుగులోకి అనువదించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం: మనసా, వాచా, కర్మణా... అంటే త్రికరణ శుద్ధిగా మంచి పనులు చేయాలనే తపన ఉన్నవారు, సమస్త ప్రజలూ ఆనందంగా ఉండాలని కోరుకొనేవారు, అలాంటి ఆనందాన్ని వారికి కలిగించేవారు, అందరినీ తమ ఉపకార బుద్ధితో ఆదుకొనేవారు, ఇతరులలో సద్గుణాలు గోరంత ఉన్నా వాటిని కొండంతగా భావించి మెచ్చుకొనేవారు సుజనులు. అలాంటివారు ఈ లోకంలో చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు.





పరమాత్మను దర్శించాలి

"శ్రీమద్రామానుజులు ప్రవచించిన ఆధ్యాత్మిక ధర్మం, చూపిన సంస్కరణ మార్గం నేటి సమాజంలోని సమస్యలకు తరుణోపాయం" అంటారు **శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి**. ఆయన సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం శ్రీభాష్యకార సిద్ధాంత పీఠాన్ని స్థాపించి... శ్రీవైష్ణవ ధర్మ ప్రచారాన్ని, సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 27వ చాతుర్మాస్య దీక్షలో ఉన్న ఆయన 'నివేదన'తో సంభాషించారు.

ఆధ్యాత్మికతను ఎలా నిర్వచిస్తారు?

ఆధ్యాత్మికత అంటే... తమను, ఈ జగత్తును సృష్టించిన భగవత్ తత్త్వాన్ని తెలుసుకోవడం, భగవంతుడి పట్ల భక్తి ప్రపత్తులు కలిగి ఉండడం. మన ఋషులు గ్రహించిన ధర్మం ఏదైతే ఉన్నదో... దాని గురించి పెద్దల ద్వారా వివరంగా తెలుసుకొని ఆచరించడం. జీవితంలో తటస్థించే అనేక సమస్యలను ఎదుర్కొంటూ, సుఖదుఃఖాలను సమానంగా భావిస్తూ, భగవన్నామ సంకీర్తనాదులతో, పవిత్రమైన భగవద్గాథల శ్రవణంతో, తత్సంబంధమైన ఆచరణతో జీవితాన్ని భగవన్మయం చేసుకోవడం.

పరివ్రాజక జీవనంలోకి ప్రవేశించడానికి ముందు మీ నేపథ్యం ఏమిటి?

స్వస్థలం గుంటూరు. కిడాంబి రత్నమాచార్యులు, వెంకట లక్ష్మీవర్యుల కనిష్ఠ సంతానం. పారంపర్యంగా తిరువారాధన, స్వయమాచార్యత్వం ఉన్నాయి. మేము బికామ్ చదువుతున్న రోజుల్లో... శ్రీకృష్ణపరమాత్మ బలంగా ఆకర్షించాడు. తన కైంకర్యం తప్ప మరే కోరికా లేకుండా చేశాడు. అప్పటివరకూ సాధారణ యువకుడిగా జీవిస్తున్న మామీద నిర్హేతుకమైన కృపను ప్రసాదించి... తనవాణ్ణి చేసుకున్నాడు. శ్రీ వైష్ణవ సంప్రదాయ అనుష్ఠానపరులైన శ్రీమాన్ ఉభయవేదాంత ప్రవర్తకాచార్యులు తెలికచర్ల కందాడై గోపాలాచార్య స్వామివారి శిష్యత్వం కూడా ఆ భగవంతుడి అనుగ్రహమే. అది కూడా చాలా విచిత్రంగా జరిగింది. కృష్ణ భక్తుడైన ఒక వ్యక్తి కలిసి... మాకు దగ్గరలోని నడిగడ్డపాలెంలో కొందరు స్వాములు శ్రీకృష్ణ లీలల గురించి ప్రవచనం ఇస్తున్నారని చెప్పాడు. అక్కడికి వెళ్ళి చూస్తే... పెరియాళ్వార్ అనుగ్రహించిన 'తిరుమొళి' అనే గ్రంథ ప్రవచనం సాగుతోంది. ప్రవచనం ఇస్తున్నది కులపతులు శ్రీతెలికచర్ల కందాడై గోపాలాచార్యస్వామి. ఆయన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామివారితో సహా తొమ్మిదిమంది యతులకు (జీయర్‌లకు) గురువు. ఆయనను చూడగానే 'ఈయనే మాకు ఆచార్యులు' అని నిశ్చయం కలిగింది. ఇంతలో ఆయన "ఇక మేము ఎవ్వరికీ పాఠం చెప్పము" అని ప్రకటించారు. కార్యక్రమం ముగిశాక ఆయనను కలిసి "మాకు పాఠం చెప్పండి" అని విన్నవించుకుంటే... "మేము చెప్పము" అన్నారు. ఆయనను ఎంతగానో ప్రార్థించాక... చివరకు "మళ్ళీ రా!" అన్నారు. అలా పదిహేనురోజులకు ఒకసారి... దాదాపు పదిసార్లు ఆయనను కలుసుకోవడం జరిగింది. అలా అయిదునెలల పాటు పరీక్షించారు. తమ శిష్యరికం చెయ్యాలన్న సంకల్పం మాలో దృఢంగా ఉందని నిశ్చయపరుచుకున్నాక శిష్యుడిగా స్వీకరించారు. తొమ్మిదేళ్ళపాటు సంప్రదాయ గ్రంథాల్లోని రహస్యాలను బోధించారు. భగవద్రామానుజులు అనుగ్రహించిన గ్రంథాలను అధ్యయనం చేయించారు.

సన్న్యాసాశ్రమాన్ని ఎప్పుడు స్వీకరించారు?

ఆళ్వార్ తిరునగరి పెద్ద ఆత్తాన్ వరదాచార్య స్వామివారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి మన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారు మంత్రదీక్ష ఇచ్చారు. మాకు ముప్ఫయ్యేళ్ళ వయసున్నప్పుడు... 1998 జూన్ 10న వానమామలైకి చెందిన కలియన్ రామానుజ జీయర్ స్వామి సన్యాసాశ్రమ దీక్ష ఇచ్చారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి శ్రీభాష్యాన్ని అనుగ్రహించారు. మా ఆచార్యులు సంతృప్తి చెందే విధంగా మమ్మల్ని తయారు చేసుకున్నదీ తన నిత్య కైంకర్యాలకు ఏలోటూ లేకుండా చేయించుకుంటున్నదీ ఆ శ్రీ భూ గోదాసమేత గోవింద పెరుమాళ్. ఇలా... ఒక సామాన్యుడు ఆధ్యాత్మికంగా ఎదగడం అనే అద్భుతం జరిగేలా చేసింది ఆ స్వామే.

మీ దినచర్య, నియమాలు ఎలా ఉంటాయి?

సన్న్యాసాశ్రమ ధర్మానుసారం నిత్యం మా ఆరాధ్యదైవమైన ఆ పెరుమాళ్ ఆరాధన, సంబంధిత అనుష్ఠానాలు, జపతపాలు ఉంటాయి. అలాగే చాతుర్మాస దీక్ష, ధనుర్మాస దీక్ష, ఏకాదశి వ్రతాలు పాటిస్తాం. నిత్యం నాతో పాటు నా అనుయాయులు స్వామివారి సేవతో పాటు వివిధ కార్యక్రమాలలో భాగమవుతారు. ప్రస్తుతం చాతుర్మాస దీక్షలో ఉన్నాం.

శ్రీమద్రామానుజాచార్యులు ప్రవచించిన ధర్మం నేటి సమాజానికి ఏ విధంగా మార్గదర్శకత్వం అందిస్తుంది?

మనుషులే కాదు, సకల చరాచర జీవకోటిలోనూ శ్రీమన్నారాయణుడు అంతర్యామిగా ఉంటాడు. వాటిని రక్షిస్తాడు. స్వామిని ఆశ్రయించినవారందరికీ ఆయన రక్షణ పొందడానికి సమానమైన అధికారం ఉంది అనే సత్యాన్ని సమాజంలో అందరూ తెలుసుకోవాలి. శరీరంలో ఒక భాగానికి కష్టం కలిగితే వేరొక భాగం వెంటనే ఎలా స్పందిస్తుందో... అలాగే సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా ఉండాలి. ఒకరి సుఖదుఃఖాలను వేరొకరు పంచుకోవాలి. తమ శ్రేయస్సునే కాకుండా... మొత్తం సమాజ శ్రేయస్సును కోరుకోవాలి. ఇదీ పన్నెండువందల ఏళ్ళ క్రితం శ్రీమద్రామానుజులు అందించిన సందేశం. ఎందుకంటే భక్తి వ్యక్తిగతమే కాదు, సామాజికం కూడా. వ్యక్తిగా తాము ఆచరించాలి. తద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలి. వారు ఆదర్శాలతో సామాజిక ఉజ్జీవనం కలిగించడం ద్వారా... అది సామాజికంగా కూడా మారుతుంది. ఈ విధంగా భక్తి ద్వారా సమాజానికి సామరస్యత నేర్పిన సమతామూర్తి మన రామానుజులు. వైష్ణవ ధర్మానుసరణతో, సర్వ జగత్కారకుడైన శ్రీమన్నారాయణుడి పట్ల భక్తి ప్రపత్తులను కలిగి ఉండడం వల్ల... తమ తమ పూర్వ కర్మల కారణంగా ఏర్పడిన సుఖదుఃఖాల నుంచి విముక్తి కలుగుతుందనేది భగవద్రామానుజులు లాంటి పెద్దలు మానవాళికి అందించిన తరుణోపాయం. ఈనాటి పరిస్థితుల్లో... ఆధ్యాత్మిక సాధన ద్వారా ప్రజలు తమ ఒత్తిడులను పోగొట్టుకోవడం తప్ప వేరే మార్గం లేదు.

శ్రీభాష్యకార సిద్ధాంత పీఠ స్థాపనకు ప్రేరణ ఏమిటి?

సమాజంలోని అట్టడుగు వర్గాల వరకూ... భగవద్రామానుజ సిద్ధాంతానికి అనుగుణంగా భగవత్ తత్త్వాన్ని చేరవేయడానికే పీఠాన్ని స్థాపించాం.

శ్రీవైష్ణవ సంప్రదాయ పీఠాలు ఎన్నో ఉన్నాయి. మీ పీఠం ప్రత్యేకత ఏమిటి? ఇతర పీఠాలతో సమన్వయం ఎలా ఉంటుంది?

శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఎన్ని పీఠాలు ఉన్నా దేని ప్రత్యేకత దానిదే. వారివారి శక్త్యానుసారం సమాజ శ్రేయస్సు కోసం కార్యక్రమాలు చేయడం, ప్రజల్ని ఉత్తేజపరచి, సనాతన ధర్మాన్ని ఆచరించే విధంగా వారిని ముందుకు నడపడమే అన్ని పీఠాల ఉద్దేశం. ఈ క్రమంలో అన్ని పీఠాలు ఒక సమన్వయ పద్ధతిలో ఉండి తీరాల్సి ఉంది.

హిందూ ధర్మం నిమ్న వర్గాలకు దూరమయిందనే వాదన ఉంది. అందరికీ దాన్ని దగ్గర చేయడానికి మీ పీఠం చేస్తున్న కృషి, ఇతర కార్యక్రమాలు ఏమిటి?

అన్ని వర్గాలవారికి మన ధర్మం పట్ల విశ్వాసాన్ని కలుగజేసే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. 'భగవంతుడే రక్షకుడు' అనే విశ్వాసంతో వచ్చినవారికి సమాశ్రయణ సంస్కారం (దీక్ష ఇవ్వడం) చేస్తున్నాం. వారికి భగవత్తత్త్వాన్ని విశదంగా తెలియజేసే గ్రంథాల సారాన్ని బోధిస్తున్నాం, మంత్రోపదేశం చేస్తున్నాం. గురు శిష్య పరంపరను కొనసాగించడం ద్వారా సనాతన ధర్మాన్ని కలకాలం నిలిపే ప్రయత్నం జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, తిరుచానూరు, ముంగనూరు (హైదరాబాద్ సమీపంలో)లలో శ్రీ భాష్యకార సిద్ధాంత పీఠాన్ని స్థాపించాం. శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రచారం, ధర్మప్రచారం జరుగుతున్నాయి. మా సిద్ధాంతాలు, సంప్రదాయాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం అనేక పురాణ, ఇతిహాస, సంప్రదాయ గ్రంథాలను వ్యయప్రయాసలకోర్చి ముద్రిస్తున్నాం. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా... శ్రీభాష్యకార ఎడ్యుకేషనల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా శ్రీవాగీశ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి... పలువురు వేదపండితులను సమాజానికి అందించాం. గోసంరక్షణ చేస్తున్నాం. సంప్రదాయ విద్య మాత్రమే కాదు... లౌకిక విద్యను అభ్యసించే ఎంతో మంది విద్యార్థులకు కూడా ఆర్థిక, వస్తు రూపేణా చేయూత అందిస్తున్నాం. మేము ఆరాధించే గోవిందుని కృపకు వారిని పాత్రులుగా చేస్తున్నాం. ఇక... 2000నుంచి 2016 వరకు... పదహారేళ్ళపాటు శ్రీమహాలక్ష్మీ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించాం. అనేకమంది ప్రజలను వాటిలో భాగస్వాముల్ని చేశాం. ఇప్పుడు మళ్ళీ ప్రతి సంవత్సరం శ్రీమహాలక్ష్మీ యాగాలు నిర్వహిస్తున్నాం. భీమవరం, మునగనూరుల్లో ఆలయ నిర్మాణాలు జరుగుతున్నాయి.

సమాజంలో ఎటువంటి మార్పును ఆశిస్తున్నారు?

పీఠం కార్యక్రమాల ద్వారా, ప్రవచనాల ద్వారా సనాతన ధర్మం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడం, వారిలో భగవంతుడి పట్ల భక్తి ప్రపత్తులు కలిగించడం... ఇదే మేము ఆశించేది. అంతేకాకుండా 'వసుధైవ కుటుంబకమ్' అనే సూక్తిని ఆచరణలో పెట్టడం ద్వారా ప్రతి జీవిలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను దర్శించడం, సమాజంలో అహింసా ప్రవృత్తిని ప్రేరేపించడం కూడా.

• కృష్ణశర్మ

చాతుర్మాస్య దీక్ష ప్రాధాన్యత ఏమిటి? పరివ్రాజకులందరికీ అది తప్పనిసరా?

ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశి' అంటారు. దానినే 'శయన ఏకాదశి' అని కూడా అంటారు. ఆ రోజు శ్రీమన్నారాయణుడు పాలకడలిలో, శేషపాన్పు మీద శయనిస్తాడు. అప్పటి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకూ ఈ చాతుర్మాస్య వ్రతం నడుస్తుంది. స్వామి శయనించడంతో... నిత్య సంచారులుగా ఉండే యతులు ఆషాఢ పూర్ణిమ నుంచి కార్తీక పూర్ణిమ వరకూ తమ సంచారాలను నిలిపివేసి, ఒక చోటే ఉంటూ అనుష్ఠానాలు కొనసాగిస్తారు. ఏవైనా యజ్ఞ, యాగాది విశేష కార్యక్రమాలు, వాటి ప్రచార కార్యక్రమాలు ఉన్నప్పుడు... నాలుగు మాసాల ఈ వ్రతాన్ని నాలుగు పక్షాలుగా ఆచరిస్తారు. అది ఆషాఢ పూర్ణిమ నుంచి భాద్రపద పూర్ణిమ వరకు. భాద్రపద శుద్ధ ఏకాదశికి 'పరివర్తన ఏకాదశి' అని పేరు. అంటే శయనించిన స్వామి... ఒక వైపునకు ఒత్తిగిల్లుతారు. ఒత్తిగిల్లడం కూడా సగం మేలుకోవడం కాబట్టి... భాద్రపద పూర్ణిమకు కొందరు తమ దీక్షను విరమిస్తారు. కార్తీక శుద్ధ ఏకాదశికి 'ఉత్థాన ఏకాదశి' అని పేరు. అంటే శయనించే స్వామి మేలుకుంటారు. నాలుగు మాసాలు చాతుర్మాస వ్రతం చేసేవారు ఆ సమయంలో విరమణ చేస్తారు. ప్రధానంగా ఈ నాలుగు మాసాలు వర్షాకాలం. వర్షాలకు కీటకాదులు బయటకు వస్తాయి. యతులు సంచరించేటప్పుడు అవి వారి పాదాల కింద పడి మరణిస్తాయి. ఇది హింస చేయడమే. కాబట్టి యతులు ఒకే చోట ఉండి అనుష్ఠానాలు జరుపుకోవాలనే నియమం విధించారు. పరివ్రాజకులకు చాతుర్మాస్య వ్రతం తప్పనిసరి విధి. యతులను వారి చాతుర్మాస్యాల ఆధారంగానే 'వృద్ధ యతులు'గా నిర్ణయిస్తారు తప్ప... వయసును బట్టి కాదు.

తెలుసుకుందాం

పదునాల్గు భువన భాండాలు

చతుర్దశ భువనాల ప్రస్తావన పురాణాలలో తరచుగా కనిపిస్తుంది. భూమితోపాటు భూమికి పైన ఉన్న మరో ఆరు లోకాలు... అంటే మొత్తం ఏడింటిని 'ఊర్ధ్వలోకాలు' అనీ, భూమికి దిగువన ఉన్న ఏడు లోకాలను 'అధోలోకాలు' అనీ పిలుస్తారు. వీటి గురించి 'శ్రీమద్భాగవతం'లోని 'ద్వితీయ స్కంధం'లో వివరంగా ఉంది.

భువనాత్మకుం డాయీశుండు
భువనాకృతితోడ నుండు బ్రహ్మాండంబున్
వివరముతో బదునాలుగు
వివరంబులుగా నొనర్చె విశదంబులుగన్ (పోతన భాగవతం)

విశ్వస్వరూపుడైన భగవంతుడు ఒక భవనంలా ఉన్న బ్రహ్మాండాన్ని విడివిడిగా చేసి, విపులమైన పద్నాలుగు భువనాలుగా తీర్చిదిద్దాడు. ఈ విశ్వమంతా పరమాత్ముడి శరీరమే. పద్నాలుగు భువనాలుగా విభజితమైన ఈ విశ్వంలో... పైన ఉన్న ఏడు లోకాలు... శ్రీ మహా విష్ణువు నడుముకు పైన ఉన్న దేహం కాగా, దిగువన ఉన్న ఏడు లోకాలు... మహా విష్ణువు నడుముకు దిగువన ఉన్న శరీరం. ఆయన కటి స్థలం భూలోకం. నాభి భువర్లోకం, హృదయం సువర్లోకం, వక్షస్థలం మహర్లోకం, కంఠం జనలోకం, పెదవులు తపోలోకం, శిరస్సు బ్రహ్మ నివాసమైన సత్యలోకం. అలాగే.. జఘనం అతలం, ఊరువులు వితలం, మోకాళ్ళు సుతలం. పిక్కలు తలాతలం, చీలమండలు మహాతలం, కాలి మునివేళ్ళు రసాతలం, అరికాలు పాతాళం. కాగా... ఆయన పాదతలం నుంచి భూలోకం, నాభి నుంచి భువర్లోకం, శిరస్సు నుంచి సువర్లోకం... ఇలా ముల్లోకాల సృష్టి జరిగిందనేది మరో వివరణ. లోకాలన్నిటికీ కర్త, పోషకుడు, లయకారుడు ఆ భగవంతుడేననీ, ప్రళయకాలంలో ఈ పద్నాలుగు భువనాలు పరబ్రహ్మలో విలీనం అవుతాయని పూర్వ ఋషులు పేర్కొన్నారు. ఈ లోకాల విశిష్టతలను తెలుసుకుందాం.



భూలోకంతో కలిపి, భూలోకానికి పైన ఉండేవి ఊర్ధ్వలోకాలు:

భూలోకం: ఇక్కడ నాలుగు విధాలైన జీవరాశులు ఉంటాయి. అవి స్వేదజాలు (చెమట నుంచి ఉద్భవించే పేలు, నల్లులు లాంటివి), అండజాలు (గుడ్డు నుంచి ఉద్భవించే పక్షులు), జరాయుజాలు (మానవ, పశు గర్భాల నుంచి పుట్టే మనుషులు, పశువులు), ఉద్భిజాలు (మొక్కలు, చెట్లు).

భువర్లోకం: ఇది భూలోకానికి పైన ఉంటుంది. సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాలు, సూక్ష్మ శరీరంలో ఉండే కింపురుషులు, కిన్నెరులు, విద్యాధరులు లాంటి జాతుల వారు ఉంటారు.

సువర్లోకం: ఇది భువర్లోకం పైన ఉంటుంది. దీన్ని 'స్వర్గ లోకం' లేదా 'సువఃలోకం' అని కూడా అంటారు. ఇంద్రాది దిక్పాలకులు, మహర్షులు, గంధర్వులు, అప్సరసలు ఉంటారు. వారు కోరుకున్న రూపాన్ని పొందగలిగే సామర్థ్యం కలిగిన వారు. వారికి ఆకలి దప్పులు, శరీర దుర్గంధం, వృద్ధాప్యం లాంటివి ఉండవు.

మహర్లోకం: ఇది సువర్లోకానికి పైన ఉంటుంది. దేవతలు తపస్సు చేసే లోకం ఇది. స్వర్గంలో దేవతలు అనుభవించే దివ్య సుఖాలను.... ఇక్కడ తాపసులు తమ తపస్సు ద్వారా సంపూర్ణంగా అనుభవిస్తూ ఉంటారు.

జనోలోకం: దీన్నే 'సత్య లోకం' అని కూడా అంటారు. ఇది మహర్లోకానికి పైన ఉంటుంది. అత్యంత పుణ్యాత్ములైనవారు ఈ లోకంలో సుఖశాంతులతో వర్ధిల్లుతూ ఉంటారు. అయోనిజులైన దేవతలు ఇక్కడ తపస్సు చేస్తూ ఉంటారు.

తపోలోకం: ఇది జనోలోకం పైన ఉంటుంది. కైలాసం, వైకుంఠం, మణిద్వీపం, స్కంధలోకం ఇక్కడే ఉంటాయి. ఇక్కడ దేవతలు నివసిస్తారు. పంచభూతాలు, పంచేంద్రియాలు వారి ఆధీనంలో ఉంటాయి. ఎప్పుడూ సుగంధాలు వెదజల్లుతూ, ప్రశాంతంగా ఉండే లోకం ఇది. భూలోకంలో వివిధ దేవతలను ఉపాసించినవారు... ఈలోకానికి చేరుకొని, కల్పాంతం వరకూ ఇక్కడ తపస్సు చేస్తారు. ఆ తరువాత కర్మానుసారం భూలోకంలో జన్మించి, సత్కర్మలను ఆచరిస్తూ ఉంటారు. మహా ప్రళయంలో సర్వం లయమైనప్పుడు... వారు జన్మరాహిత్యాన్ని పొందుతారు.

సత్యలోకం: ఇది తపోలోకానికి పైన ఉంటుంది. ఊర్ధ్వలోకాలన్నిటిలో ఇది అత్యుత్తమమైనది. ఇది సృష్టికర్త అయిన బ్రహ్మకు నివాసం. బ్రహ్మ అనేది ఒక పదవి. అనేకానేక కల్పాలకు ఒకరు ఈ పదవిని అధిష్టిస్తారు. తమ కర్తవ్యం పూర్తయిన తరువాత బ్రహ్మంలో లయమవుతారు. భవిష్యత్తులో హనుమంతుడు బ్రహ్మ పదవిని స్వీకరిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. మహర్షులు అనేక ఉపాసనలు చేసినవారు, వేదాంతులు, భూలోకంలో ఆత్మజ్ఞానాన్ని పొందినవారు ఈ లోకంలో వేదాంత చర్చలు చేస్తూ ఉంటారు.

భూలోకానికి దిగువన ఉండేవి అధోలోకాలు:

అతల లోకం: భూమికి దిగువన ఉండే లోకం ఇది. ఈ లోకంలో రాక్షసులు ఉంటారు. వాళ్ళు భౌతికమైన భోగలాలసులుగా మదోన్మత్తులుగా ఉంటారు. మయుడి కుమారుడైన బలుడి విహార స్థలం.

వితల లోకం: అతలలోకానికి కింద ఉంటుంది. స్వర్ణ జలం ప్రవహించే హాటకీ నది ఉండే చోటు ఇది. ఈ నదీ జలాలతో తయారైన బంగారంతో తయారైన ఆభరణాలను రాక్షస మహిళలు ధరిస్తారు.

సుతల లోకం: వితల లోకానికి అడుగున ఉండే ఈ లోకంలోనే సప్త చిరంజీవులలో ఒకరైన బలి చక్రవర్తి ఉంటాడు. ఆయన నిత్యం విష్ణువును ధ్యానిస్తూ, ఇంద్రుడిని మించిన భోగాలను అనుభవిస్తూ... సుతలలోకాన్ని పాలిస్తాడు.

తలాతల లోకం: ఇది సుతలానికి కింద ఉంటుంది. మాయావులైన రాక్షసులతోపాటు దానవ శిల్పి మయుడు, మహా శివుడు సంహరించిన త్రిపురాసురులనే రాక్షస రాజులు ఇక్కడ ఉంటారు.

మహాతలం: గరుత్మంతుడి సవతితల్లి కద్రువ పుత్రులైన, వేలాది శిరస్సులు కలిగిన సర్పాలు (కాద్రవేయులు) సకుటుంబంగా ఇక్కడ నివసిస్తారు. వారు మహా బలవంతులు, కోరిన రూపం ధరించగలిగేవారు. ఈ లోకం తలాతలం కింద ఉంటుంది.

రసాతల లోకం: మహాతలానికి దిగువన ఉండే రసాతల లోకం... నివాత కవచులు, కాలకేయులు తదితర రాక్షసులకి నివాస స్థలం. వీరందరూ అత్యంత సాహసవంతులైన రాక్షస ప్రముఖులు.


పాతాళ లోకం: రసాతల లోకానికి కింద ఉండే పాతాళమే నాగలోకం. మహా మణులతో ప్రకాశిస్తూ ఉండే పాతాళంలో... నాగలోకాధిపతి వాసుకి, ఆదిశేషుడితో సహా సమస్త సర్పజాతి నివసిస్తూ ఉంటుంది.

సద్గురువాణి

సాధన అంటే...

"ఎంతకాలం సాధన చేసినా... ఎక్కడికీ చేరుకోలేనట్టు అనిపిస్తోంది" అనే ప్రశ్న ఎదురయింది. దీనికి సమాధానం ఏమిటంటే... మీరు ఎన్ని సంవత్సరాలు సాధన చేసినా ఎక్కడికీ వెళ్ళలేరు. వెళ్ళలేకపోవడం కాదు... అస్సలు వెళ్ళలేరు. ఎందుకంటే యోగం, ధ్యానం తదితర సాధనలు చేయడం వెనుక ఉన్న అంతరార్థం... ఎక్కడికో వెళ్ళడం కాదు, ఇక్కడ ఉండగలిగే స్థితికి రావడం. 'ఇక్కడ ఉన్నది ప్రతిచోటా ఉంది, ఇక్కడ లేనిది ఎక్కడా లేదు' అని అర్థం చేసుకోవడం. ఎక్కడికో వెళ్ళాల్సిన అవసరాన్ని దాటి వెళ్ళడమే సాధన. నిజానికి వెళ్ళేందుకు మరొక చోటంటూ ఏదీ లేదు. ఉన్నదల్లా ఇక్కడే... ఈ క్షణం మాత్రమే. మిగిలినదంతా మీ ఆలోచనల్లోనే ఉంది.

సాధన అనేది ఒక ఉపకరణం. మీలో పరిపక్వత తీసుకువచ్చి, మరెక్కడికో వెళ్ళాల్సిన అవసరాన్ని పోగొట్టే ఒక పద్ధతి. మీరు ఇక్కడ కూర్చుంటారా?, హిమాలయాల్లో లేదా ఆఫ్రికాలో, అమెరికాలో, ఉత్తర ధృవంలో, దక్షిణ ధృవంలో కూర్చుంటారా? అనేది ముఖ్యం కాదు. బహుశా కొన్ని ప్రదేశాలు అనుకూలంగా ఉండొచ్చు. కానీ అది ప్రధానం కాదు. సాధనలో... మీలో జరిగేదాన్ని మాత్రమే మీరు అనుభూతి చెందుతారు. ఉన్నది ఉన్నట్టుగా చూసే పరిపక్వ స్థాయికి మిమ్మల్ని చేర్చేదే సాధన.



• సద్గురు జగ్గీ వాసుదేవ్

కాపాడేది సత్యమే



ఇద్దరు వ్యక్తులు ఒక నీటి ప్రవాహంలో చిక్కుకుపోయారు. వారిని ఒడ్డున ఉన్న ప్రజలు గమనిస్తున్నారు. కానీ ఎలా కాపాడాలో తెలియక ఆందోళన పడుతున్నారు. ఇంతలో... ఆ వ్యక్తుల్లో ఒకరికి పెద్ద దుంగ కనిపించింది. దాన్ని అతను గట్టిగా పట్టుకున్నాడు. రెండో వ్యక్తి చుట్టూ వెతికితే... ఒక తాడు కనిపించింది. అతను దాన్ని అందుకున్నాడు. ఒడ్డు వైపు విసిరాడు. అక్కడ ఉన్న జనం దాన్ని పట్టుకున్నారు. ఆ తాడు... దుంగలా దృఢంగా లేదు. చాలా దుర్బలంగా, గట్టిగా లాగితే తెగిపోయేలా ఉంది. కానీ దాన్ని ఒడ్డున ఉన్న వాళ్ళు మెల్లగా లాగారు. తాడు చివర ఉన్న వ్యక్తిని ఒడ్డుకు చేర్చారు. పెద్ద దుంగ ఉన్న వ్యక్తి దాన్నే అంటిపెట్టుకొని ఉన్నాడు. ఉధృతంగా ఉన్న ప్రవాహం అతన్ని దిగువకు లాక్కొనిపోయింది.

మనకు ప్రాపంచికమైన ఆనందాలు, డబ్బు, పేరు ప్రతిష్ఠలు, ఆడంబరాలు దుంగలా పెద్దవిగా కనిపిస్తాయి. కానీ అవేవీ మనల్ని రక్షించలేవు. రక్షణ సూత్రం ఎప్పుడూ సన్నటి తాడులాగానే ఉంటుంది. ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే... మనల్ని కాపాడేది ఏదీ మన కళ్ళకి కనిపించదు. దాన్ని మనం స్పృశించలేం. అనుభూతి చెందలేం. అదే అంతిమమైన సత్యం. అది ఎప్పుడూ అగోచరంగానే ఉంటుంది. ఆ సత్యాన్ని గ్రహించి, దాన్ని నమ్ముకుంటే మనల్ని కాపాడుతుంది. ప్రాపంచికమైన వాటి మీద ఆధారపడి, అవే నిత్యం అనుకుంటే... నిస్సహాయతలో, దుఃఖంలో మునిగిపోక తప్పదు. కాబట్టి ఏది సత్యమో, ఏది మనని కాపాడుతుందో తెలుసుకోవాలి. దాన్ని అంటిపెట్టుకొని ఉండాలి. లౌకికమైన వస్తువులను, సంపదను నమ్ముకున్న వ్యక్తి నాశనమైపోతాడనేది ప్రకృతి సూత్రం. భగవంతుడి మీద విశ్వాసమే మనల్ని సురక్షితంగా ఉంచుతుంది.

- స్వామి రామతీర్థ

స్పోర్ట్స్

క్రీడల్లో మరింత మంది మెరవాలి

● ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: క్రీడా రంగం అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని భారత హాకీకి ఆయన తీసుకొచ్చిన ఖ్యాతిని కొనియాడారు. ధ్యాన్‌చంద్ గౌరవార్థం ప్రతి ఏటా జరుపుకుంటున్న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశంలోని క్రీడాకారులు సాధించిన ఘనకీర్తులను స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో భారత్ తరఫున క్రీడల్లో మరింత మంది మెరవాలని ఆకాంక్షించారు.

వరల్డ్ అథ్లెటిక్స్ ఫైనల్లో షారుఖ్

జాతీయ స్టీపుల్‌చేజ్ రికార్డు బ్రేక్



న్యూఢిల్లీ: వరల్డ్ అథ్లెటిక్స్ అండర్-20 చాంపియన్‌షిప్ 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో భారత యువ అథ్లెట్ షారుఖ్ ఖాన్ ఫైనల్‌కు చేరాడు. ఈ క్రమంలో స్టీపుల్‌చేజ్ అండర్-20 జాతీయ రికార్డును కూడా షారుఖ్ బద్దలుకొట్టాడు. తాజాగా జరిగిన హీట్స్‌లో 18 ఏళ్ల షారుఖ్ 8 నిమిషాల 45.12 సెకన్లలో రేసును ముగించి ఆరో స్థానంలో నిలిచాడు.

కివీస్ బౌలింగ్ కోచ్‌గా ఓరమ్

క్రైస్ట్‌చర్చ్: భారత్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్ బౌలింగ్ కోచ్‌గా ఆ జట్టు మాజీ ఆల్‌రౌండర్ జేకబ్ ఓరమ్ వ్యవహరించనున్నాడు. మూడు టెస్టుల సిరీస్ కోసం కివీస్ జట్టు అక్టోబరులో భారత్‌కు రానుంది.

షహీన్ అఫ్రీదిపై వేటు!

కరాచీ: పాకిస్థాన్ జట్టులో కీలక పేసర్‌గా కొనసాగుతున్న షహీన్‌షా అఫ్రీదిపై వేటు పడింది. బంగ్లాదేశ్‌తో శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టు కోసం షాన్ మసూద్ సారథ్యంలో 12 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. ఇందులో షహీన్‌కు చోటు దక్కలేదు. దీంతో రెండో టెస్టుకు లెఫ్టామ్ పేసర్ మీర్ హమ్జాను తీసుకున్నారు. అలాగే స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌కు చోటు కల్పించారు.

పారాలింపిక్స్

రెండో ర్యాంకుతో ప్రీక్వార్టర్స్‌కు శీతల్



పారిస్: పారాలింపిక్స్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన కాంపౌండ్ ఆర్చర్ శీతల్ దేవి త్రుటిలో ప్రపంచ రికార్డును చేజార్చుకొంది. గురువారం జరిగిన మహిళల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో మొత్తం 703 పాయింట్లు సాధించిన శీతల్.. రెండో ర్యాంక్‌తో ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. ఈ క్రమంలో ఫోబీ ప్యాటర్సన్ (698 పాయింట్లు) వరల్డ్ రికార్డును బద్దలు కొట్టింది. అయితే, టర్కీ ఆర్చర్ ఓజ్నూర్ గిర్డీ క్యూర్ మొత్తం 704 పాయింట్లతో శీతల్‌ను అధిగమించడమే కాకుండా.. ప్రపంచ రికార్డుతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొంది. టాప్-4లో నిలిచిన ఆర్చర్లు నేరుగా రౌండ్- 16కు అర్హత సాధిస్తారు. సరిత 682 పాయింట్లతో 9వ స్థానం దక్కించుకొంది. శనివారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో రౌండ్-32 విజేతతో శీతల్ తలపడనుంది. రెండు చేతులు లేకుండా జన్మించిన శీతల్.. కాళ్లతోనే గురి చూసి బాణాలు సంధిస్తుంది. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ విభాగం ర్యాంకింగ్ రౌండ్‌లో రాకేశ్ కుమార్ 5వ స్థానంలో, శ్యామ్ సుందర్ స్వామి 15వ స్థానంలో నిలిచారు.

సుఖాంత్, యతిరాజ్ బోణీ: బ్యాడ్మింటన్‌లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల ఎస్ఎల్-4 విభాగంలో సుకాంత్ కదమ్, టోక్యో రజత పతక విజేత సుహాస్ యతిరాజ్, తరుణ్ గ్రూప్ దశను విజయాలతో ఆరంభించారు. గురువారం జరిగిన పురుషుల ఎస్ఎల్4 గ్రూప్-బిలో తన తొలి మ్యాచ్‌లో కదమ్ 17-21, 21-15, 22-20తో మహ్మద్ అమీన్ బర్హుద్దీన్ (మలేసియా)పై, గ్రూప్-డిలో తరుణ్ 21-17, 21-19తో ఒలివెరా రోడ్రి గో (బ్రెజిల్) గెలిచారు. గ్రూప్-ఎలో సుహాస్ యతిరాజ్ 21-7, 21-5తో హికామత్ రమ్దానీ (ఇండోనేసియా)పై నెగ్గాడు. ఐఏఎస్ అధికారి అయిన సుహాస్ జిల్లా కలెక్టర్‌గా సేవలందించాడు. మహిళల గ్రూప్-సిలో పలక్ కోహ్లీ 21-12, 21-14తో మెలినా (ఫ్రాన్స్)ను ఓడించింది. మహిళల ఎస్ఎల్-3 గ్రూప్-ఎలో మాన్సీ జోషి 21-16, 13-21, 18-21తో ఇక్తియర్ కోనితా (ఇండోనేసియా) చేతిలో, మన్‌దీప్ కౌర్ 8-21, 14-21తో మరియం ఇనోలా (నైజీరియా) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ ఎస్ఎల్3-ఎస్‌యు 5 గ్రూప్-ఎలో సహచర జంటల మధ్య జరిగిన మ్యాచ్‌లో నితీష్ కుమార్-తులసీమతి 21-14, 21-17తో యతిరాజ్-పలక్ జంటపై గెలిచింది.

తొలి స్వర్ణం

పారిస్ పారాలింపిక్స్‌లో తొలి స్వర్ణం నెదర్లాండ్స్ సైక్లిస్ట్ కరోలిన్ గ్రూట్ సొంతం చేసుకొంది. మహిళల ట్రాక్ సైక్లింగ్ సి4-5 500 మీ. టైమ్ ట్రయల్‌లో కరోలిన్ 35.566 సెకన్ల టైమింగ్‌తో పసిడి పట్టేసింది.



శతలో 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ స్వర్ణం నెగ్గిన గాబ్రియెల్ గెరాల్డో అరాజో (బ్రెజిల్); సైక్లింగ్ ఇండివిడ్యువల్ పర్స్యూట్‌లో కాంస్యం సాధించిన రికార్డో టెన్ అర్గైల్స్ (స్పెయిన్) ఆనందం

గేమ్స్ ముగిశాక.. జరిగేది ఇదే

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యమివ్వడమంటే మాటలు కాదు. బిలియన్లకొద్దీ డాలర్లను ఖర్చుపెడుతూ కొత్త నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. అలాగే సరికొత్త క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఏళ్ల కొద్దీ సాగిన ఈ ఏర్పాట్లన్నీ కేవలం నెల రోజులపాటు జరిగే పోటీల కోసమేననే విషయం తెలిసిందే. మరి.. ఆ తర్వాత ఏం జరుగుతుంది? వందలకొద్దీ బంతులు, నెట్స్, క్రీడా ఫ్లోర్లతో పాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఈత కొలనులు.. అలాగే ఇతర క్రీడా పరికరాలు ఏమవుతాయి? ఎలా వినియోగించుకుంటారనే సందేహం క్రీడాభిమానులకు వస్తుంటుంది. వాస్తవానికి అత్యంత ఆర్భాటంగా గేమ్స్‌ను నిర్వహించాక ఆర్గనైజర్లకు ఆ పనిముట్లు, క్రీడా పరికరాలతో ఎలాంటి ఉపయోగమూ ఉండదు. అందుకే వాటిని తయారీదారులకు తిరిగిచ్చేయడమో లేక స్థానిక క్లబ్బులకు, సంస్థలకు డొనేట్ చేయడమో జరుగుతూంటుంది. అయితే ప్రస్తుత పారిస్ గేమ్స్ నిర్వాహకులు తెలిపిన దాని ప్రకారం.. ఈ గేమ్స్ కోసం ఉపయోగించిన మొత్తం 12 మిలియన్ క్రీడాపరికరాల్లో 75 శాతం ఆయా క్రీడా సమాఖ్యల నుంచి లీజుకు తీసుకున్నవేనట. కాబట్టి తిరిగి అవి తమ స్వంతదారుల చెంతకు వెళ్లనున్నాయి. ఇలా ఫ్రెంచ్ వాలీబాల్ సమాఖ్య తమ దగ్గరకు వచ్చిన బంతులు, నెట్స్, పోస్ట్స్, స్పోర్ట్స్ ఫ్లోర్లు దేశంలోని ఇతర క్రీడా సెంటర్లకు పంపిణీ చేయనుంది. అలాగే తైక్వాండో సమాఖ్య కూడా పారిస్ రీజియన్‌లోని అనేక క్లబ్బులకు సరఫరా చేస్తుంది. ఇక మిగిలిన 25 శాతం కొనుగోలు చేసిన పరికరాలను దేశంలో క్రీడాభివృద్ధి కోసం విరాళంగా ఇవ్వనున్నారు. సెయినీ సెయింట్ డెనిస్ లాంటి ప్రాంతాల్లో కనీస క్రీడా సదుపాయాలు కూడా లేవు. అలాంటి చోట్ల ఆయా ప్రజల ఫిట్‌నెస్‌తో పాటు ఆటల పట్ల మక్కువ పెంచేందుకు వీటిని వినియోగిస్తారు. మరోవైపు పారిస్ గేమ్స్ కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొన్ని సౌకర్యాలను వివిధ వేదికలకు మార్చుతారు. బీచ్ వాలీబాల్ ఈవెంట్‌ను నిర్వహించిన ఈఫిల్ టవర్ స్టేడియంలోని ఇసుకను మార్విల్లేలోని డిపార్ట్‌మెంటల్ పార్క్‌లో మూడు పిచ్‌ల ఏర్పాటు కోసం వినియోగించనున్నారు. అలాగే స్కేట్‌బోర్డు స్ట్రీట్ కాంపిటీషన్ ఏరియాను సెయినీ సెయింట్ డెనిస్‌లో తిరిగి ఏర్పాటు చేయబోతున్నారు. పారిస్ లా డిఫెన్స్ ఎరీనాలో ఉన్న తాత్కాలిక స్విమ్మింగ్‌పూల్స్‌ను సెయినీ సెయింట్ డెనిస్, సెవ్రాన్, బగ్నోలెట్ ప్రాంతాల్లో రీఇన్‌స్టాల్ చేసి వినియోగంలోకి తెస్తారు. ఇక పోటీల కోసం ప్రఖ్యాత గెర్‌ఫ్లోర్ కంపెనీ ఆయా వేదికల్లో 33 వేల మీటర్ల ఫ్లోర్లను బిగించింది. గేమ్స్ ముగిశాక ఈ స్పోర్ట్స్ ఫ్లోరింగ్‌ను తొలగించి పారిస్ రీజియన్‌లోని మున్సిపాలిటీలు, క్లబ్బుల్లో తిరిగి ఏర్పాటు చేయనుంది. మరోవైపు ఒలింపిక్ చరిత్రలోనే తొలిసారిగా 12 ప్రాంతాల్లో సెకండ్ హ్యాండ్ ఫెయిర్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందులో వేలాది యూనిఫామ్స్, కప్స్, ఫ్లాగ్స్, అథ్లెట్లు వినియోగించిన టవల్స్, వేదికలను అలంకరించేందుకు ఉపయోగించిన వస్తువులను అమ్మకానికి ఉంచుతారు. ఇవే కాకుండా వేలాది ట్రాలీలు, హ్యాండ్ ట్రక్స్, ఫ్యాన్లు, వ్యాక్యూమ్ క్లీనర్లను ఆయా క్రీడాసమాఖ్యలు, కమ్యూనిటీస్, వ్యాపార కంపెనీలు కొనుగోలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్నాయి.

సిన్నర్ అలవోకగా..



న్యూయార్క్: టాప్ సీడ్ జానిక్ సిన్నర్ సునాయాస విజయంతో ముందంజ వేయగా.. డిఫెండింగ్ చాంప్‌లు నొవాక్ జొకోవిచ్, కొకొ గాఫ్‌తోపాటు రెండో సీడ్ అర్యానా సబలెంక, అలెగ్జాండర్ జ్వెరెవ్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో స్నిన్నర్ 6-4, 6-0, 6-2తో అలెక్స్ మిచెల్సన్ (అమెరికా)పై వరుస సెట్లతో నెగ్గాడు. రెండో సీడ్ జొకోవిచ్‌కు వాకోవర్ లభించింది. లాసియా డిజారితో రెండో రౌండ్ మ్యాచ్‌లో జొకో 6-4, 6-4, 2-0తో ముందంజలో ఉన్న సమయంలో ప్రత్యర్థి మెడికల్ కారణాలతో రిటైరయ్యాడు. 8వ సీడ్ కాస్పర్ రూడ్ 6-4, 6-2, 2-6, 7-6(3)తో గేల్ మోన్‌ఫిల్స్‌ను ఓడించారు. మహిళల్లో సబలెంక 6-3, 6-1తో లూసియా బ్రోంజెట్టి (ఇటలీ)పై, మూడో సీడ్ గాఫ్ (అమెరికా) 6-4, 6-0తో మారియా (జర్మనీ)పై, ఎమ్మా నవారో 6-1, 6-1తో రుస్‌పై, ఉక్రెయిన్ భామ స్విటోలినా (ఉక్రెయిన్) 6-1, 6-2తో అన్హెలినా కలినినాపై, 7వ సీడ్ క్విన్‌వెన్ జాంగ్ 6-7(3), 6-1, 6-2తో ఎరికా ఆండ్రీవ పై, విక్టోరియా అజరెంకా 6-1, 6-4తో క్లారా బురెల్‌పై, మర్టా కోస్ట్యుయక్ 7-6(10), 6-1తో హ్యారియట్ డార్ట్‌పై, అన్నా కలిన్‌స్కియా 6-2, 6-4తో అన్నా బోండర్‌పై గెలిచి మూడో రౌండ్‌కు చేరుకొన్నారు.

గుకేష్, ప్రజ్ఞా ఐదో స్థానంతో సరి

అలీరెజాకు టైటిల్

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్యుఫీల్డ్ కప్‌ను భారత గ్రాండ్‌మాస్టర్లు డి.గుకేష్, ఆర్.ప్రజ్ఞానంద ఒక్క విజయం కూడా లేకుండా ముగించారు. ఫ్రాన్స్ జీఎం అలీరెజా ఫిరౌజా టైటిల్ కైవసం చేసుకోగా, స్థానిక జీఎం ఫాబియానో కరువానా రన్నరప్‌గా నిలిచాడు. భారత్ జీఎంలు ప్రజ్ఞానంద, గుకేష్ సంయుక్తంగా ఐదో స్థానం దక్కించుకున్నారు. అలీరెజా (6) టాప్‌లో నిలవగా, ప్రజ్ఞానంద, గుకేష్ చెరో 4.5 పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకున్నారు.

రిలయన్స్ బోనస్ షేర్ల బొనాంజా

ఒక షేరుకు బోనస్‌గా మరో షేరు జారీ



- వచ్చేనెల 5న బోర్డు భేటీలో తుది నిర్ణయం
- దీపావళికి జియో ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- జియోఫోన్‌కాల్ ఏఐ సేవల ప్రారంభం
- 47వ ఏజీఎంలో ముకేశ్ అంబానీ ప్రకటన

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తన షేర్‌హోల్డర్లకు బోనస్ షేర్ల బొనాంజా ప్రకటించింది. కంపెనీ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న ప్రతి షేరుకు బోనస్‌గా మరో షేరును (1:1 నిష్పత్తిలో) జారీ చేయాలనుకుంటున్నట్లు ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటించారు. కంపెనీ వాటాదారుల 47వ వార్షిక సాధారణ సమావేశంలో (ఏజీఎం) మాట్లాడుతూ వచ్చేనెల 5న సమావేశం కానున్న ఆర్ఐఎల్ బోర్డు ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు వాటాదారుల నుంచి ఆమోదం కోరనుందన్నారు. 2000 సంవత్సరం నుంచి ఆర్ఐఎల్ ఇప్పటికే రెండు సార్లు (2017 సెప్టెంబరు, 2009 నవంబరు) వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసింది. 'కంపెనీ స్వల్పకాలిక లాభార్జనను కోరుకోవడం లేదు. సంపదను కూడబెట్టాలనుకోవడం లేదు. దేశం కోసం సంపదను సృష్టించాలనుకుంటోంది' అని ఏజీఎంలో అంబానీ అన్నారు. బోనస్ షేర్ల జారీ ప్రకటనతో బీఎస్ఈలో కంపెనీ షేరు 1.51 శాతం పెరిగి రూ.3,040.85కు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.30వేల కోట్లకు పైగా పెరిగి మొత్తం రూ.20.57 లక్షల కోట్లు దాటింది.

100జీబీ ఉచిత క్లౌడ్ స్టోరేజీ

ఈ ఏడాది దీపావళికి జియో ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రారంభించనున్నట్లులో అంబానీ ప్రకటించారు.ఈ ఆఫర్‌లో భాగంగా, రిలయన్స్ జియో తన వినియోగదారులకు 100జీబీ వరకు ఉచిత క్లౌడ్ స్టోరేజీ వసతి కల్పించనుందని అంబానీ తెలిపారు. ఈ ఏఐ ఆధారిత క్లౌడ్ స్టోరేజీలో జియో యూజర్లు తమ ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లతోపాటు ఇతర డిజిటల్ కంటెంట్, డేటాను స్టోర్ చేసుకోవచ్చన్నారు. అవసరమైన వారికి అదనపు స్టోరేజిని అత్యంత అందుబాటు ధరలో అందించనున్నట్లు అంబానీ స్పష్టం చేశారు. ఈ సేవల ద్వారా గూగుల్, యాపిల్‌కు జియో గట్టిపోటీ ఇవ్వనుందని మార్కెట్ వర్గాలన్నాయి. జియో అందించనున్న మరిన్ని ఏఐ సేవల వివరాలు..

జియో ఫోన్‌కాల్ ఏఐ: రిలయన్స్ జియో తన వినియోగదారుల ఫోన్‌కాల్స్‌ను ఏఐతో అనుసంధానించేందుకు వీలుగా 'జియోఫోన్‌కాల్ ఏఐ' సర్వీసును ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్ ద్వారా జియో యూజర్లు తమ కాల్స్‌ను రికార్డ్ చేసుకోవడంతో పాటు కాల్ రికార్డ్స్‌ను జియో క్లౌడ్‌లో స్టోర్ చేసుకోవచ్చు. అంతేకాదు, రికార్డ్ చేసుకున్న కాల్ సంభాషణను టెక్ట్స్ రూపంలోకి బదిలీ చేసుకోవచ్చు. ఇతర భాషలోకి తర్జుమా కూడా చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. అంతేకాదు, సుదీర్ఘ సంభాషణను సంక్షిప్త రూపంలోనూ క్లౌడ్‌లో నిక్షిప్తం చేసుకోవచ్చు.

జియో బ్రెయిన్: అందుబాటు ధరలో శక్తిమంతమైన జనరేటివ్ ఏఐ మోడల్స్‌ను ఆఫర్ చేసేందుకు జియో బ్రెయిన్ పేరుతో పూర్తి ఏఐ లైఫ్‌సైకిల్ టూల్స్, ప్లాట్‌ఫామ్స్‌తో కూడిన సమగ్ర సూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి, కచ్చితమైన అంచనాలతో పాటు కస్టమర్ల అవసరాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు ఇది దోహదపడనుందని అంబానీ అన్నారు.

జియో టీవీ ఓఎస్: యాపిల్ సిరి, అమెజాన్ అలెక్సాకు పోటీగా జియోటీవీ ఓఎస్ విత్ వాయిస్ అసిస్టెంట్ హల్లో జియోను లాంచ్ చేస్తున్నట్లు ముకేశ్ అంబానీ ప్రకటించారు. పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ ఆపరేటింగ్ సిస్టమ్ జియో సెట్‌టాప్ బాక్స్‌ల పనితీరును మరింత మెరుగుపరచనుందన్నారు. ముఖ్యంగా బడా సైజు స్మార్ట్‌టీవీల్లో మరింత వేగంగా, నిరాటంకంగా, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా సేవలను పొందడానికి ఇది తోడ్పడనుందన్నారు.

ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : జామ్‌నగర్‌లో గిగావాట్ స్థాయి ఏఐ రెడీ డేటా సెంటర్ల ఏర్పాటు ద్వారా జాతీయ స్థాయి ఏఐ మౌలిక వసతిని అభివృద్ధి చేయనున్నట్లు అంబానీ ప్రకటించారు.

రిటైల్ వ్యాపారం 3-4 ఏళ్లలో రెట్టింపు

త్వరలో లగ్జరీ జువెలరీ విభాగంలోకి..

గత ఆర్థిక సంవత్సరంలో రూ.3 లక్షల కోట్ల వార్షికాదాయ మైలురాయిని అధిగమించిన రిలయన్స్ రిటైల్.. వచ్చే 3-4 ఏళ్లలో వ్యాపారాన్ని రెట్టింపు స్థాయికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని ఈ విభాగ డైరెక్టర్ ఇషా అంబానీ తెలిపారు. త్వరలోనే లగ్జరీ జువెల్లరీ వ్యాపారంలోకి అడుగుపెట్టనున్నట్లు వెల్లడించారు.

అతిపెద్ద మొబైల్ డేటా కంపెనీగా జియో

ప్రపంచంలో అతిపెద్ద మొబైల్ డేటా మార్కెట్‌గా భారత్, అతిపెద్ద మొబైల్ డేటా సేవల కంపెనీగా రిలయన్స్ జియో అవతరించాయని ముకేశ్ అంబానీ తెలిపారు. జియో ప్రస్తుత కస్టమర్లు 49 కోట్లకు చేరుకున్నారని, వారి నెలవారీ డేటా వినియోగ సగటు 30 జీబీ దాటిందన్నారు. ప్రపంచ డేటా ట్రాఫిక్‌లో జియో వాటా 8 శాతంగా ఉందన్నారు. కాగా, జియో 5జీ, 6జీ సాంకేతికతలకు సంబంధించి 350 పేటెంట్ల కోసం దరఖాస్తు చేసిందన్నారు.

ప్రపంచ టాప్-30లోకి..

రిలయన్స్ ఇండస్ట్రీస్ డీప్ టెక్నాలజీ సామర్థ్య కంపెనీగా పరివర్తనం చెందుతోందని అంబానీ అన్నారు. డీప్ టెక్ సాంకేతిక సామర్థ్యాలు, ఆధునిక ఉత్పత్తి విధానాల వినియోగం ద్వారా రిలయన్స్ సమీప భవిష్యత్‌లో ప్రపంచంలోని టాప్-30 కంపెనీల జాబితాలో చేరనుందన్నారు. గుజరాత్, జామ్‌నగర్‌లో 20 గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ గిగా ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఈ ఏడాది చివరినాటికి ప్రారంభం కానుందని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

2030 నాటికి ఆర్ఐఎల్ సైజు డబుల్

రిలయన్స్ ఇండస్ట్రీస్ పరిమాణం 2030 నాటికి రెట్టింపు కానుందని ముకేశ్ అన్నారు. వచ్చే 3-4 ఏళ్లలో రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్ వ్యాపారాల ఆదాయం, స్థూల లాభం రెట్టింపు కావచ్చన్నారు. గ్రీన్ ఎనర్జీ బిజినెస్ వచ్చే 5-7 ఏళ్లలో ఓ2సీ వ్యాపార పరిమాణం, లాభార్జన స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బిజినెస్

రియల్టీలోకి ఎంఎస్ఎన్ గ్రూప్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇప్పటివరకు ఫార్మా రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న ఎంఎస్ఎన్ గ్రూప్ రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రవేశించింది. రాబోయే 5 సంవత్సరాల కాలంలో హైదరాబాద్‌లోని ప్రీమియం ప్రదేశాల్లో 2 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో లగ్జరీ ఫ్లాట్లు, వాణిజ్య ప్రదేశాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గురువారం ఎంఎస్ఎన్ రియల్టీ బ్రాండ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి ఈ విషయం ప్రకటించారు. తమ తొలి ప్రాజెక్టు నియోపోలిస్‌లో ప్రారంభం కానున్నట్టు ఆయన చెప్పారు. అక్కడ 15 ఎకరాల స్థలం కొనుగోలు చేశామని; రెరా, హెచ్ఎండీఏ అనుమతులు రాగానే నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం తమ చేతిలో విభిన్న ప్రాంతాల్లో 40 ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రియల్టీ కార్యకలాపాల కోసం ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ పేరు మీద ప్రత్యేక అనుబంధ సంస్థ ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. తెల్లాపూర్, మంచిరేవుల, పటాన్‌చెరు, ఇస్నాపూర్‌లలో ప్రాజెక్టులు చేపట్టే యోచన ఉన్నదన్నారు. ప్రస్తుతానికి లగ్జరీ భవనాల నిర్మాణం మాత్రమే చేపడతామని; తదుపరి దశలో అఫర్డబుల్ హౌసింగ్, రిటైల్ విభాగాల్లో ప్రవేశించే యోచన ఉన్నదని ఆయన తెలిపారు. తమ ప్రాజెక్టులో ఫ్లాట్ కనీస విస్తీర్ణం 2500 నుంచి 3000 చదరపు అడుగులుంటుందన్నారు. ఈ ఏడాది మార్చి చివరికి తమ గ్రూప్ 100 బిలియన్ డాలర్ మైలురాయిని దాటినట్టు డాక్టర్ రెడ్డి తెలియచేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,200 ▼	67,100 ▼	93,000 ▼
ముంబై	72,000 ▲	65,950 ▲	85,070 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30 వ తేదీ

హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	508	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	108
వరంగల్	109	గుంటూరు	107
కరీంనగర్	109	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	100
కర్నూలు	109	నెల్లూరు	100
విశాఖపట్నం	104	అనంతపురం	107
గోదావరి	108		

స్పైస్‌జెట్‌పై డీజీసీఏ విస్తృత నిఘా

న్యూఢిల్లీ: సంక్షోభంలో ఉన్న స్పైస్‌జెట్‌ను పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) కార్యాలయం విస్తృత నిఘాలో పెట్టింది. దీని కింద విమానయాన కార్యకలాపాల్లో భద్రత కోసం డీజీసీఏ అధికారులు స్పాట్ చెకింగ్‌లు చేయడంతో పాటు రాత్రి వేళ నిఘా పెంచుతారు. ఇటీవల కాలంలో విమానాల రద్దు సంఘటనలు పెరిగడంతో పాటు సంస్థ ఆర్థిక ఒత్తిడులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగాలపై స్పెషల్ ఆడిట్ నిర్వహించామని, అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని డీజీసీఏ తెలిపింది.

ప్రభుత్వానికి ఎల్ఐసీ డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వానికి ఎల్ఐసీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.3662.17 కోట్ల డివిడెండ్ చెల్లించింది. ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ మొహంతి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు డివిడెండ్ చెక్కును అందచేశారు. ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన చెల్లించిన మధ్యంతర డివిడెండ్ రూ.2441.45 కోట్లతో కలిపితే మొత్తం రూ.6103.62 కోట్ల డివిడెండు చెల్లించినట్టయింది.

స్టాక్ మార్కెట్‌లో రికార్డుల హోరు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో రికార్డుల హోరు కొనసాగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ గురువారం మరో ఆల్‌టైమ్ హై వద్ద ముగిశాయి. సెన్సెక్స్ 349.05 పాయింట్ల లాభంతో 82,134.61 వద్ద, నిఫ్టీ 99.60 పాయింట్ల లాభంతో 25,151.95 వద్ద క్లోజయ్యాయి. ఇంట్రా డేలో సెన్సెక్స్ 500.27 పాయింట్ల లాభంతో 82,285.83 పాయింట్ల జీవిత కాల గరిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రా డేలో 140.55 పాయింట్ల లాభంతో 25,192.90 పాయింట్ల జీవిత కాల గరిష్ఠాన్ని తాకింది. గత ఎనిమిది సెషన్స్‌లో సెన్సెక్స్ 1,709.93 పాయింట్లు లాభపడింది. నిజానికి సూచీలు గురువారం ఇంట్రా డేలో తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యాయి. మిడ్ సెషన్‌లో ఒక దశలో సూచీలు నష్టాల్లోకి వెళ్లాయి. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయనున్నట్టు కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ చేసిన ప్రకటన ట్రేడింగ్ చివర్లో మార్కెట్‌కు బూస్ట్‌లా పని చేసింది.

లాభాల్లో టీవీ18, నెట్‌వర్క్18 షేర్లు

టీవీ18, నెట్‌వర్క్18 కంపెనీల షేర్లు గురువారం మంచి లాభాలతో ముగిశాయి. రిలయన్స్-వాల్ట్ డిస్నీ మీడియా ఆస్తుల విలీనానికి సీసీఐ ఆమోదం తెలపడం ఇందుకు ప్రధాన కారణం. దీంతో బీఎస్ఈలో టీవీ18 షేర్లు ఒక దశలో 13.18 శాతం లాభంతో రూ.54.26కు దూసుకు పోయాయి. చివరికి 7.66 శాతం లాభంతో రూ.51.61 వద్ద ముగిశాయి. నెట్‌వర్క్18 కంపెనీ షేర్లూ ఇంట్రా డేలో ఒక దశలో 10.17 శాతం లాభంతో రూ.106.01కి దూసుకు పోయాయి. చివరికి 3.42 శాతం లాభంతో రూ.99.51 వద్ద ముగిశాయి.

ప్రీమియర్ ఎనర్జీ ఐపీఓ సూపర్ హిట్

గురువారం ముగిసిన హైదరాబాద్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీ ఐపీఓ 74.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.2,830 కోట్ల సమీకరణ కోసం కంపెనీ 4,46,40,825 షేర్లు జారీ చేయగా, మదుపరుల నుంచి 3,30,76,25,013 షేర్లకు బిడ్స్ వచ్చాయి. క్యూఐబీ ఇష్యూ 216.67 రెట్లు, నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల విభాగం 49.76 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 7.25 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

జనరిక్ కేన్సర్ ఔషధం కోసం ఎఫ్‌డీఏకి నాట్కో దరఖాస్తు

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే నాట్కో ఫార్మా మరో జనరిక్ కేన్సర్ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఊపిరితిత్తుల కేన్సర్ చికిత్సలో ఉపయోగించే ఈ ఔషధానికి సంబంధించిన అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్‌ను (అండా) అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏకు సమర్పించింది. ప్రస్తుతం నోవార్టిస్ కంపెనీ టాబ్రెక్టా పేరుతో ఈ టాబ్లెట్లను అమెరికా, భారత్‌తో సహా అనేక దేశాల్లో మార్కెట్ చేస్తోంది. డోసేజిని బట్టి 56 టాబ్లెట్లతో కూడిన బాక్స్ ధర ప్రస్తుతం భారత్‌లో రూ.17,000 నుంచి రూ.33,000 వరకు ఉంది. కంపెనీ ఫైల్ చేసిన అండా దరఖాస్తుని ఎఫ్‌డీఏ ఆమోదించిన వెంటనే నాట్కో ఫార్మా ఈ టాబ్లెట్లను జనరిక్ వెర్షన్‌లో చౌకగా మార్కెట్‌లో విడుదల చేయనుంది.

కరడు గట్టిన స్మగ్లర్‌కు కాషాయ తీర్థం!?

● గంగిరెడ్డి చేరికకు బీజేపీ పచ్చజెండా
● టీడీపీ నేతల అభ్యంతరాలతో వాయిదా
● అలిపిరిలో చంద్రబాబు హత్యకు యత్నించినవారికి ఆశ్రయమిచ్చారని గంగిరెడ్డిపై ఆరోపణలు



అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పేరుమోసిన స్మగ్లర్, ముఖ్యమంత్రి చంద్రబాబును చంపేందుకు ప్రయత్నించిన నక్సల్స్‌కు ఆశ్రయమిచ్చాడని ఆరోపణలు ఎదుర్కొన్న కొల్లం గంగిరెడ్డిని బీజేపీలో చేర్చుకోవాలన్న నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. గురువారం ఆయన్ను పార్టీలోకి చేర్చుకోవడానికి ఘనంగా ఏర్పాట్లు కూడా చేశారు. అయితే టీడీపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని దీనిపై నిలదీయడంతో వాయిదా కార్యక్రమాన్ని వాయిదావేశారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన ఈయన.. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుచరుడిగా కాంగ్రెస్‌లో ఎదిగి.. ఎర్రచందనం స్మగ్లింగ్‌తో ఆర్థికంగా బలపడ్డాడు. 2003 అక్టోబరులో అలిపిరి వద్ద చంద్రబాబును చంపేందుకు క్లైమోర్‌మైన్స్ పేల్చిన మావోయిస్టులకు ఈయన ఆశ్రయం కల్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో కింది కోర్టు శిక్ష విధించినా.. హైకోర్టు కొట్టివేయడంతో బయటపడ్డాడు. తర్వాత వైఎస్ ముఖ్యమంత్రి కావడంతో చెలరేగిపోయి శేషాచలం సంపదను కొల్లగొట్టాడు. 2014లో చంద్రబాబు నవ్యాంధ్ర సీఎం కాగానే దేశం వదిలి పారిపోయాడు. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు, అప్పటి తిరుపతి ఎస్పీ గోపీనాథ్ జెట్టి ఎంతో ప్రయాసపడి విదేశాల్లో తలదాచుకున్న గంగిరెడ్డిని రాష్ట్రానికి తీసుకొచ్చి జైలుకు పంపారు. 2019లో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం రాగానే జైలు నుంచి బయటకు వచ్చి ఆ పార్టీలో చేరాడు. కడప, తిరుపతి, చెన్నైలో భూ కబ్జాలు చేస్తూ.. సెటిల్మెంట్లు మొదలు పెట్టాడు. ఇదే సమయంలో పాత ఆదాయ వనరైన ఎర్రచందనం స్మగ్లింగ్ కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం దరిమిలా.. ఆ పార్టీలో కొనసాగితే చంద్రబాబు ప్రభుత్వం తనపై ఉక్కుపాదం మోపుతుందని గ్రహించిన గంగిరెడ్డి.. బీజేపీలో చేరడానికి ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఒక బీజేపీ నాయకుడి ద్వారా ఓ రాష్ట్ర స్థాయి నేతతో మంతనాలు నెరపినట్లు అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. ఏడాది క్రితం వరకూ రాష్ట్రంలో హవా కొనసాగించిన ఆ నేత.. గంగిరెడ్డిని పార్టీలో చేర్చుకుంటే తప్పేంటని బీజేపీ పెద్దల వద్ద వాదించినట్లు తెలిసింది. ఇది తెలియడంతో కడప జిల్లాకు చెందిన కొందరు టీడీపీ నేతలు బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి ఫోన్లు చేసి అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో వివరాలు పరిశీలించుకున్న బీజేపీ నేతలు తాత్కాలికంగా గంగిరెడ్డి చేరికను వాయిదా వేశారు. అయితే ఆయన బీజేపీలో ఎవరిని సంప్రదించారు.. చేరిక వెనుక రహస్య ఒప్పందం ఏమిటనే దానిపై రాష్ట్ర నిఘా వర్గాలు కూపీ లాగుతున్నాయి. దీనిపై పక్కా ఆధారాలతో బీజేపీ జాతీయ నాయకత్వానికి నివేదిక పంపే యోచనలో రాష్ట్రప్రభుత్వం ఉంది. అటవీ సంపదను దోచేస్తున్న వ్యక్తుల పట్ల కఠినంగా ఉండాలని ఆ శాఖ నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ఎంపీల చేరికపై సమాచారం లేదు

● కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: పురందేశ్వరి

అమరావతి-ఆంధ్రజ్యోతి/గుంటూరు (తూర్పు), ఆగస్టు 29: వైసీపీ ఎంపీలు బీజేపీలో చేరే విషయమై తమకు సమాచారం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. తమ పార్టీ సిద్ధాంతాలను అంగీకరిస్తేనే ఎవరినైనా చేర్చుకుంటామని.. వైసీపీ నుంచి వచ్చే ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల చేరిక విషయంలో ఇదే విధానాన్ని పాటిస్తామని చెప్పారు. గురువారం గుంటూరులో జరిగిన బీజేపీ కిసాన్, ఎస్సీ మోర్చా సమావేశాల్లో ఆమె మాట్లాడారు. 'వికసిత్ ఆంధ్రప్రదేశ్' లక్ష్యంతో ముందుకెళ్తున్న కూటమి ప్రభుత్వంపై కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ కుట్రలను తిప్పికొట్టి గత వైసీపీ ప్రభుత్వ అధ్వాన పాలన వల్ల రాష్ట్రం ఎంత నష్టపోయిందో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలు భరించలేని ప్రజలు.. తమ కూటమిని గెలిపిస్తే జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్రం స్పష్టం చేయడం శుభపరిణామమన్నారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ సెప్టెంబరు 2న ప్రారంభమై అక్టోబరు 31తో ముగుస్తుందన్నారు. ఆ తర్వాత పార్టీ సంస్థాగత పదవుల నియామకం చేపడతామన్నారు.

గేట్లు తీస్తే వైసీపీ వాళ్లంతా వచ్చేస్తారు

● అక్రమాలకు పాల్పడిన వారిని పార్టీలోకి రానిచ్చేది లేదు: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 29: రాష్ట్రంలో వైసీపీ సీనియర్ నేతలు ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నారని తాము గేట్లు తీస్తే వరద గోదావరిలా వచ్చే పరిస్థితి ఉందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికి జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారంతోనే బతుకుతున్నారన్నారు. అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన వీరు ఇప్పుడు పార్టీలు మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిని పార్టీలోకి రానిచ్చే పరిస్థితి లేదన్నారు. తమ నాయకుడు చంద్రబాబు ఢిల్లీ చుట్టూ తిరగటం వల్ల రాష్ట్రానికి మేలు జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఇసుక కొరతను తీర్చడం కోసం బోట్స్‌మెన్ సొసైటీలకు ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వాలన్నారు.

ఇద్దరు వైసీపీ ఎంపీలు అవుట్!

● రాజ్యసభకు మోపిదేవి, మస్తాన్‌రావు గుడ్‌బై
● చైర్మన్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామాల సమర్పణ
● తక్షణమే ఆమోదించిన ఉపరాష్ట్రపతి



రాజీనామాలు సమర్పిస్తున్న మస్తాన్‌రావు, మోపిదేవి

న్యూఢిల్లీ/బాపట్ల/నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం నుంచి ఇప్పటికీ కోలుకోని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామా లేఖలు అందజేశారు. ఆయన అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. మనస్సాక్షిగానే ఎంపీ పదవులకు రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. వారి రాజీనామాలను ధన్‌ఖడ్ తక్షణమే ఆమోదించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 101(3)(బీ), రాజ్యసభ రూల్స్ ఆఫ్ ప్రొసీజర్ అండ్ కండక్ట్ బిజినెస్ రూల్ 213 ప్రకారం మోపిదేవి, బీద మస్తాన్‌రావు రాజీనామాలను ఆమోదించినట్లు ప్రకటించారు. ఖాళీ అయిన రాజ్యసభ స్థానాల ఉప ఎన్నికకు 10 రోజుల్లో ఎన్నికల కమిషన్ ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇంకోవైపు.. రాజీనామాలు సమర్పించాక మోపిదేవి, మస్తాన్‌రావు మీడియాతో మాట్లాడారు. స్వచ్ఛందంగానే ఎంపీ పదవులకు రాజీనామా చేశామని, వెనుక ఎవరి ప్రలోభాలూ లేవని స్పష్టంచేశారు. వైసీపీ అధినేత జగన్ తనకు 100శాతం సహకరించారని.. అయితే కొన్ని సందర్భాలు, అంశాల్లో ఆయనతో విభేదాలు వచ్చాయని, అందువల్లే పార్టీ మారాలనే నిర్ణయానికి వచ్చానని మోపిదేవి చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను పరిగణనలోకి తీసుకోకుండా స్థాయి లేని వ్యక్తికి టికెట్ ఇచ్చారని, అప్పుడే పార్టీ మారాలని అనుకున్నానని తెలిపారు. రేపల్లె ప్రజలకు అందుబాటులో ఉండడం తనకిష్టమన్నారు. 'గౌరవ మర్యాదలు, పరువు ప్రతిష్ఠల గురించి ఎవరి వద్దో నేర్చుకోవలసిన అవసరం నాకు లేదు. గడచిన 40 ఏళ్లలో గౌరవప్రదంగా ప్రజల్లోనే ఉండి రాజకీయాలు చేశాను. నేను టీడీపీలో చేరుతున్నాను. ఇందులో దాపరికమేమీ లేదు. రాజకీయాల్లో ఉన్నప్పుడు పార్టీలు మారడం సహజం. అసెంబ్లీ ఎన్నికల్లో నాకు కాకుండా మరొకరికి టికెట్ ఇచ్చినప్పుడు వైసీపీ కేడర్ వ్యతిరేకత వ్యక్తం చేసింది. అప్పుడు రాజీనామా చేస్తే పార్టీకి ద్రోహం చేసినట్లు అవుతుందని వారికి నచ్చజెప్పాను. అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలు సమర్థంగా నిర్వహించాను. ఇప్పుడు అధికారం లేనందున పార్టీ మారడం లేదు. రాజీనామా ఇంతకు ముందే తీసుకున్న నిర్ణయం' అని తెలిపారు. ఆయన రాజ్యసభ సభ్యత్వం 2026 జూన్ 21 వరకు ఉన్నా వదులుకోవడం గమనార్హం.

నాలుగేళ్ల పదవీకాలం ఉన్నా

తనకు నాలుగేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేశామని బీద మస్తాన్‌రావు చెప్పారు. జాతీయ రాజకీయాలంటే తనకు ఆసక్తి అని, అవకాశం ఉంటే మళ్లీ రాజ్యసభకు వస్తానని తెలిపారు. టీడీపీలో చేరికపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 32ఏళ్లు టీడీపీలో ఉన్నానని.. అప్పుడు చంద్రబాబు తన బాస్‌గా ఉండేవారని చెప్పారు. తనకు అవకాశం, గౌరవం ఇచ్చిన జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబసభ్యులు, సన్నిహితులు, బంధువులతో చర్చించి తదుపరి కార్యచరణపై నిర్ణయం తీసుకుంటానన్నారు. వైసీపీ నాయకత్వం తనను ఆదరించినా ఆ పార్టీ జిల్లా నాయకత్వం నుంచి ఎదురవుతున్న అవమానాలను తట్టుకోలేక ఆయన వైసీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆయన్ను బీజేపీలోకి తీసుకునేందుకు తమిళనాడుకు చెందిన ఆ పార్టీ నాయకులు, రాజ్యసభలోని ఆయన మిత్రులు విశ్వప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో టీడీపీ లోక్‌సభ ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (నెల్లూరు), మాగుంట శ్రీనివాసులురెడ్డి (ఒంగోలు) ఆయన్ను తమ పార్టీలోకి ఆహ్వానించారు. ప్రముఖ వ్యాపారవేత్తగా స్థిరపడిన మస్తాన్‌రావు.. రెండున్నర దశాబ్దాల క్రితం టీడీపీ ద్వారానే రాజకీయ అరంగేట్రం చేశారు. 2009లో కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ స్థానంలో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ప్రత్యేక పరిస్థితుల్లో వైసీపీలోకి వెళ్లారు. అక్కడ రాజకీయంగా అవమానాలను ఎదుర్కోవలసి వచ్చింది. వైసీపీ కావలి నాయకులు, జిల్లా నాయకులు ఆయన్ను తమలో ఒకరిగా గుర్తించలేదు. ఎంపీగా ఉన్నా చిన్నచూపే చూశారు. సీఎం హోదాలో జగన్ జిల్లాకు వచ్చిన సందర్భాల్లో మస్తాన్‌రావుకు వేదికపైకి ఎక్కే అవకాశమే దొరక్క పలు సార్లు వెనక్కి వెళ్లిపోయారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఆయన తనకు వెన్నుపోటు పొడిచారని కావలి వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మస్తాన్‌రావు నాటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన అసంతృప్తిని గమనించిన వేమిరెడ్డి తమ అధినేత, సీఎం చంద్రబాబుకు విషయం తెలియజేశారు. వైసీపీని, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకునే పక్షంలో ఆయన్ను టీడీపీలోకి తిరిగి తెచ్చుకోవాలని ఆ పార్టీ అగ్రనేతలు నిర్ణయించుకున్నారు. ఈ విషయమై చర్చించడానికి అమరావతికి రావాలని ఆయన తమ్ముడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌కు అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఆయన గురువారం ఉదయం హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఒకట్రెండు రోజుల్లో మస్తాన్‌రావు కీలక ప్రకటన చేసే అవకాశముంది.

ఇప్పటికైతే రాజీనామా లేదు

సరైన సమయంలో చెబుతా: గొల్ల బాబురావు

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఎంపీ గొల్ల బాబురావు స్పందించారు. సరైన సమయంలో తన నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారు. ఢిల్లీలోనే ఉన్న ఆయన్ను గురువారం మీడియా ప్రతినిధులు రాజీనామాపై ప్రశ్నించగా.. వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. ఇప్పటికైతే అలాంటిదేమీ లేదని, సరైన సమయంలో చెప్తానని తెలిపారు. సరైన సమయం ఎప్పుడని అడుగగా.. ఆయన నవ్వుతూ కారెక్కి వెళ్లిపోయారు.

కవిత బెయిలుపై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు!

● తెలంగాణ సీఎంపై సుప్రీంకోర్టు సీరియస్

న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ మద్యం కేసులో కవితకు బెయిల్ ఇవ్వడంపై బుధవారం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి స్థాయి రాజ్యాంగ హోదాలో ఉన్న వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలు కాదని అభిప్రాయపడింది. ఆయన న్యాయస్థానానికి ఉద్దేశాలను ఆపాదించినట్లు వ్యాఖ్యానించారని చెప్పింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం మధ్యాహ్నం వాదనల సందర్భంగా ధర్మాసనం కవితకు బెయిల్ ఇవ్వడంపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించింది. 'తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం బీఆర్ఎస్ పనిచేసిందని, బీఆర్ఎస్, బీజేపీల మధ్య కుదిరిన ఈ ఒప్పందం వల్లే కవితకు బెయిల్ వచ్చిందని సీఎం కామెంట్ చేశారు' అని కవిత తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. సీఎం రేవంత్‌రెడ్డిని తీవ్రంగా మందలించింది. రాజకీయ నాయకులను సంప్రదించి మేము తీర్పులు ఇస్తున్నామా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇది ఒక సీఎం హోదాలో ఉన్న బాధ్యత గల వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలా? సంస్థల పట్ల పరస్పర గౌరవం ఉండాలని ప్రాథమిక కర్తవ్యం చెప్పలేదా? గౌరవం కలిగి ఉండాలి' అని వ్యాఖ్యానించింది. కాగా... ప్రభుత్వం తరపున రోహత్గీ జోక్యం చేసుకుని ముఖ్యమంత్రి తరపున తాను క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. అంతలోనే.. మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ముఖ్యమంత్రికి కౌన్సిలింగ్ ఇస్తామని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ క్రమంలో పిటిషనర్ తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ... సుప్రీంకోర్టు గురించి ముఖ్యమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నపుడు హైకోర్టు, దిగువ కోర్టుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని సూచించారు.

4 రోజులు పాస్‌పోర్ట్ పోర్టల్ పని చేయదు!

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక నిర్వహణ కారణంగా పాస్‌పోర్ట్ పోర్టల్ నాలుగు రోజులు పనిచేయదని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం తెలిపింది. గురువారం (ఆగస్టు 29) రాత్రి 8 గంటల నుంచి సోమవారం (సెప్టెంబరు 2) ఉదయం 6 గంటల వరకు అన్ని రకాల సేవలు నిలిచిపోతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 30న అన్ని రకాల పాస్‌పోర్టు కార్యాలయాల్లోని అపాయింట్‌మెంట్లు రద్దవుతాయని తెలిపింది. అయితే ఈ అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ అవుతాయని, ఆ వివరాలు ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని పేర్కొంది. సందేహాలుంటే rpo.hyderabad@mea.gov.in మెయిల్ ద్వారా తమను సంప్రదించవచ్చని గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

కాకినాడ డీసీ విజయరాజు బదిలీ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజును దేవదాయ శాఖ బదిలీ చేసింది. వెంటనే అక్కడ నుంచి రిలీవ్ అయి ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. రాజమండ్రిలో ఉన్న దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌కు కాకినాడ డీసీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాకినాడ డీసీ ఎం.విజయరాజుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఆయనను వెంటనే బదిలీ చేయాలని నిర్ణయించింది.

3న లండన్‌కు జగన్ దంపతులు

25వ తేదీదాకా అక్కడే

● కమ్ముకొస్తున్న కేసులు.. జారిపోతున్న ఎంపీలు
● కీలక సమయంలో మాజీ సీఎం విదేశాలకు



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పార్టీ ఎంపీలు, నేతలు గుడ్‌బై చెబుతున్న తరుణంలో వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ వచ్చే నెల 3న సతీసమేతంగా లండన్ బయల్దేరుతున్నారు. కుమార్తె పుట్టినరోజు వేడుకల కోసం 25 దాకా అక్కడ పర్యటించేందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు ఇటీవల ఆయనకు అనుమతి ఇచ్చింది. అక్రమాస్తుల కేసులు ఒకవైపు.. ముఖ్యమంత్రిగా పాలనా సమయంలో తీసుకున్న అనుచిత నిర్ణయాలపై విచారణలు ఇంకోవైపు.. పార్టీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు రాజీనామా చేసి టీడీపీలోకి వెళ్లేందుకు సమాయత్తం కావడం, పార్టీకి ఉన్న 11 మంది రాజ్యసభ సభ్యుల్లో నలుగురు తప్ప మిగతావారు పక్కచూపులు చూస్తున్నారన్న ప్రచారంతో భవిష్యత్‌పై వైసీపీ శ్రేణులు కలవరపడుతున్నాయి. ఈ తరుణంలో ఆయన విదేశీ పర్యటన వారిని ఇరకాటంలో పడేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం తర్వాత జగన్ వ్యవహార శైలి వారికి అంతుపట్టడం లేదు. తాడేపల్లిలో కేంద్ర కార్యాలయాన్ని తన ప్యాలెస్‌కు మార్చడం.. తరచూ బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్లడం.. ప్రజాతీర్పును గౌరవించకుండా మాట్లాడడం.. కొత్త ప్రభుత్వం కుదురుకోకముందే శాంతిభద్రతల వైఫల్యమంటూ ఢిల్లీలో ధర్నా చేయడం.. పరస్పర దాడుల్లో సొంత పార్టీ కార్యకర్త చనిపోతే టీడీపీపై రుద్దే ప్రయత్నం చేయడం..శవాల కోసం జగన్ వెతుకుతున్నాడంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం.. మీడియా సమావేశాల్లో విలేకరుల ప్రశ్నలకు జవాబులివ్వకుండా వెళ్లిపోవడం మొదలైనవి విమర్శలకు తావిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ 11 స్థానాలే గెలుచుకుంది. అయినా ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు దిగుతూ ఏకంగా స్పీకర్‌కే లేఖ రాయడం.. ఆ హోదా రాదని తెలిసీ హైకోర్టును ఆశ్రయించడం.. సీఎంగా ఉన్నప్పటి భద్రతను ఇవ్వాలంటూ పిటిషన్ వేయడం.. ఇలాంటివాటి వెనుక జగన్ వ్యూహమేంటో వైసీపీ నేతలకు అంతుపట్టడం లేదు. ఆయన తీరు చూసి రాజకీయ ప్రత్యర్థులు నవ్వుకుంటున్నారు. ఇది వైసీపీ శ్రేణులకు ఇబ్బందికరంగా పరిణమించింది. దీంతో చాలామంది ముఖ్య నేతలు తాడేపల్లి ప్యాలెస్ వైపే రావడం లేదు. జగన్ కోటరీలో అతిముఖ్యులుగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటివారు కూడా అటువైపు చూడడం లేదు.

ఎన్డీయేకి ఇక వైసీపీ మద్దతు అక్కర్లేదు..?

లోక్‌సభలో తమకు నలుగురు ఎంపీలే ఉన్నా రాజ్యసభలో 11మంది ఉన్నారని.. మోదీ ప్రభుత్వం ముఖ్యమైన బిల్లుల కోసం తనపై ఆధారపడక తప్పదని జగన్ ఇన్నాళ్లూ ధీమాతో ఉన్నారు. ఇప్పుడు వీరిలో మోపిదేవి, మస్తాన్‌రావు రాజీనామా చేసి, టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. వారి బాటలోనే ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య, గొల్ల బాబూరావు నడవబోతున్నారని.. వారు కూటమి పార్టీలవైపు చూస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఇక రాజ్యసభలో ఆ పార్టీకి మిగిలేది వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, నిరంజన్ రెడ్డి, పరిమళ్ నత్వానీ మాత్రమేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇదే జరిగితే సభలో వైసీపీ పాత్ర నామమాత్రం కానుంది. కీలకమైన బిల్లుల ఆమోదానికి ఆ పార్టీపై ఆధారపడాల్సిన అవసరం ఎన్డీయేకి ఉండకపోవచ్చని అంటున్నారు. మరోవైపు జగన్ పాలనలో జరిగిన అవినీతిపై చంద్రబాబు సర్కారు కొరడా ఝళిపిస్తోంది. మద్యం, గనులు, ఇసుక వ్యవహారాల్లో ఆయన అడ్డగోలు దోపిడీ, అక్రమాలకు సహకరించిన ఉన్నతాధికారులు, ఐపీఎస్‌లపైనా కేసులు పడుతున్నాయి. ముంబై నటి వ్యవహారంపై సమగ్ర విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇలా కేసులు తరుముకొస్తుండడం.. పార్టీని నైరాశ్యం ఆవరించిన తరుణంలో జగన్ దంపతుల లండన్ ప్రయాణం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

జీవోఐఆర్ పునరుద్ధరణ

● ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఉత్తర్వులు
● తొలిరోజు వివిధ శాఖల జీవోలు 37 విడుదల
● గత వైసీపీ ప్రభుత్వంలో ఉత్తర్వులు దాచివేత

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం జీవోఐఆర్‌ను పునరుద్ధరించింది. దాదాపు మూడేళ్ల తర్వాత ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. జీవోఐఆర్‌ను పునరుద్ధరిస్తున్నట్లు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం నుంచే ప్రభుత్వ ఉత్తర్వులు మొత్తం జీవోఐఆర్‌లో అప్‌లోడ్ చేసింది. తొలిరోజు దాదాపు 37 జీవోలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచింది. వివిధ శాఖలకు చెందిన ఈ 37 జీవోలను నేరుగా ప్రజలు చూసుకోవచ్చు. గత ప్రభుత్వం ఉత్తర్వులను బయటకు రానివ్వకుండా దాచిపెట్టింది. జీవో దాచిపెడితే ప్రభుత్వ పాలనను దాచిపెట్టినట్లే. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగించి ప్రభుత్వ ఆదేశాలను దాచిపెట్టింది. దీనిపై చాలా మంది కోర్టును ఆశ్రయించారు. కోర్టు ప్రభుత్వానికి మొట్టికాయలు వేసి ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జీవోఐఆర్‌ను పునరుద్ధరించలేదు. కానీ ఏపీ గెజిట్‌లో కొన్ని ఉత్తర్వులు మాత్రమే అప్‌లోడ్ చేసేది. దీనివల్ల ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేస్తుందో ప్రజలకు ఏ మాత్రం తెలిసేది కాదు. కూటమి ప్రభుత్వం రావడంతో పరిస్థితి మారింది. ప్రభుత్వం విడుదల చేసే ఉత్తర్వులు ప్రజలందరికి అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో జీవోఐఆర్‌ను పునరుద్ధరించి, అన్ని ఉత్తర్వులను ఆ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తోంది.



జగన్ పత్రికపై వేసిన పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్

భూఆక్రమణలపై విచారణ

దోషులపై చర్యలు తీసుకుంటాం.. సీబీఎస్ఈ సిలబస్‌పై సమీక్షిస్తాం: లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో భారీగా భూ కుంభకోణాలు జరిగాయని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. జగన్ పత్రికపై వేసిన కేసులో విచారణ నిమిత్తం గురువారం ఆయన విశాఖపట్నం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. భూఆక్రమణలకు సంబంధించి రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నివేదిక సిద్ధం చేశారని, దీనిపై వచ్చే కేబినెట్‌లో చర్చించి అక్రమాలకు బాధ్యులైన అందరిపై చర్యలు తీసుకుంటామన్నారు. తప్పు చేసిన అధికారుల వివరాలను రెడ్‌బుక్‌లో రాశానని... వారిపై చర్యలు ఉంటాయని వివరించారు. గత ప్రభుత్వం వెయ్యి బడుల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేసిందని, అందుకు తగినవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దలేకపోయిందన్నారు. దీనివల్ల ఇటీవల అసెస్‌మెంట్ పరీక్షలలో 65 శాతం మంది ఫెయిల్ అయ్యారన్నారు. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ సిలబస్ కొనసాగింపు, సంబంధిత బోర్డు పరీక్షలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పాఠశాలల్లో వసతుల కల్పన కోసం 'మన బడి-మన భవిష్యత్తు' కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. వైసీపీ పాలకుల నిర్వాకంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 లక్షల నుంచి 35 లక్షలకు పడిపోయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను గాడిలో పెట్టేలా రోడ్‌మ్యాప్ అమలుచేస్తామన్నారు. రాష్ట్రానికి ఐటీ కంపెనీలు తీసుకువస్తామని, విశాఖను ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ముంబైకు చెందిన సినీనటిని 18 రోజులు బంధించి, వేధింపులకు పాల్పడ్డారనే విషయం ఆమె ఆవేదన చూస్తే అర్థమవుతుందన్నారు. వాటిలో అధికారుల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తోందని, అన్నింటిపై విచారణ జరగాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఆదుకుంటామని లోకేశ్ చెప్పారు. కాగా, మంత్రి లోకేశ్ గురువారం విశాఖ నగరంలోని 12వ అదనపు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. మంత్రిగా ఉన్నప్పుడు తనను ఉద్దేశించి కథనం ప్రచురించిన జగన్ పత్రికపై గతంలో ఆయన పరువు నష్టం దావా వేశారు. ఆ కేసు వాయిదాకు హాజరయ్యారు. ప్రతివాది తరపున న్యాయవాది మహ్మద్ హబీబుల్లా కోర్టులో లోకేశ్‌ను పలు ప్రశ్నలు అడిగారు. న్యాయమూర్తి కేసును అక్టోబరు 18కి వాయిదా వేశారు.

అన్నీ సొంత సొమ్ముతోనే..!

ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు ప్రజాధనం దుర్వినియోగం చేయవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని మా నాయకుడు చంద్రబాబు చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు అప్పుడు, ఇప్పుడు కూడా నా పర్యటన సందర్భంగా టీ, మంచినీటి బాటిల్‌కు సొంత సొమ్ము వినియోగిస్తున్నా. కారు డీజిల్ కూడా సొంత సొమ్ముతోనే కొట్టించా. మంత్రిగా హోటల్‌లో కాకుండా సొంత బస్సులో ఉన్నా. మాజీ సీఎం జగన్ మాదిరిగా ప్రజాధనం లూటీ చేయడం మాకు రాదు. అందుకు మేం వ్యతిరేకం.

\- లోకేశ్

రాజధానిలో ఎస్ఐఆర్‌డీ.. పదెకరాలకు ప్రతిపాదన

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమరావతిలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఐఆర్‌డీ) ఏర్పాటుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు ప్రారంభించింది. ఎస్ఐఆర్‌డీ నిర్వహించిన ఓ జాతీయస్థాయి శిక్షణా కార్యక్రమానికి గురువారం హాజరైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్‌కు తెలిపారు. ఎస్ఐఆర్‌డీను 10ఎకరాల్లో రూ.250 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వాటిని కేంద్రానికి పంపుతామని పేర్కొన్నారు. కాగా, పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణనిచ్చే సంస్థ గ్రామ, వార్డ్ శాఖలో ఉండటం సరికాదని, దాన్ని పంచాయతీరాజ్‌శాఖలో విలీనం చేయాలని అధికారులు సీఎంకు ప్రతిపాదనలు పంపారు. దీంతో సీఎం స్పందించి వెంటనే పంచాయతీరాజ్‌శాఖలో విలీనం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. దీనిపై సత్వరమే చర్యలు చేపడతామని శశిభూషణ్‌కుమార్ తెలిపారు.

అయినా భోజనం నాసిగానే...

» ట్రిపుల్ ఐటీలో మారని పరిస్థితి
» మంత్రి పార్థసారథి హెచ్చరికలు బేఖాతరు
» ఉడికీ ఉడకని ఉప్మా, సగం ఉడికిన గుడ్లు
» తినలేక వదిలేసిన విద్యార్థులు
» జనసేన, విద్యార్థి సంఘాల నేతల అసంతృప్తి
» తగ్గని జ్వరాలు.. మరో 80 మంది ఆసుపత్రికి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ జేడీ మల్లీశ్వరి

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 29: విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవంటూ సాక్షాత్తు మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించినా ట్రిపుల్ ఐటీ అధికారుల, మెస్ నిర్వాహకుల తీరు మారలేదు. ఆయన హెచ్చరికలు బేఖాతరు చేస్తూ గురువారం విద్యార్థులకు నాసిరకం భోజనం అందించారు. ఉదయం అల్పాహారంలో ఉడికీ ఉడకని ఉప్మా, ఉడకని కోడిగుడ్లు అందించారని విద్యార్థులు వాపోయారు. అవి తినలేక పలువురు అర్థాకలిలో మాడారు. విద్యార్థులు జ్వరాల బారినపడ్డారని, నాసిరకం ఆహారంతో ఇబ్బందులు పడుతున్నారన్న సమాచరంతో బుధవారం రాత్రి 9నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు ట్రిపుల్ ఐటీలో పరిస్థితులను మంత్రి పార్థసారథి స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని రుచి చూసిన ఆయన మెస్ నిర్వాహకులను, అధికారులను తీవ్రంగా మందలించారు. దీంతో పరిస్థితి చక్కబడుతుందని ఆశించారు. మంత్రి మందలింపులు ఏమాత్రం చెవికెక్కించుకోని మెస్ నిర్వాహకులు గురువారం సైతం నాసిరకం ఆహార పదార్థాలను అందించారు. మధ్యాహ్నం భోజన వేళ స్థానిక జనసేన నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ట్రిపుల్ ఐటీ మెస్‌లకు వెళ్లి విద్యార్థులతో కలసి భోజనం చేసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

జేడీ విచారణ

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని పరిస్థితులపై వైద్య ఆరోగ్యశాఖ జేడీ ఎస్.మల్లీశ్వరి గురువారం క్యాంపస్‌లో విచారించారు. మంత్రులు లోకేశ్, పార్థసారథి నివేదిక ఇవ్వాలని వైద్య, ఆరోగ్యశాఖను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే క్యాంపస్‌కు వచ్చిన మల్లీశ్వరి... అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ట్రిపుల్ ఐటీలోని మెస్‌లు, క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. మెస్‌ల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, భోజన నాణ్యత సరిగా లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందించనున్నట్లు ఆమె తెలిపారు. ట్రిపుల్ ఐటీని మహిళా కమిషన్ గౌరవ సభ్యులు వి.వినీత, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర, సీడీపీవో వైనూరాని సందర్శించి ట్రిపుల్ ఐటీ అధికారులతో చర్చించారు.

తగ్గని జ్వరాల తీవ్రత

ట్రిపుల్ ఐటీలో విష జ్వరాల బాధితులు గురువారం క్యూ కట్టారు. క్యాంపస్‌లోని వైద్యశాలలో దాదాపు 80మంది వైద్యం చేయించుకున్నారు. బుధవారం సాయంత్రం జ్వరాల బారినపడిన కొందరు విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలి వెళ్లారు. ఇప్పటివరకు అనారోగ్యం పాలైన వారి సంఖ్య వెయ్యి వరకు ఉండవచ్చని తెలిసింది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల్లో భోజన నాణ్యత ప్రమాణాలపై దాదాపు పదేళ్లుగా వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఏటా ఏదో ఒక సందర్భంలో విద్యార్థులు భోజన నాణ్యతపై రహదారిపై బైఠాయించటం, జిల్లా అధికారులు హుటాహుటిన క్యాంపస్‌కు చేరి వారికి సర్ది చెప్పటం సాధారణమయ్యింది.

ఫుడ్ కోర్టును ఆశ్రయించాల్సి వస్తోంది

బుధవారం రాత్రి విద్యార్థులు మంత్రి పార్థసారథికి ఫిర్యాదుచేస్తూ... 'క్యాంపస్‌లోని మెస్‌ల యాజమాన్యాలు, ఫుడ్ కోర్ట్ యాజమాన్యం మధ్య అవినాభావ సంబంధం ఉంది. అందువల్లే మెస్సుల్లో ఆహార నాణ్యత నాసిరకంగా ఉంటోందనే అనుమానం ఉంది. హాస్టల్ భోజనం నాణ్యత లేకపోవడంతో మేం ఫుడ్ కోర్టును ఆశ్రయిస్తున్నాం. దీంతో తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టాల్సి వస్తోంది. వేలకు వేలు ఖర్చు పెడుతున్నాం' అంటూ పరిస్థితిని వివరించి చెప్పారు.



గురువారం విద్యార్థులకు అందించిన నాసిరకమైన గుడ్లు

సమగ్ర విచారణ నిర్వహించాలి

10వ తరగతి విద్యార్హతతో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు తమ విద్యా బోధనను అర్ధంతరంగా ముగిస్తున్న సందర్భాలు ట్రిపుల్ ఐటీల్లో ఉన్నాయి. ప్రపంచస్థాయి సాంకేతిక విద్య అని చెబుతున్నా విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలలోనే ఆర్జీయూకేటీని వదిలి వెళుతున్నారు. అయినా ఇక్కడ నెలకొన్న లోపాలు ఏమిటనే అంశంపై ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసి 16 సంవత్సరాలు అయినా దృష్టి పెట్టకపోవడం శోచనీయం. ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ట్రిపుల్ ఐటీల్లో నెలకొన్న పరిస్థితులపై సీనియర్ ఐఏఎస్ అధికారితో సమగ్ర విచారణ చేయిస్తే విస్తుపోయే వాస్తవాలు వెల్లడవుతాయి. తద్వారా ట్రిపుల్ ఐటీలను సంస్కరించి ఆర్జీయూకేటీ ఉన్నత లక్ష్యాలను కాపాడవచ్చు.

నటితో సెటిల్‌మెంట్ కోసం ఐఏఎస్!

- పలుమార్లు ముంబై వెళ్లిన అధికారి
- సజ్జన్ జిందాల్‌పై కేసు వాపస్‌పై చర్చలు
- ససేమిరా అనడంతో ఆమెపై ఇక్కడ కేసు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఇదో కొత్త కోణం. ఇప్పటిదాకా వైసీపీ ఐపీఎస్‌ల నిర్వాకం మాత్రమే బయటపడగా... ఒక సీనియర్ ఐఏఎస్ కూడా ఇందులో కీలక పాత్ర పోషించినట్లు తాజాగా తేలింది. తెరపైన ఐపీఎస్‌లు కేసు కథ నడిపించగా... తెరవెనుక మొత్తం వ్యవహారం నడిపింది ఈ ఐఏఎస్ అధికారే అని స్పష్టమైంది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక హోదాను తీసుకొచ్చే సమావేశాలకు డుమ్మాకొట్టిన ఈ అధికారి... గత ఐదేళ్లు జగన్, వైసీపీ నేతల సేవలో తరించిపోయారు. సజ్జన్ జిందాల్‌పై కాదంబరి పెట్టిన కేసు వాపస్ తీసుకునేందుకు ముంబై కేంద్రంగా మంత్రాంగం నడిపారు. దీనికోసం ముంబైలోని అధికార వర్గాల్లో తనకున్న పరిచయాలు, సినిమా లింకులను ఉపయోగించారు. దీనికోసం ఆయన పలుమార్లు ముంబైకి వెళ్లారు. ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కారు రెండు కీలకమైన టెండర్లు నిర్వహించింది. ఓబుళాపురం, ప్రకాశం జిల్లా మర్లపాడు ఐరన్‌ఓర్ మైనింగ్ ప్రాజెక్టులకు బిడ్డర్‌ను ఎంపిక చేసింది. ఈ రెండూ జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ)కంపెనీకే దక్కాయి. విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ టెండరు ఖరారైన తర్వాత జేఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్ పలుమార్లు ఏపీకి వచ్చి జగన్‌ను కలిశారు. ఆ తర్వాత గనులశాఖతో సంబంధం లేని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పలుమార్లు ముంబైకి వెళ్లి వచ్చారు. అది కూడా అధికారిక హోదాలోనే వెళ్లారు. కానీ.. ఆయన వెళ్లింది అధికారిక పనుల మీద కాదని, జగన్ సర్కారులోని పెద్దలు అప్పగించిన ఓ సెటిల్‌మెంట్ నిమిత్తం అని ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సజ్జన్ జిందాల్‌పై కాదంబరి పెట్టిన కేసును మూసివేయించడమే లక్ష్యంగా ఆయన అక్కడ పావులు కదిపినట్లు సమాచారం. అక్కడి ఉన్నతస్థాయి పోలీసు అధికారులను ప్రభావితం చేయగల పరిచయాలున్నాయి. దీంతో జగన్ ప్రభుత్వ పెద్దలు ఏరికోరి రేప్‌కేసు సెటిల్‌మెంట్‌ను ఈయనకు అప్పగించి ఉంటారని తెలిసింది. బాధితురాలు వ్యక్తిగత కారణాలతో రేప్ కేసును ఉపసంహరించుకునేలా చేయాలన్నది ఈ అధికారికి ఇచ్చిన టాస్క్. అయితే, ఈయన ప్రయత్నాలేవీ ఫలించలేదు. దీంతో ఆ నటిని దారికి తెచ్చుకునేందుకు బెదిరింపుల మార్గాన్ని ఎంచుకున్నారు. ఎపిసోడ్‌లో ఐపీఎస్‌లతోపాటు ఐఏఎస్ పాత్రపైనా విచారణ జరపాలనే డిమాండ్లు వస్తున్నాయి.

ఉచ్చు బిగుస్తోంది!



(మొదటి పేజీ తరువాయి)

కేసు పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో గురువారం విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేకాదు... ఆమె నేరుగా విజయవాడకు వచ్చేస్తున్నారు. గురువారం రాత్రి ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన కాదంబరి... శుక్రవారం విజయవాడ చేరుకోనున్నారు. ఇక్కడ ఆమె పోలీసులు ఆమె వాంగ్మూలం నమోదు చేస్తారు. అదే సమయంలో తనను వేధించిన ఏపీ ఐపీఎస్‌లపై ఆమె ఫిర్యాదు చేసే అవకాశముంది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు విచారణాధికారిగా విజయవాడ ఏసీపీ కె.స్రవంతి రాయ్‌ని నియమించింది. డీజీపీ ఆదేశాల మేరకు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

అడ్డగోలుగా అరెస్టు...

నటి కాదంబరిపై కుక్కల విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేయడం.. ఆ మరుసటి రోజునే ముంబైలో ఏపీ పోలీసులు ఆమెను అరెస్టు చేయడం జరిగింది. ఆ తర్వాత ఏపీలో తనను వేధించిన తీరుపై ఆగస్టు 1వ తేదీన ముంబై జుహూ పోలీసుస్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. "నన్ను, నా తల్లిదండ్రులను ఏపీ పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరి 3న అరెస్టు చేశారు. ఫిబ్రవరి 2న ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి, 24 గంటల్లోనే రోడ్డు మార్గాన విజయవాడ నుంచి ముంబై వచ్చి ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేశారు. ఆ సమయంలో మా లాయర్‌ను కానీ, బంధువులను కానీ సంప్రదించే అవకాశం కల్పించలేదు. విజయవాడ తీసుకెళ్లిన తర్వాత కూడా మాకు లాయర్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఇవ్వలేదు. మా అరెస్టు సమాచారాన్ని బంధువులకు తెలియజేశామని ఏపీ పోలీసులు చెప్పడం పెద్ద అబద్ధం. అలాగే... మా నివాసం నుంచి ఓ డాక్యుమెంట్‌ను రికవరీ చేశామని, దాని ఆధారంగానే అరెస్టు చేశామని చెబుతున్నారు. దానిని సృష్టించింది కూడా పోలీసులే. 2018లో అగ్రిమెంట్ చేసుకున్నట్లు ఆ డాక్యుమెంట్‌లో ఉంది. కానీ.. అందులోని చిరునామా మాత్రం 2020లో నేను జుహూలో కొనుగోలు చేసిన ఫ్లాట్‌ది. అంతేకాదు... ఆ డాక్యుమెంట్ పేపర్‌ను 2023లో కొన్నారు. అది ఫోర్జరీ అని చెప్పేందుకు ఇవే నిదర్శనాలు" అని ఆ ఫిర్యాదులో కాదంబరి పేర్కొన్నారు.

విజయవాడ సీపీకి ఫిర్యాదు

కాదంబరి జెత్వానీ గురువారం విజయవాడ కమిషనర్ రాజశేఖర్ బాబుకు ఆన్‌లైన్‌లో మరో ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తనపైన, తన తల్లిదండ్రులపైన నమోదు చేసిన తప్పుడు కేసుపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. విద్యాసాగర్ తమపై తప్పుడు ఫిర్యాదు చేయగా దాని ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. విద్యాసాగర్ రాజకీయంగా తనకున్న సంబంధాలను ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి తప్పుడు కేసు పెట్టారని తెలిపారు.

నాలుగైదు రోజుల్లో విచారణ పూర్తి!

"కాదంబరి జెత్వానీ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. ఇందులో ప్రధానంగా ఐపీఎస్ అధికారులపై ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఎంత వరకు వాస్తవం ఉందనే అంశంపై దృష్టి పెట్టాం. బాధితురాలితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుంటాం. చీటింగ్ కేసులో నటితోపాటు ఆమె కుటుంబం మొత్తాన్ని ఎందుకు అరెస్టు చేశారో తెలియాలి. అరెస్టు చేసిన సమయంలో ఎవరెవరి పాత్ర ఎంత వరకు ఉందో దర్యాప్తులో తేలుతుంది. నాలుగైదు రోజుల్లో ఈ విచారణ పూర్తి చేస్తాం. ఈ కేసులో సాంకేతిక ఆధారాలను కూడా సేకరిస్తాం. ఐపీఎస్‌ల పాత్ర ఉన్నట్లు తేలితే డీజీపీ చర్యలు తీసుకుంటారు."

\- ఎస్వీ రాజశేఖర్ బాబు, సీపీ విజయవాడ

అరెస్టు చేసి అబద్ధాలు!

- ముంబై పోలీసులకూ తెలుసు
- 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో కాదంబరి

ఒకవైపు తనను ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టుచేయగా... మరోవైపు 'అందుబాటులో లేదు' అంటూ తాను సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసును ముంబై పోలీసులు మూసివేశారని కాదంబరి జెత్వానీ ఆరోపించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చేముందు... ముంబై విమానాశ్రయం నుంచే ఆమె 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన అరెస్టు సమయంలో బంధువులకు కానీ, న్యాయవాదులకు కానీ ఏపీ పోలీసులు సమాచారం ఇవ్వలేదన్నారు. తన అక్రమ అరెస్టు గురించి ముంబై పోలీసులకూ తెలుసని... అయినా 'అందుబాటులో లేదు' అంటూ సజ్జన్ జిందాల్‌పై .తాను పెట్టినకేసును క్లోజ్ చేశారని చెప్పారు. "ముంబై జోన్-8 డీసీపీ ఫిబ్రవరి 6న నా ఆచూకీ తెలపాలంటూ విజయవాడ సీపీకి మెయిల్ పంపారు. కానీ.. నేను ఇక్కడ లేనంటూ విజయవాడ సీపీగా ఉన్న కాంతి రాణా సమాధానమిచ్చారు" అని జెత్వానీ సంచలన ఆరోపణ చేశారు. సజ్జన్ జిందాల్ తనను రేప్ చేశారంటూ 2023 డిసెంబరులో ముంబైలోని బాంద్రాకుర్లా కాంప్లెక్స్ పోలీసు స్టేషన్‌లో కాదంబరి ఫిర్యాదు చేశారు. తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ముంబై పోలీసులు ముందుకు రాలేదు. ముంబై హైకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలు జారీ చేయడంతోనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ కేసులో జిందాల్‌ను రక్షించేందుకు అప్పటి ఏపీ సీఎం జగన్ ముందుకు వచ్చారన్నది స్పష్టమవుతోంది. ఆయన ఆదేశాల మేరకు అప్పటి సలహాదారు సజ్జల రంగంలోకి దిగి అధికారాన్ని ఉపయోగించి ఐపీఎస్‌లు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీల సహకారంతో జెత్వానీపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో తప్పుడు ఫిర్యాదు చేయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాణా.. రావా?

- మూడు రోజుల నుంచి డీజీపీ ఆఫీసుకు రాని కాంతి రాణా
- డీజీపీ ఆదేశాలు లెక్కచేయని ఐపీఎస్‌లపై శాఖాపరమైన చర్యలు
- పోలీసు శాఖ సమాయత్తం.. త్వరలో ప్రభుత్వానికి ఫైలు



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జత్వానీ వేధింపుల కేసు వ్యవహారం బయటపడ్డాక విజయవాడ మాజీ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా మూడు రోజుల నుంచి డీజీపీ ఆఫీసుకు హాజరు కావడం లేదు. అంతకుముందు ఆయన తనకు నచ్చిన సమయంలో వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. పోలీస్ బాస్ ఆదేశాలను లెక్క చేయని 'వైపీఎస్' అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీసు శాఖ సమాయత్తమవుతోంది. ఫైలు త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఐపీసీని పక్కన బెట్టి వైసీపీకి జై కొట్టిన కొందరు ఐపీఎస్ అధికారులను ఎన్నికల కమిషన్ ఆ మధ్య పక్కన బెట్టేసింది. అందులో 16 మంది ఇతరత్రా కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో ప్రతి రోజూ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చి ఉదయం పదింటికి సంతకాలు చేయాలంటూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం ఐదింటికి ఇంటికి వెళ్లే ముందు రిజిస్టర్‌లో సంతకం చేసి సమయం నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు. తమ కన్నా పైస్థాయిలో ఉన్న బాస్ ఆదేశాలను ఆ తర్వాతి బ్యాచ్ ఐపీఎస్‌లైనా, క్షేత్రస్థాయి పోలీసులైనా పాటించి తీరాల్సిందే. కానీ డీజీ ర్యాంకులో ఉన్న నిఘా విభాగం మాజీ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, అగ్నిమాపక శాఖ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్, కాంతి రాణా టాటా, డీఐజీ విశాల్ గున్నీ, ఎస్పీలు అన్బురాజన్, తిరుమలేశ్వర్ రెడ్డి, సిద్ధార్థ కౌశల్, మేరీ ప్రశాంతి, జీఆర్ రాధిక పోలీస్ బాస్ ఆదేశాల్ని లెక్కచేయడం లేదు. ఒంటిపై ఖాకీ యూనిఫామ్ వేసుకున్నా గడిచిన ఐదేళ్లూ వైసీపీ కోడ్ అమలు చేసిన ఈ ఐపీఎస్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీసు శాఖ సమాయత్తమవుతోంది. ఉన్నతాధికారి ఆదేశాలు పాటించని యూనిఫామ్ సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో.. వాటికి సామీప్యంగా ఉండేలా వైపీఎస్‌లపై చర్యలు తీసుకునేందుకు ఫైలు కదులుతోంది. ఐపీఎస్‌లపై చర్య తీసుకునే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉండటంతో డీజీపీ కార్యాలయం బంతిని ప్రభుత్వ కోర్టులోకి తోసేస్తోంది. గత ప్రభుత్వంలా కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా, తప్పును బట్టే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పీఎస్ఆర్ ఆంజనేయులు ఈ నెల 25 వరకూ, పీవీ సునీల్ కుమార్ 20 వరకూ సెలవులో ఉన్నారు. డీఐజీ విశాల్ గున్నీ మొదట్లో కొన్ని రోజులు సంతకాలు చేసినా ఈ నెల 20 నుంచి రావట్లేదు. తిరుమలేశ్వర్ రెడ్డి సుమారు నెల రోజులుగా రావట్లేదు. కేకేఎన్ అన్బురాజన్ వారం రోజులుగా డీజీపీ కార్యాలయం వైపు చూడటం లేదు. ఇలా కాకుండా కార్యాలయ పనివేళల్లో తప్పనిసరిగా ఉండాల్సిందేనని డీజీపీ ఆదేశాల్లో స్పష్టంగా ఉంది. కొల్లి రఘురామిరెడ్డి, పాలరాజు, రిశాంత్ రెడ్డి, విజయారావు, రవిశంకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా వస్తున్నా ఉదయం ఏదో ఒక టైముకు వచ్చి కాసేపట్లోనే వెళ్లిపోతున్నారు. సిద్ధార్థ కౌశల్, మేరీ ప్రశాంతి, జీ.ఆర్. రాధిక కొన్ని రోజులుగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు రాకపోవడం చర్చనీయాంశమైంది. కాగా వైజాగ్‌లో ఉన్న విశాల్ గున్నీ గురువారం సాయంత్రం విజయవాడ వచ్చారు. డీజీపీ కార్యాలయంలో హాజరయ్యేందుకు వచ్చారా లేక ముంబై నటి కేసులో విజయవాడ సీపీ ఆఫీసుకు విచారణకు వెళ్తారా అన్న విషయం తెలియరాలేదు.

ఏపీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశిస్తున్నా

- న్యాయ వ్యవస్థపై నమ్మకముంది.. వేధింపులపై అన్ని ఆధారాలూ ఉన్నాయి
- వాటిని ఏపీ పోలీసులకు అందజేస్తా.. హైదరాబాద్‌లో జెత్వానీ వ్యాఖ్యలు

శంషాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తనకు జరిగిన దారుణంపై న్యాయ వ్యవస్థ న్యాయం చేస్తుందన్న నమ్మకం పూర్తిగా ఉందని ముంబై సినీ నటి కాదంబరీ జెత్వానీ చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వేధింపుల వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో బాధితురాలు అధికారికంగా ఫిర్యాదు చేసేందుకు ముంబై నుంచి గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాత్రి 8-30 గంటలకు ముంబైలో బయలుదేరిన జెత్వానీ 9-30 గంటలకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే, ఆమె అర్ధరాత్రి దాటేంత వరకు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాలేదు. అర్ధరాత్రి 12.30 గంటలకు ఆమె శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో కొందరు తనపై అమర్యాదగా ప్రవర్తించారని అన్నారు. తనను ఏపీ పోలీసులు అనేక విధాలుగా వేధించారని, తన దగ్గర మొత్తం ఆధారాలున్నాయని అన్నారు. ఆ ఆధారాలను ఏపీ పోలీసులకు సమర్పిస్తానని చెప్పారు. తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కేరక్టర్‌ను సోషల్ మీడియా వేదికగా కించపరిచారని ఆరోపించారు. ప్రస్తుత ఏపీ ప్రభుత్వం తనకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. కొందరు సోషల్ మీడియా వేదికగా తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, తాను డబ్బుల కోసమే మాట్లాడుతున్నానంటూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని వాపోయారు. ఆ తర్వాత ఆమె పోలీసు భద్రతతో విజయవాడకు బయల్దేరి వెళ్లారు.

జల వనరుల శాఖ సలహాదారుగా కన్నయ్యనాయుడు



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల హైడ్రాలిక్ గేట్ల రూపకల్పనలో 40 ఏళ్ల అనుభవం కలిగిన కన్నయ్యనాయుడు సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర జల వనరుల శాఖ నిర్ణయించింది. దాంతో హైడ్రాలిక్ గేట్ల యాజమాన్య నిర్వహణ సలహాదారు (మెకానికల్)గా ఎన్.కన్నయ్య నాయుడును నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎ.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇలాంటివి పునరావృతం చేయొద్దు

- పులివెందుల బిల్లుల క్లియర్‌పై 'ఆంధ్రజ్యోతి' కథనానికి బాబు స్పందన

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు క్లియర్ చేసేముందు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. 'ఎంత ఉదారత 'బాబూ'' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు సీఎం స్పందించారు. పులివెందుల, కడప, చిత్తూరు, కర్నూలు కాంట్రాక్టర్ల బిల్లులకు ఆర్థిక శాఖ ప్రాధాన్యం ఇచ్చి చెల్లించడంపై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. 2014-19 మధ్యకాలంలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండగా, జగన్ హయాంలో అదీ ఎన్నికల ముందు జరిగిన పనులకు బిల్లులు చెల్లింపులు చేయడం పట్ల టీడీపీ కేడర్ భగ్గుమంది. ఈ కథనం అటు ప్రభుత్వంలోనూ, ఇటు టీడీపీ కేడర్‌లోనూ ప్రకంపనలు సృష్టించింది. దీనిపై గురువారం సీఎం చంద్రబాబు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇలాంటివి పునరావృతం కావొద్దని, పాత బిల్లులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆ బిల్లులు కేంద్రం అమలు చేసే పెట్టుబడి సాయం పథకానికి సంబంధించినవని, వీటికి యూసీలు సమర్పిస్తే కేంద్రం తిరిగి నిధులు కేటాయిస్తుందని అధికారులు చెప్పారు. ఇక నుంచి బిల్లులు క్లియర్ చేసేముందు ఆర్థిక మంత్రి దృష్టికి కూడా తీసుకురావాలని సీఎం సూచించారు.

పోలీసులు పాల్గొనడం యాదృచ్ఛికం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 29: తన భార్య జన్మదిన వేడుకల్లో పోలీసులు పాల్గొనడం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేటలో ట్రాఫిక్ సమస్యపై సమీక్షించడానికి ఆ రోజు పోలీసులను తన ఇంటికి పిలిచానని చెప్పారు. సీఐలు, ఎస్ఐలు వచ్చినప్పుడే టీడీపీ మండల నాయకులు కేక్ తీసుకొచ్చారని, అదే సమయంలో పోలీసులు అక్కడ నిలబడటం యాదృచ్ఛికమే తప్ప వారు కావాలని రాలేదని వివరించారు.

మాతృభాషను కాపాడుకుందాం

- జీవితం కోసం తెలుగు.. జీతం కోసం ఇంగ్లీషు నేర్పిస్తాం
- జీవో 77ను సమీక్షిస్తాం.. తెలుగు పండిట్లకు న్యాయం చేస్తాం
- తెలుగు భాషా దినోత్సవ సభలో చంద్రబాబు
- ఒక్క ఇంగ్లీషు పదం లేకుండా తెలుగు ఉండాలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

విజయవాడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'మాతృభాషను మరిచిపోతే జాతి కనుమరుగైపోతుంది. తెలుగు భాష విధ్వంసానికి గురికాకుండా కాపాడుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలుగు భాషను కాపాడేందుకు తాను, పవన్ కల్యాణ్‌తో పాటు అంతా కలిసి కృషి చేస్తామని చెప్పారు. జీవితం కోసం తెలుగు.. జీతం కోసం ఇంగ్లీషు నేర్పిస్తామన్నారు. 'నేను తెలుగువాడిని.. నాది ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి' అని గర్వంగా చెప్పేరోజు అతిత్వరలోనే వస్తుందన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు 161 జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 'తెలుగు కోసం జీవితాంతం పోరాడి నిలబెట్టిన గిడుగు రామ్మూర్తి పంతులుకు ప్రతి ఒక్కరూ ఘనమైన నివాళి అర్పించాలి' అని అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వాళ్లు ఇంగ్లీషు నేర్చుకుంటేనే జీవితమన్నట్టు మాట్లాడటం తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. జీవో 77తో తెలుగు పండిట్లకు అన్యాయం జరుగుతోందని డిప్యూటీ సీఎం పవన్ చెప్పారని, దీనిపై అధ్యయనంచేసి ఎవరికీ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సూర్యరాజేంద్ర 7 నిఘంటువులను పునర్ముద్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మన కళాకారులు విదేశాల్లో ప్రదర్శనలు ఇవ్వడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చర్ రిలేషన్స్ (ఐసీసీఆర్) పనిచేస్తోందని, ఆ సంస్థతో ఎంఓయూ చేసుకుంటామని చెప్పారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రాన్ని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంగీత నాటక అకాడమీ బ్రాంచిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగుజాతి వారసత్వ సంపదైన కూచిపూడి నాట్యానికి తగిన ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు తెలిపారు.

భాషపై మమకారమే నేరమైంది: పవన్

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ మన భాష మీద మక్కువ, మమకారం చూపించటమే పాపం, నేరమైపోయిందన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషను వాడుక భాషగా తీర్చిదిద్దటం కంటే ముందుగా సవర భాషకు లిపిని సృష్టించిన మహోన్నతుడన్నారు. ఆంగ్ల పదాలు లేకుండా తెలుగు మాట్లాడగలిగే పరిస్థితి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నానని చెప్పారు. మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వర రావు, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు అవార్డులు

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు వారసత్వ సంపదైన నాటక, నృత్య, కళ, సంగీతం తదితర రంగాల్లోని ప్రముఖులకు అవార్డులు ఇచ్చి, నగదు సాయం చేశారు. వీరిలో ఆచంట బాలాజీనాయుడు-నాటకం (ఎన్టీఆర్ జిల్లా), పాటిబండ్ల ఆనందరావు-సాంఘిక నాటకం (ప్రకాశం జిల్లా), వనపర్తి దుర్గారావు-తోలుబొమ్మలాట (నరసరావుపేట), ద్వారం దుర్గాప్రసాదరావు-వయోలినిస్ట్ (విజయనగరం), మల్లాది సూరిబాబు-కర్నాటక సంగీతం (ఎన్టీఆర్ జిల్లా), శారదా రామకృష్ణ-ఆంధ్ర నాట్యం (ఎన్టీఆర్ జిల్లా), ఎస్.విజయ్‌కుమార్-పెయింటర్ (గుంటూరు), కందిమళ్ళ సాంబశివరావు-రైటర్ (పల్నాడు), బొర్రా గోవర్ధన్-రైటర్ (గుంటూరు), పలమనేరు బాలాజీ-రైటర్ (చిత్తూరు), పి.సత్యనారాయణ రెడ్డి-రైటర్ (కోనసీమ), జి.లక్ష్మీ నరసయ్య-రైటర్ (కృష్ణా), చల్లపల్లి స్వరూపరాణి-రైటర్ (బాపట్ల), కేవీఎన్‌డీ వరప్రసాద్ లైబ్రరీ సెక్టార్ క్రిటిక్ (తూర్పు గోదావరి), ఎం.విజయలక్ష్మి-పద్మావతి మహిళా యూనివర్సిటీ, సాంబశివరావు-కొండపల్లి బొమ్మల కళాకారుడు (ఎన్టీఆర్ జిల్లా), అశోక్‌కుమార్ - అలకనంద ప్రచురణలు (ఎన్టీఆర్ జిల్లా), మోదుమూడి సుధాకర్-సంగీతం (ఎన్టీర్ జిల్లా)లకు అవార్డులు ఇచ్చారు.

కార్మికుల క్షేమం, సంక్షేమమే ధ్యేయం

- వారి సేఫ్టీ విషయంలో రాజీ వద్దు
- భద్రతపై థర్డ్ పార్టీ ఆడిట్ తప్పనిసరి
- ఈఎస్ఐను బలోపేతం చేయాలి: బాబు
- కార్మిక, పరిశ్రమలు, బాయిలర్స్, మెడికల్ సర్వీసెస్ శాఖలపై సమీక్ష

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'సంపదకు మూలమైన కార్మికుల క్షేమం, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కార్మిక శాఖ, పరిశ్రమలు, బాయిలర్స్, మెడికల్ సర్వీసెస్ శాఖలపై గురువారం ఉదయం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. 'కార్మికుల సంక్షేమ విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలి. సేఫ్టీ విషయంలో పరిశ్రమలు రాజీ పడకూడదు. భద్రతా ప్రమాణాలపై థర్డ్ పార్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. తనిఖీలు... భద్రత పెంచేలా, తప్పులు సరిదిద్దేలా ఉండాలి. అంతేకానీ ఆ పేరుతో పరిశ్రమల యాజమాన్యాలను వేధింపులకు గురి చేయవద్దు. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసి తర్వాత మళ్లీ సేఫ్టీ గురించి పట్టించుకోవడం లేదు. ఇలా కాకుండా నిర్దిష్ట ప్రణాళికతో భద్రత కోసం పనిచేయాలి. తనిఖీలతో పాటు థర్డ్ పార్టీ ద్వారా కూడా ఆడిట్ జరపాల్సిన అవసరం ఉంది. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలకు అనుమతుల జారీ విషయంలో పారదర్శకంగా పని చేయాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 24,642 ఫ్యాక్టరీలు రిజిస్టర్ అయ్యాయని వాటిలో 11.78 లక్షల మంది పని చేస్తున్నారని అధికారులు వివరించారు. రాష్ట్రంలో రసాయన పరిశ్రమలు పెరిగిన దృష్ట్యా భద్రతా చర్యలు పర్యవేక్షించడానికి, ప్రమాదాలు అరికట్టడానికి ముగ్గురు కెమికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఉండాలన్నారు. పరిశ్రమల్లో తనిఖీలకు అవసరమైన అధికారులను వెంటనే నియమిస్తామని ఈ మేరకు పోస్టులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

నాలుగు ఆసుపత్రులను బలోపేతం చేయాలి

మన రాష్ట్రంలో ఉన్న నాలుగు ఈఎస్ఐ ఆస్పత్రులను బలోపేతం చేయాలని సీఎం సూచించారు. 2014-19 మధ్య ఈఎస్ఐ వైద్య సేవలు పొందే వారి సంఖ్య 5 నుంచి 11 లక్షలకు పెరిగితే.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల ఈఎస్ఐ సేవలు తగ్గాయని మంత్రి వాసంశెట్టి సుభాష్, సీఎంకు వివరించారు. వైఎస్ఆర్ బీమాలో జరిగిన అక్రమాలను సీఎంకు వివరించారు. పేదలకు అందే సాయంలోనూ అక్రమాలకు పాల్పడితే ఎవరైనా ఉపేక్షించకూడదని, తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈఎస్ఐ ఆసుపత్రులకు రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.54 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెప్పగానే సీఎం స్పందించి వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. 'నాడు సహజ మరణాలకు రూ.2 లక్షలు, ప్రమాద మరణాలకు రూ.5 లక్షలు ఇచ్చాం. కానీ వైసీపీ ప్రభుత్వం సహజ మరణాలకు కేవలం రూ.1 లక్ష ఇచ్చి చేతులు దులుపుకుంది. టీడీపీ హయాంలో సహజ మరణం పొందిన 3 లక్షల మందికి రూ.3,393 కోట్లు చెల్లించగా, గత ప్రభుత్వం కేవలం 91 వేల మందికి రూ.1,025 కోట్లు మాత్రమే చెల్లించింది. చంద్రన్న బీమా కింద రూ.10 లక్షలు ఇస్తామనే ఎన్నికల హామీకి కట్టుబడి ఉన్నాం. త్వరలోనే దీన్ని అమల్లోకి తీసుకొస్తాం' అని సీఎం స్పష్టం చేశారు.

తెలుగు గొప్ప భాష: మోదీ



అమరావతి, న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు నాయకులు గురువారం సామాజిక మాధ్యమాల వేదికగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవహారిక తెలుగు భాషకు గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన విశేష సేవను పలువురు గుర్తు చేసుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో స్పందిస్తూ 'తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు. ఇది నిజంగా చాలా గొప్ప భాష, భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేసింది. తెలుగును మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్న వారందరినీ అభినందిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ... 'అమ్మ జన్మనిస్తే... మాతృ భాష తెలుగు మన జీవితాలకు వెలుగునిస్తోంది. ఇంగ్లీషు మీడియం, విదేశాల్లో చదువు వల్ల నేను మొదట్లో తెలుగులో మాట్లాడేటప్పుడు పదాలు అటు, ఇటు అయితే.. ఎంతో బాధపడే వాడిని. అచ్చమైన తెలుగులో నిత్యం జనంతో మాట్లాడుతూ ఉంటే.. మాతృభాష మాధుర్యం ఎంత గొప్పదో తెలుస్తోంది. మా అబ్బాయి దేవాన్ష్‌కి ప్రత్యేకంగా తెలుగు మాట్లాడటమే కాదు.. చదవడం, రాయటం కూడా నేర్పిస్తున్నా' అని పేర్కొన్నారు. కాగా, మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

అమ్మ భాష తెలుగును వదిలేశాం: ఎమ్మెల్యే నల్లమిల్లి

- 'తెలుగు'కు జీవంపోస్తున్నది చిరు వ్యాపారులే: కవి జొన్నవిత్తుల

అమరావతి, విజయవాడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమ్మ భాషను వదిలేసి పాశ్చాత్య సంస్కృతి వెంటపడుతున్నామని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలనలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో చేయాలని ప్రభుత్వాలు చూస్తోంటే మనం మాత్రం అంతరించిపోతున్న భాషల్లో తెలుగును ఏడో స్థానానికి తీసుకెళ్లామని వాపోయారు. ప్రముఖ సాహితీవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ... 'గత ప్రభుత్వంలో ఇక్కడ ఇంగ్లీషు చదివించి మనల్ని అమెరికా పంపుతామన్నారు. కానీ వారి పిల్లల్ని అక్కడ ఇంగ్లీషు చదివించి మనపై నాయకులుగా తెస్తున్నారు' అంటూ జగన్‌రెడ్డికి చురకలంటించారు. సమాజంలో తెలుగు భాషకు చిన్న చిన్న వ్యాపారులే జీవం పోస్తున్నారని అన్నారు.

నందమూరి హరికృష్ణ సేవలు చిరస్మరణీయం: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిండైన ఆత్మీయతకు, ఆత్మాభిమానానికి ప్రతిరూపం నందమూరి హరికృష్ణ అని ముఖ్యమంత్రి చంద్రబాబు శ్లాఘించారు. గురువారం నందమూరి హరికృష్ణ 6వ వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయనకు చంద్రబాబు ఘనంగా నివాళులర్పించారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో దివంగత నందమూరి హరికృష్ణకు ఘనంగా నివాళులర్పించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

రైల్వే వెయిట్ లిఫ్టింగ్‌లో
డివిజన్‌కు చాంపియన్‌షిప్



వన్‌టౌన్, ఆగస్టు 29: ముంబయిలో ఈనెల 24 నుంచి 28 వరకు జరిగిన ఆలిండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన వెయి ట్ లిఫ్టింగ్ జట్టు అద్భుతవిజయాన్ని సాధించింది. ఇద్దరు డివిజనల్ ఉద్యోగులు బంగారు, రజత పతకాలను సాధించారు. డివిజన్ వెయిట్‌లిఫ్టర్లతో దక్షిణ మ ధ్య రైల్వే జోన్ జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. డి విజన్‌కు చెందిన ఎలక్ట్రికల్ లోకోషెడ్ హెల్పర్ లేఖా మల్లయ్య 71 కిలోల మహి ళల విభాగంలో అద్భుత ప్రదర్శన చేసి బంగారు పతకం సాధించారు. పురుషు ల 55 కిలోల విభాగంలో డివిజన్ ఎలక్ట్రికల్ విభాగం ట్రైన్ లైటింగ్ అసిస్టెంట్ ఆకాష్ గౌడ్ సిల్వర్ మెడల్ సాధించారు. వీరికి డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందనలు తెలిపారు. డివిజన్ సీనియర్, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బీ తోకల, డివిజనల్ ఉద్యోగులు, టీమ్ మేనేజర్, ఎం. మురళీమోహన్, డివిజన్ వెయిట్ లిఫ్టర్లు విజయం సాధించటం గర్వకారణమన్నారు.

జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు
ఆత్కూరు విద్యార్థుల ఎంపిక

ఉంగుటూరు, ఆగస్టు 29: రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 25, 26న తిరుపతి జిల్లా రేణిగుంట జడ్పీ గర ల్స్ హైస్కూల్‌లో జరిగిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని ఆత్కూరు సె యింట్ ఆంథోనీస్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ క్రీడానైపుణ్యాలు ప్రదర్శించి జా తీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కుసుమ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అండర్-11 కే టగిరిలో ఎం.సజీవ్, ఎస్.యశ్వంత్, బి.దూండీగణపతి, బి.లక్ష్మి, ఎం.దేవహర్షిణి, ఏ గౌతమ్‌కుమార్, వి.ఏసుప్రియదాసు, ఎల్.రామాన్విత్, అండర్-12 కేటగిరిలో కే హన్షిత్, కే జయదీప్, వి.గౌతమ్‌సాయి. ఏ ఆశీష్, బి.మనోరంజిత్, ఎల్.మద న్, అండర్-13 కేటగిరిలో బి.భాగ్యశ్రీ, ఎస్.పూజిత, సీహెచ్ చైత్రిక, ఎం.ముక్షిత, ఎం.దిల్సన్, ఎం.మహేష్, బి.మధువరుణ్, పి.నాగూర్‌వలీ, బి.లిఖిత్, జె.విజ్వల్‌కీ ర్తన అక్టోబర్ 10న హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొని సత్తా చాటనున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాతీయ పోటీలకు సెలెక్ట్ అయిన వి ద్యార్థులతోపాటు, ఉత్తమ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీనివా సరావును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

జాతీయ క్రీడాకారులకు
గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డుల అందజేత



సత్కారం అందుకున్న క్రీడాకారులతో నిర్వాహకులు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 29: గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో స్థా నిక తాడిగడపలోని ది ఇండి యన్ అకాడమీ ఆఫ్ షూ టింగ్ అకాడమీలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా వివిధ క్రీడల్లో జాతీయస్థాయిలో సత్తాచాటిన క్రీడా కారులు, పీఈటీలు, కోచ్‌లను గురువారం ఘనంగా సత్కరించారు. అకాడమీ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారుడు తాను సాధించిన ఫలితాలకు గుర్తింపును వచ్చిన రోజున నిజమైన ఆనందాన్ని పొం దుతారన్నారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ పదేళ్ల నుంచి క్రీడాకారులను సత్కరిం చడం అభినందనీయమన్నారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్ర సాద్, ఏపీ పోలీస్ శిక్షకుడు గమిడి సాంబశివరావు మాట్లాడుతూ రాబోయే రో జుల్లో అవార్డులను విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

వచ్చేనెల 29న శతాధిక వృద్ధులకు సత్కారం

సత్యనారాయణపురం, ఆగస్టు 29: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 29న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో శతాధిక వృద్ధులకు సత్కారం నిర్వహించడం ముదావహమని మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా. చల్లా హరికుమార్, ట్రస్టీలతో కలిసి శతాధిక వృద్ధుల సత్కార పోస్టర్‌లను గురువారం ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వృద్ధులను ఆద రించడం, గౌరవించడం నేటి సమాజం ముందున్న తక్షణ కర్తవ్యంగా భావించా లన్నారు. ట్రస్ట్ చైర్మన్ డా.చల్లా హరికుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా శతా ధిక వృద్ధులను గుర్తించి వారిని ప్రముఖుల చేతుల మీదుగా సత్కరిస్తున్నామ న్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, ట్రస్టీలు తట్టి అర్జునరావు, బొండా సుజాత, సతీష్, మధుసూదనరావు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో డెంగ్యూ కిట్ల కొరత

ఉయ్యూరు, ఆగస్టు 29: ప్రభుత్వాసుపత్రుల్లో డెంగ్యూ కిట్లు లేక జ్వరాల తో బాధపడే రోగులు పరీక్షలు చేయించుకునేందుకు రోజుల తరబడి ఎదురు చూపు చూస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో టైఫాయిడ్, డెంగ్యూ, విష జ్వరాలతో బాధపడుతూ రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యఖర్చులు భరించలే క చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రోగు లకు వైద్యపరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసేందుకు డెంగ్యూ కిట్లు, ఇతర పరీక్ష లకు అవసరమైన కిట్లు అందుబాటు లేక ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి పెద్దమొత్తం లో డబ్బు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో వైద్య విధాన ప రిషత్ సీహెచ్‌సీతో పాటు మండలంలో చిన ఓగిరాల, కాటూరు ప్రాథమిక ఆరో గ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కిట్లు లేక ఎదురుచూస్తున్నా రు. దీనిపై ఉయ్యూరు వైద్యశాల సూపరింటెండెంట్ పి.మురళిని వివరణ కోర గా కిట్లయిపోయి 4 రోజులవుతుందని ఉన్నతాధికారులకు రిఫర్ చేశామన్నారు.



భరతమాత మందిరం 10వ లైన్‌లో అక్రమ కట్టడం

వినాయక్ కాలనీలో

- సింగ్‌నగర్, నందమూరి నగర్, పాయకాపురం ప్రాంతాల్లో చక్రం తిప్పుతున్న టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి
- అంతా తామై నడుపుతున్న ఇద్దరు టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు
- బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ, కమిషనర్‌కు సైతం వాటాలంటూ అడ్డగోలు వసూళ్లు



ఇందిరానాయక్‌నగర్, తోటవారి వీధిలో..

టౌన్‌ప్లానింగ్‌లో అక్రమార్కులు!

వైసీపీ హయాంలో నియమితులైన సిబ్బందితోనే ఇబ్బంది..!



భరతమాత మందిరం రోడ్డు 6వ లైన్‌లో అక్రమ కట్టడం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం ఎదురుగా అక్రమ కట్టడం

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 29: అజిత్‌సింగ్‌నగ ర్, నందమూరినగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో అక్రమకట్టడాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొ స్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉండగా కార్పొరేష న్‌కు టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలుగా వచ్చిన కొంతమంది సిబ్బంది నేరుగా టౌన్ ప్లానింగ్ అధికారులు, కమిష నర్ పేరుతో నూతన భవనాల వద్ద అక్రమ వసూ ళ్లకు తెరలేపి అడ్డగోలుగా సంపాదిస్తున్నారు. ఫలి తంగా ప్రభుత్వాదాయానికి భారీ గండి పడుతోంది.

ఏ పనికైనా జేబులు నింపాల్సిందే..!

సింగ్ నగర్, ఇందిరానాయక్ నగర్, భారతమాత మందిరం రోడ్డు, నందమూరి నగర్, ఆంధ్రప్రభ కాలనీ, వినాయక్ కాలనీ, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో నూతన భవన నిర్మాణాలు అధికంగా జరుగుతుంటాయి. గత వైసీపీ ప్రభుత్వ హయంలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో సెక్రట రీల పేరుతో కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారు. బిల్డింగ్ ప్లాన్లకు సంబంధించిన అనుమతుల పను లన్నీ వీరి చేతుల్లోనే పెట్టారు. దీన్నే అదునుగా చేసు కున్న కొంతమంది టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు ఆ విభా గంలో ఏ పని చేయాలన్నా అడిగినంతా చెల్లిస్తేనే పనులు చేయడం లేదనేది బహిరంగ రహస్యం. వీరికి వైసీపీ ప్రజాప్రతినిధులు వత్తాసు పలకడంతో బిల్డింగ్ ప్లాన్లు, అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మా ణాల వద్ద వసూళ్లు చేసే నగదులో సగభాగం వారికి ముట్టజెప్పేలా ఒప్పందాలు జరిగాయి. దీంతో కంచే చేను మేసే చందాన ప్రభుత్వాదాయాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతిని ధులే అవినీతి సిబ్బందికి వెన్నుద న్నుగా ఉండడంతో వీరి అక్రమ వసూళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

ప్రభుత్వం మారినా ఆగని దందా..!

అవినీతిని పెంచి పోషించిన వైసీపీ ప్రభుత్వం కుప్పకూలినా ఈ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అవినీతికి మాత్రం చెక్ పడడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా పుంజుకుంది. దీంతో ఇక్కడ నూతన భవన నిర్మాణాల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. చంద్రబాబు హయాంలో తమకు కష్టాలు తప్పుతాయని, అవినీతికి తావులేకుండా నిర్మా ణాలు జరుపుకోవచ్చని ఆశపడ్డ బిల్డర్లు, రియల్టర్లకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అవినీతి పోరు తప్పకపోవ డంతో తలలు పట్టుకుంటున్నారు. అన్ని అనుమతు లున్నా ప్లాన్ మంజూరు చేయడానికి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడంతో పాటుగా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలను కట్టిం చడం, అదనపు అంతస్తుల కోసం బాండ్లను పెట్టి నట్టు చూపి వాటిని అప్రూవ్ చేయకుండా భవన యజమానులతో బేరాలు మాట్లాడుకొని అడ్డదారిలో భవన నిర్మాణాలను పూర్తిచేయించేసి జేబులు నింపు కుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చక్రం తిప్పుతున్న ఆ ఇద్దరు..

సింగ్‌నగర్, పాయకాపురం పరిధిలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలలో ప్రధానంగా ఇద్దరు వ్యక్తులు వీరందరిపై చెలా'మనీ' చేస్తున్నారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు తానే 'వినయ్' విధేయుడునని చెప్పుకు తిరిగే ఓ సెక్రటరీ వీరందరికి తానే బాస్‌గా వ్యవహరి స్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. అతగాడికి చెబితే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పినట్టే అని, అందరి సెక్రటరీలకు ప్రాంతాల పరిధి ఉంటే ఇతగాడికి మాత్రం అటువంటిదేమీ లేదని సింగ్‌నగర్, పాయకా పురం పరిధిలోని అన్ని ప్రాంతాలపై కూడా ఈ సెక్ర టరీ అజమాయిషీ చేస్తుంటాడు. ఇతడికి న్యూఆర్ ఆర్‌పేటలో ఉండే ఓ 'సాంబ'డు.. నందమూరి నగర్‌లో ఉండే మరో వ్యక్తి 'ప్రదీప'మై అండగా నిలుస్తుండడంతో టౌన్‌ప్లానింగ్‌లో ఈ ముగ్గురు చక్రం తిప్పుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

ఉన్నతాధికారులకు వాటాలిస్తున్నాం..!

అక్రమ కట్టడాలు, భవన నిర్మాణ ప్లాన్‌లకు అనుమతులిచ్చే సమయంలో ఆయా భవనాల యజమానులు వీరెంత అడిగితే అంత ముట్టజె ప్పాల్సిందేనని లేదంటే ఫైల్ కదలకపోవడమో, లేదా రిజెక్ట్ చేయడమో చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు వసూళ్లు చేస్తున్న ఈ సెక్రటరీలు మాత్రం డబ్బులు మొత్తం మేం మాత్రమే తీసుకోమని ఇందు లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ, సీపీ, వీఎంసీ కమిషన ర్‌కు సైతం వాటాలివ్వాలని చెప్పి వసూళ్లు చేయడం కొసమెరుపు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, కార్పొరేష న్ ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఇన్నేళ్ల పాటు ఒకే ప్రాంతంలో పనిచేస్తూ ప్రభుత్వాదాయా నికి గండి కొడుతూ అక్రమ వసూళ్లతో అధికార దుర్వి నియోగానికి పాల్పడుతున్న సిబ్బందిని గుర్తించి చర్య లు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వన్‌టౌన్, ఆగస్టు 29: ప్రమాద రహిత సమాజానికి యువత ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల ని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సూచించారు. ఎన్టీఆర్ భవన్‌లో సుదీక్షణ్ ఫౌండేషన్, రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ సంయుక్త నిర్వహణలో గురువారం హైడ్రాలిక్ ప్రొస్తటిక్ లెగ్స్ పంపిణీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ నెల్లూరుకు చెందిన ఎం. ప్రణవిక, భద్రాద్రి కొత్తగూ డెం జిల్లాకు చెందిన వి. సాయికిరణ్, హనుమకొండకు చెందిన ఆర్. సాయికిరణ్ రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పో గా, రూ.లక్షన్నర విలువైన హైడ్రాలిక్ ప్రొస్తటిక్ లెగ్స్‌ను ఉ చితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులు, యువత అతివేగంగా వాహనాలు నడు పుతూ ప్రమాదాల బారిన పడి దివ్యాంగులుగా మారుతు న్నారని, తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కన్నీళ్లు వి గుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీక్షణ్ ఫౌండే షన్ వ్యవస్థాపకురాలు చిగురుపాటి విమల సేవలను కొని యాడి, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. వీడు రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ సంచాలకుడు ఎం.వాసు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంకే బేగ్, రాష్ట్ర నేతలు మాదిగాని గుర్నాథం, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఫౌండేషన్ మెడికల్ ఇన్‌చార్జి కె. రాము పాల్గొన్నారు.

క్రికెటర్‌కు ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్ పరామర్శ

మొగల్రాజపురం: ఇటీవల శ్రీనగర్‌లో జరిగిన బధిర అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో మోకాలికి గాయమైన ఫాస్ట్ బౌలర్ రావూరి యశ్వంత్‌ను ట్రస్టు ఆసుపత్రిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి పరామర్శించారు. అ నంతరం మాట్లాడుతూ 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసే ఒక బౌలర్ గాయంతో బాధపడి ఆపరేషన్ చేయిం



యశ్వంత్‌ను సత్కరిస్తున్న ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

చుని 4 నెలలకే మ్యాచ్ ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిల వడం సామాన్య విషయం కాదన్నారు. యశ్వంత్ గాయప డటంతో ఆయనకు చికిత్స చేసి కోలుకునేలా చేయడంతో పాటు ఆయన ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి మ్యాచ్‌లు ఆడేలా చేసిన డాక్టర్ భార్గవ్ రామ్‌కు అభినందనలు తెలి పారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ దివ్యాం గుల క్రీడల్లో రాణించేందుకు ఏ సాయమైనా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. డెఫ్ అండ్ డమ్ క్రికెట్‌లో దక్షిణ భారతదేశం నుంచి ఆడుతున్న మొదటి ఆటగాడన్నారు. అనంతరం యశ్వంత్‌ను మెమెం టో, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ చెన్ను పాటి ఉషారాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, హాస్పిటల్ సిబ్బంది, ఇతర నేతలు పాల్గొన్నారు.



పీడీఎస్‌వో ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న నేతలు

చిన్నారులు, మహిళలపై
లైంగిక దాడులు అరికట్టాలి

● పీడీఎస్‌వో ర్యాలీ

గవర్నర్‌పేట, ఆగస్టు 29: దేశవ్యాప్తంగా చిన్నారులు, మహిళలపై జరుగుతున్న హింసా త్మక, లైంగిక దాడులు, హత్యలు, ఘటనలు అరి కట్టడంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించా లని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీ డీఎస్‌వో) డిమాండ్ చేసింది. గురువారం సంస్థ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. సమావేశానికి సంస్థ రాష్ట్ర కోశాధికారి ఎల్ భాను అధ్యక్షత వ హించారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘ టన రాష్ట్ర అధ్యక్షురాలు పి. విజయ మాట్లాడు తూ మహిళలపై అత్యాచారాలు, హత్యలకు కా రణమైన మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సిని మాలు, వీడియోలు, షోలను నిషేధించాలని డి మాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్కే జిలానీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నాశనం చేస్తూ ప్రై వేట్ విద్యకు పెద్ద పీట వేస్తోందన్నారు. పీడీఎస్ వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సురేష్ మాట్లా డుతూ107, 108 జీవోలను రద్దు చేయాలని డి మాండ్ చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. భాస్కర్ మాట్లాడుతూ ఖాళీగా పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ కు ప్రభుత్వాలు యత్నించడం బాధాకరమన్నారు.

మహిళలపై దాడులకు నిరసనగా ర్యాలీ

మహిళలపై జరుగుతున్న దాడులకు, వేధిం పులకు నిరసనగా పీడీఎస్‌వో ఆధ్వర్యంలో బీ సెంట్ రోడ్డు నుంచి లెనిన్ సెంటర్ మీదుగా రై ల్వే స్టేషన్ వరకు ర్యాలీ జరిగింది. మహిళలపై హత్యాచారాలు, హత్యలు అరికట్టాలని, దోషుల ను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కో ల్‌కత్తా డాక్టర్‌పై హత్యాచారం, హత్య ఘటనపై విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ స భ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు

● రాజ్యసభ మాజీ సభ్యుడు మధు

గవర్నర్‌పేట, ఆగస్టు 29: వ్యవహారిక భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవ వల్లే నేడు అందరూ తెలుగును చదువుకునే పరిస్థితి ఏర్పడిందని మాజీ ఎంపీ, ఎంబీవీకే చైర్మన్ పి. మధు అన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఎంబీవీకే ఆధ్వ ర్యంలో గురువారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి వివిధ సంఘాల నేతలు పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పండితుల భాషను ప్రజా భాషగా మార్చిన వ్యక్తి గిడుగు అన్నారు. భాషా పండితులంతా రామ్మూర్తి కృషిని సాగనివ్వకుండా అడ్డుపడినా ఎదుర్కొని నిలబడ్డార న్నారు. గిడుగు జీవితం ప్రజా భాషాభివృద్ధికి తోడ్పడిందని, అందుకే ఇప్పటి వరకు తెలుగు భాష నిలబడిందన్నారు. తెలుగు పండితుడు వలివేటి వెంకట శివరామకృష్ణ మాట్లా డుతూ ఇప్పుడు మనందరం తెలుగులో మాట్లాడుతున్నా, చదువుకుంటున్నా అది గిడుగు గొప్పతనమేనన్నారు.



రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధు

ఆయన సిద్ధాంతాలను ముందుకు తీసుకుపోవడమే ఆయ నకిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఎంబీవీకే కార్యదర్శి పి.మురళీకృష్ణ, బాధ్యులు టి.క్రాంతి పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

● రచయిత ఉమామహేశ్వరరావు



పున్నమరాజును సత్కరిస్తున్న పట్టాభి, పవన్ చంద్, ప్రవీణ్ కుమార్

గుణదల, ఆగస్టు 29: తెలుగు భాషను పరిరక్షించుకో వాల్సిన బాధ్యత యువతపై ఉందని రచయిత పున్నమ రాజు ఉమామహేశ్వరరావు అన్నారు. నిడమానూరులోని ఢిల్లీపబ్లిక్ స్కూల్లో తెలుగు మాతృభాషా దినోత్సవ వేడుక గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రచ యిత పున్నమరాజు ఉమామహేశ్వరరావు పిడుగు లాంటి గిడుగు గురించి ఉపన్యసిస్తూ మాతృభాష విశిష్టతను వివ రించారు. రాబోయే కాలంలో తెలుగుభాషను రక్షించుకోవా ల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని గుర్తుచేశారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి మాట్లాడుతూ తెలుగు భాష తియ్యదనాన్ని విశ్వవ్యాప్తికి తెలిపిన మహనీయుడు గిడు గు రామ్మూర్తి అయితే తెలుగుజాతికి గుర్తింపు తెచ్చింది ఎన్టీ రామారావు అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి వి ద్యార్థులు పలువురు కవుల వేషధారణలతో రావడం ప్రత్యే కతను సంతరించుకుంది. అలాగే తెలుగు పద్యాలను ఆల పించడం విశేషం. సంప్రదాయ దుస్తులతో అందరినీ ఆక ట్టుకునేలా బాలికలు పట్టుపరికిణీలు, ఓణీలు ధరించడం, బాలురు పంచకట్టు, పంచకండువాతో రావడంతో అందరి దృష్టి చిన్నారులపైనే ఉంది. ముఖ్యఅతిథి పున్నమరాజు ఉమామహేశ్వరరావును పాఠశాల డైరెక్టర్లు పరిమి పవన్ చంద్, కడియాల ప్రవీణ్ కుమార్, టీడీపీ అధికార ప్రతి నిధి పట్టాభి ఘనంగా సన్మానించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ భాటియా పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ, కళాభవన్ నిర్మించుకోవాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్



మాతృభాష దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు జనార్దన్, కలిమిశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 29: ప్రజలు వ్యవహ రించే భాషకు, పుస్తకాల భాషకు మధ్య తేడాలుండకూ డదని వ్యవహారిక భాష కోసం ఉద్యమించి భాషలో విప్లవా త్మకమైన మార్పులు తెచ్చిన గిడుగు వెంకట రామ్మూర్తి చరిత్రలో నిలిచిపోయారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ అన్నారు. స్థానిక ఠాగూర్ గ్రంథాలయంలో న వ్యాంధ్ర రచయితల సంఘం, గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంస్థల ఆధ్వర్యంలో గిడుగు జయంతి వేడుకలు జరిగాయి.

ఈ వేడుకలకు నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతి థిగా హాజరైన టీడీ జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్రం విడిపో యాక తెలుగు వర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన అ వసరముందని, అందుకు సీఎం చంద్రబాబుతో చర్చలు జ రుపుతున్నామన్నారు. తెలుగు వెలుగుల కవులు, కళాకారు ల నిక్షిప్త ప్రాంగణం పేరుతో అమరావతిలో ఒక కళాభవ న్‌ను నిర్మించమని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లబో తున్నామన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని వాడవాడలా జరుపుకొనేలా కృషి చేయాలన్నారు. చంద్రబాబు వచ్చాకే కళారత్న, హంస అవార్డులు ఏర్పాటు చేసి కవులు, రచయి తలను ప్రోత్సహించారన్నారు. నవ్యాంధ్ర రచయితల సం ఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ గిడుగు రా మ్మూర్తి భాషా సేవకుడే కాదని, సవరలు, హరిజనులూ అంటరాని జనాలని అంటుండే ఆ కాలంలోనే సవర విద్యా ర్థులకు తన ఇంట్లోనే బస ఏర్పరచి, భోజనం పెట్టిన దీనజ నోద్ధారకుడన్నారు. రాజధాని ఫైల్స్ నిర్మాత కంఠంనేని రవి శంకర్ మాట్లాడుతూ కవులు, కళాకారుల కోసం ఒక బృహ త్తర కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామన్నారు. గిడుగు వార సురాలు, గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ చైర్మన్ కాంతికృష్ణ, నగర పూర్వ మేయర్ తాడి శకుంతల, సాహితీ వేత్త జల్ది విద్యాధరరావు, డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సంఘ సేవకులు కె.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గి డుగు జీవనసాఫల్య పురస్కారాలు, కళా, సాహిత్యసేవా పు రస్కారాలు అందజేశారు. తొలుత జరిగిన కవి సమ్మేళనం లో పలువురు కవులు తెలుగుభాషపై స్వీయ కవితలు చది వి సభికుల్ని అలరింపచేశారు. అతిథులు జ్యోతి వెలిగించి గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు.

తెలుగు తల్లి విగ్రహం వద్ద..

పోలవరం కోటేశ్వరరావు సాహితీ సమితి, తెలుగు కళా వాహిని సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళా క్షేత్రం వద్ద తెలుగు భాష దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. సత్తెనపల్లికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవి, బి.రవికుమార్, నడకుదురు సుజాత వర్మ, గిద్దలూరు చంద్ర, డాక్టర్ రాజశేఖర్, పెడనకు చెందిన డాక్టర్ రమేష్ దసిక, ఉయ్యూరుకు చెందిన పీవీ నాంచారయ్య నాయుడు, తెనాలికి చెందిన డాక్టర్ పెద్దింటి మోహన్, తాడేపల్లిగూ డెంకు చెందిన డాక్టర్ కుంపల్లి శ్రీనివాసరావు, యూవీ రత్నం, ప్రొఫెసర్ జేవీ చలపతిరావు, కుప్ప కృష్ణవేణి, చింత వెంకటేశ్వర్లును జ్ఞాపికలను అందజేశారు. పోలవరపు కోటే శ్వరరావు సాహిత్య సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణ రావు, కమ్ముల శేషగిరిరావు, డాక్టర్ సశ్రీ, రామతీర్థ, సింగం శెట్టి చంద్రశేఖర్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, చింతకా యల చిట్టిబాబు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు. తొలుత తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం

పెనమలూరు: సినీహీరో, హిందూపు రం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సిని మా రంగంలోకి అడుగుపెట్టి 50 వసంతా లు పూర్తయిన సందర్భంగా గురువారం టీ డీపీ నేత బొర్రా డీలేష్ నాయకత్వంలో వీ ఆర్, వీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ల వద్ద విద్యార్థులు భారీర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా డీలేష్ బాలకృష్ణ విజ యాలు, బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో జరుగుతున్న సేవలను తెలపారు. ప్రణీత్, యశ్వంత్, మోహిత్, భరద్వాజ్, అభి, వెంక ట్, పృథ్వీ, మనోజ్, సంపత్ పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను సబ్‌లీజుకు ఎలా ఇస్తారు?

- నిర్వహణ కోసం టీటీడీ మీకు లైసెన్స్ ఇచ్చింది
- ఏపీటీడీసీ తీరుపై హైకోర్టు అభ్యంతరం



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలోని క్యాంటీన్‌ను సబ్‌లీజ్‌కు ఇచ్చేందుకు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) టెండర్లు పిలవడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. క్యాంటీన్ నిర్వహణకు టీటీడీ మీకు లైసెన్స్ ఇస్తే సబ్ లీజుకు టెండర్లు ఎలా పిలుస్తారని ఏపీటీడీసీని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 4కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుమలలో టీటీడీ కేటాయించిన క్యాంటీన్‌ను మరొకరి సబ్ లీజుకు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) టెండర్లు పిలవడాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన సురవరం ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిల్ విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది పీఆర్‌కే అమరేంద్రకుమార్ వాదనలు వినిపించారు. వివరాలను కోర్టు ముందు ఉంచారు. వీటిని పరిశీలించిన ధర్మాసనం క్యాంటీన్ నిర్వహించాలని టీటీడీ లైసెన్స్ మంజూరు చేస్తే, సబ్ లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఎలా పిలిచారని ఏపీటీడీసీని ప్రశ్నించింది.

పీసా గ్రామసభలే పవర్‌ఫుల్

- కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ రమిత్ మౌర్య

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సమావేశాల కంటే పీసా చట్టం అమలు కోసం షెడ్యూల్-5 ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పీసా గ్రామసభలు అత్యంత శక్తివంతమైనవని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్(ట్రైనింగ్) రమిత్ మౌర్య అన్నారు. గురువారం విజయవాడలోని ఎస్ఐఆర్‌డీ కార్యాలయంలో పీసా చట్టం 1996పై జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్-5 ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన చట్టాలపై గిరిజనులకు సమగ్రమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు, అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ దివాన్ మైదీన్, 10 రాష్ట్రాల ప్రతినిధులు, ఎస్ఐఆర్‌డీ జాయింట్ కమిషనర్లు వరప్రసాద్, దోశిరెడ్డి, అడ్వకేట్ వల్లా త్రినాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలకు వైఎస్ఆర్ పేరు తొలగింపు

- కిడ్నీ రిసెర్చ్, కేన్సర్ కేర్ సెంటర్ల పేర్లూ మార్పు

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త మెడికల్ కాలేజీలకు డా. వైఎస్ఆర్ పేరు తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు సిద్ధమైంది. తొలి విడతలో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు పూర్తి చేసింది. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలకు వైఎస్ఆర్ పేరు పెట్టింది. కూటమి ప్రభుత్వం దీనిపై సమీక్ష చేసి వైఎస్ఆర్ పేరు తొలగించాలని నిర్ణయించింది. మెడికల్ కాలేజీలతో పాటు పలాసలోని కిడ్నీ రిసెర్చ్ సెంటర్‌కు, కడపలోని కేన్సర్ కేర్ సెంటర్‌కు కూడా వైఎస్ఆర్ పేర్లు తొలగించింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలుగానే పేర్లు కొనసాగిస్తుంది. పలాసలోని కిడ్నీ రిసెర్చ్ సెంటర్‌కు, కడపలోని కేన్సర్ కేర్ సెంటర్‌కు కూడా ప్రభుత్వం కొత్త పేర్లు నిర్ణయించనుంది.

సాధియాకి లోకేశ్ అభినందనలు

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన మంగళగిరికి చెందిన షేక్ సాధియాకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు. తన నమ్మకాన్ని నిలబెట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. మంగళగిరి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన సాధియా భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మాల్టా దేశంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాధియా ఈ ఘనత సాధించారు. కాగా పోటీలకు ముందు టీడీపీ నాయకుల ద్వారా ఆమెకు రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి లోకేశ్ అందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పెంచండి: ఆప్టా

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎక్కువ మంది టీచర్లను ఎంపిక చేయాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు కోరారు. ఈమేరకు గురువారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు.

విశాఖ-చెన్నై కారిడార్ పనులు వేగవంతం: సీఎస్

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు సంబంధించి రహదారుల విస్తరణ, పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, రహదారులు, నీటి వసతి వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనలో సత్వర చర్యలు తీసుకోవాలని పరిశ్రమలు, ఏపీఐఐసీ, ఏపీఈఆర్‌సీ, ఏపీట్రాన్స్‌కో తదితర విభాగాల అధికారులను సీఎస్ నీరబ్‌కుమార్ ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఈ కారిడార్ అభివృద్ధి ప్రోగ్రామ్‌కు సంబంధించిన 5వ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

'సాక్ష్యం అంగన్వాడీ'లకు కేంద్ర నిధులు

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాక్ష్యం అంగన్వాడీ సెంటర్ల అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి ప్రకటించారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆమె గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖకు కేంద్రం నుంచి కావాల్సిన సాయంపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అంగన్వాడీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.20 కోట్లు మంజూరు చేసిందని మంత్రికి వివరించారు. ఈ సంవత్సరం నుంచి ఏపీలోనే ఏపీ ఫుడ్స్ ఫ్యాక్టరీ పెట్టి బాలామృతం తయారు చేసుకుంటామని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు.

'ఐసిస్ స్పై' కేసులో ఎన్ఐఏ ముమ్మర దర్యాప్తు

- 7 రాష్ట్రాల్లో సోదాలు.. అదుపులో పలువురు అనుమానితులు

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఇండియన్ నేవీలో జరిగిన ఐసిస్ స్పై కేసులో ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం చేసింది. బుధవారం దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఏపీ, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, కేరళ, యూపీ, బిహార్, హరియాణాలోని అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించింది. పాకిస్థాన్ ఐసిస్‌తో కలిసి స్పై చేసినట్లు అనుమానిస్తున్న వారి ఇళ్లలో 22 సెల్‌ఫోన్లు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నంలోని ఇండియన్ నేవీలో రహస్య సమాచారం సేకరించేందుకు పాకిస్థాన్ ఐసిస్ స్పై చేసినట్లు 2021 జనవరిలో స్టేట్ ఇంటెలిజెన్స్ సెల్ గుర్తించింది. సముద్ర తీర ప్రాంతాల్లోని ఇండియన్ బోర్డర్స్‌కు సంబంధించిన సమాచారం కోసం కుట్ర జరిగినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా ఎన్ఐఏ దర్యాప్తు చేసింది. పాకిస్థాన్‌కు సమాచారం అందిస్తున్న అశోక్ సోలంకి, మన్‌మోహన్ సుందర్ పాండ, అల్విన్‌లను 2023లో ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. వీరిపై చార్జ్‌షీట్ దాఖలు చేసింది. దర్యాప్తులో భాగంగా మరోసారి దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించింది.

ర్యాగింగ్ భూతానికి బీటెక్ విద్యార్థి బలి



మైదుకూరు రూరల్, ఆగస్టు 29: కాలేజీ హాస్టల్లో సీనియర్ల ర్యాగింగ్ భూతానికి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి బలయ్యాడు. కడప జిల్లా మైదుకూరు మండలం జీవీ సత్రానికి చెందిన నంద, వసంత దంపతుల చిన్నకుమారుడు ప్రవీణ్(17) పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్ పూర్తి చేశాడు. కలికిరిలోని జేఎన్‌టీయూలో ఇటీవలే బీటెక్‌లో సెకండ్ ఇయర్‌లో చేరాడు. కాలేజీకి నాలుగు రోజులు మాత్రమే వెళ్లాడు. హాస్టల్లో ర్యాగింగ్ ఎక్కువగా ఉండటంతో భయపడి 23వ తేదీన ఇంటికి వచ్చాడు. అదే విషయం ఇంట్లో చెప్పాడు. అయితే ర్యాగింగ్ మామూలేనని, కాలేజీకి వెళ్లాలని ఇంట్లోవాళ్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ప్రవీణ్ పురుగు మందు తాగేశాడు. బుధవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు మైదుకూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన కాసేపటికే పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. అయితే అక్కడ వైద్యులు అడ్మిట్ చేసుకోలేదు. దీంతో గురువారం తెల్లవారుజామున తిరుపతి స్విమ్స్‌కు తరలించగా, కొద్దిసేపటికే ప్రాణం పోయింది. కాగా.. హాస్టల్‌లో ఐదుగురు సీనియర్ విద్యార్థులు వేధించారని, గదిలో బట్టలు విప్పి కొట్టారని చికిత్స పొందుతున్న సమయంలో చెప్పాడని తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు మైదుకూరులో ఫిర్యాదు చేశారు.

డిప్యుటేషన్‌పై వచ్చి..

బెంబేలెత్తించి..!

- గడువు పూర్తయినా అక్కడే తిష్టవేసి..
- వ్యక్తిగత పనులకూ కార్యాలయ సిబ్బందే... పైగా వేధింపులు
- ఖాతాలు, చెల్లింపుల అధికారి ఆఫీసులో హడలెత్తిస్తున్న హెచ్‌వోడీ

మంగళగిరి, ఆగస్టు 29: ఆమె ఓ హెచ్‌వోడీ. వేరే విభాగం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు. కొన్నేళ్లుగా ఆ డిప్యుటేషన్ పొడిగించుకుంటున్నారు. అయితే, ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం ఆమె డిప్యుటేషన్ పొడిగించలేదు. అయితేనేం గడువు తీరిన తర్వాత కూడా రెండు నెలలుగా ఇక్కడే జీతం డ్రా చేసుకుంటున్నారు. ఇక తన కింద స్థాయి సిబ్బందిని ఆమె పెడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. వేధింపులు తట్టుకోలేక కొందరు అనారోగ్యం పాలయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంగళగిరిలోని నిధి భవన్‌లో వున్న ఖాతాలు, చెల్లింపుల అధికారి కార్యాలయంలో హెచ్‌ఓడీగా ఉన్న అధికారిణి తీరు ఇది. ఆమె పెడుతున్న ఒత్తిడితో ఆ కార్యాలయ సిబ్బంది హడలెత్తిపోతున్నారు. 2021లో డిప్యుటేషన్‌పై వచ్చినప్పటి నుంచి ఆమె ఈ కార్యాలయంలో హెచ్‌వోడీగా కొనసాగుతున్నారు. అప్పట్లో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా వున్న ఓ ఉన్నతాధికారి సిఫారసుతో ఈమె తన మాతృశాఖ ఏపీ ట్రెజరీస్ నుంచి ఖాతాలు, చెల్లింపుల కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. అయితే, తాను గతంలో ట్రెజరీ శాఖలో ఉన్న అదనపు డైరెక్టర్ పోస్టులోకి మరో అధికారి రాకుండా ఇప్పటికీ ఆ పోస్టును ఖాళీగా ఉంచారంటే ఆమె పరపతిని అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలకు విరుద్ధంగా వేతనం...

ప్రతి ఏడాదీ డిప్యుటేషన్ ఉత్తర్వులను పొడిగించుకుంటున్న ఈ అధికారిణి ఈ ఏడాది మాత్రం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో డిప్యుటేషన్ కొనసాగింపునకు తదుపరి ఉత్తర్వులను తెచ్చుకోలేకపోయారు. గత జూన్ 11తో ఆ అధికారిణి డిప్యుటేషన్ ముగిసినప్పటికీ ఖాతాలు, చెల్లింపుల కార్యాలయంలో ఇంకా హెచ్‌ఓడీగా కొనసాగుతూనే వున్నారు. అంతే కాదు... గత రెండు నెలల జీతాన్ని కూడా ఆ కార్యాలయం పద్దు నుంచే తీసుకున్నారని సమాచారం. సిబ్బందిని ఒత్తిడిపెట్టి మరీ నిబంధనలకు విరుద్ధంగా జీతం తీసుకుంటున్నారని చెబుతున్నారు. పైగా కార్యాలయ సిబ్బందిని నిత్యం వేధించడంతోపాటు అనేక రకాలుగా ఒత్తిడికి గురి చేస్తున్నారనే విమర్శలు ఆమెపై ఉన్నాయి. ఈ అధికారిణి వేధింపులు భరించలేక, ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఉద్యోగులు అనారోగ్యం పాలయ్యారని వాపోతున్నారు.

ప్రభుత్వం మారినా అదే హవా!

ఇక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తన ఇంటి పనులకు వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఆమెపై ఉన్నాయి. ఖాతాలు, చెల్లింపుల కార్యాలయంలో ఈ అధికారిణి హెచ్‌ఓడీగా కొనసాగుతూ వుండడం వలన ఆ కార్యాలయంలో పదోన్నతుల తాలూకు చైన్‌లింక్ కదలకుండా ఉందని ఆ కార్యాలయ ఉద్యోగులు వాపోతున్నారు. పదోన్నతులు రాకపోవడం వలన తమకు ఇంక్రిమెంట్‌లు, ఇతరత్రా ప్రయోజనాల విషయంలో చాలా నష్టపోవాల్సి వస్తుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమకిక వేధింపులు తప్పుతాయని అక్కడి ఉద్యోగులు ఆశించారు. అయితే, సదరు అధికారిణి దర్జాగా ఇప్పటికీ అదే సీటులో పాతుకుపోయి వుండడాన్ని చూసి వారు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సంఘాల ఎన్నికలెలా?

జలవనరుల శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

- ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టులు 360
- ఈ నెలాఖరుకు మరో 608 ఇంజనీరింగ్ ఉద్యోగాలు ఖాళీ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అవసరమైన యంత్రాంగం లేకుండా రాష్ట్రంలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు జల వనరుల శాఖ సిద్ధం కావడం విమర్శలకు తావిస్తోంది. జల వనరుల శాఖలో భారీగా ఇంజనీరింగ్ అధికారుల కొరత ఉంది. జలవలనరుల శాఖలో ప్రస్తుతం వివిధ హోదాల్లోని 360 ఇంజనీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలాఖరుకు మరో 608 పోస్టులు ఖాళీ అవుతున్నాయి. అంటే శాఖలో ఉన్న మొత్తం 1283 పోస్టుల్లో 968 ఖాళీల అయితే.. మిగిలిన 315 మందితోనే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. ప్రస్తుతం చాలావరకు అడ్‌హాక్ పదోన్నతులతోనే నెట్టుకువస్తున్నారు. శాశ్వత పదోన్నతులను 2018లో ఇచ్చారు. ఆతర్వాత పదోన్నతులు ఇవ్వలేదు. 2019-2024లో ఇన్‌చార్జీల పేరిట దొడ్డిదోవ ప్రమోషన్లు కల్పిస్తూ వచ్చారు. ఇంజనీరింగ్ అధికారులు పదవీ విరమణ చేస్తున్నా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఖాళీలను భర్తీ చేయలేదు.

ఖాళీలతో సాగునీటి సంఘాల ఎన్నికలెలా?

జలవనరుల శాఖలో భారీగా ఏర్పడుతున్న ఖాళీలతో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడమెలా? అని ఇంజనీరింగ్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మేజర్ జలాశయాల కింద 21,060 సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. వాటికింద 1,755 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వీటిలో 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. ప్రాజెక్టు కమిటీలు 18 ఉన్నాయి. మీడియం ప్రాజెక్టుల కింద 3,192 ప్రాదేశిక నియోజకవర్గాలు, 266 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. మైనర్ నీటి వనరుల కింద 24,768 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 4,128 నీటి సంఘాలు ఉన్నాయి. మొత్తంగా 49,020 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 6,149 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 53 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ఈ సంఘాలన్నింటికీ ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజనీరింగ్ సిబ్బందికి సాధ్యం కాదు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను గ్రహించకుండా ఎన్నికలకు సిద్ధం కావడంపై విమర్శలు వస్తున్నాయి. జల వనరుల శాఖలో ఇంజనీరింగ్ అధికారులకు పదోన్నతులు ఇవ్వడంతోపాటు ఖాళీలను భర్తీ చేశాకే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు కోరుతున్నారు.

జీవో 84 రద్దు చేయండి

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జీవో 84ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ టీచర్లు చేపట్టిన నిరసన కార్యక్రమాలు గురువారం ముగిశాయి. మున్సిపల్ టీచర్లకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని టీచర్లు డిమాండ్ చేశారు. అలాగే జీవో 117ను రద్దు చేసి, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. జీవో 84 రద్దుకు అనుకూలంగా ప్రకటన చేసే ఉపాధ్యాయ సంఘాలకు తమ మద్దతు ఉంటుందని మున్సిపల్ టీచర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు.

81 నదులు భార లోహాలతో కలుషితం

- భారత్‌లోని నదీ జలాల్లో పరిమితికి మించి భార లోహాలు
- ఆర్సెనిక్, క్రోమియం, రాగి, ఇనుము, సీసం, నికెల్ గుర్తింపు
- సీడబ్ల్యూసీ తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 29: భారత్‌లోని 81 నదులు, ఉపనదుల్లోని నీటి నమూనాల్లో భార లోహాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌లో 2022 జనవరి నుంచి డిసెంబరు మధ్యకాలంలో 328 నదీ పరీవాహక పర్యవేక్షణ కేంద్రాల్లో నీటి నమూనాలను పరీక్షించగా వాటిలో 141 (43 శాతం) కేంద్రాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ భార లోహాలు ప్రమాదకర స్థాయికి మించి ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొంది. అధ్యయనంలో భాగంగా 13 రాష్ట్రాల్లోని 99 జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో 81 నదులు, ఉపనదులకు సంబంధించిన నీటి నమూనాలను పరీక్షించారు. వాటిలో ఆర్సెనిక్, కాడ్మియం, క్రోమియం, రాగి, ఇనుము, సీసం, పాదరసం, నికెల్ వంటి భార లోహాలు సురక్షిత పరిమితికి మించి ఉన్నాయని గుర్తించారు. యమునా నదిలో సేకరించిన శాంపిల్స్‌లో పాదరసం స్థాయిలు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అనుమతించిన పరిమితి కంటే తొమ్మిది రెట్లు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. 9 నదులు, ఉపనదులపై ఉన్న 17 కేంద్రాల్లో ఆర్సెనిక్ మాత్రమే అధికంగా ఉన్నట్టు గుర్తించారు. వీటిలో 13 కేంద్రాలు గంగా, గోమతి నదులపై ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని 17 నదులు, ఉపనదుల పరీవాహక ప్రాంతాల్లోని 13 కేంద్రాల్లో పరీక్షించిన నీటి నమూనాల్లో సీసం పరిమితికి వింంచి ఉన్నట్టు కనుగొన్నారు. గంగానది ఉపనది భగీరథి నీటి నమూనాల్లో ఆర్సెనిక్, సీసం, ఇనుము పరిమితికి మించి లభించాయి. కర్ణాటకలోని కేంద్రంలో తుంగభద్ర నమూనాల్లో క్రోవింయం, పాదరసం, సీసం సురక్షిత స్థాయికి మించి ఉన్నాయి. గంగానదిలో ఆర్సెనిక్, సీసం, ఇనుము, రాగి వంటి భార లోహాలు అధిక స్థాయిలో ఉన్నాయి. మానవ కార్యకలాపాల కారణంగా నదీ జలాలు విషపూరిత లోహాలతో కలుషితమవుతున్నాయని, దీనివల్ల జీవ, జంతుజాలానికి గణనీయమైన ముప్పు పొంచి ఉందని సీడబ్ల్యూసీ చైర్మన్ కుష్విందర్ వోహ్రా ఈ నివేదికలో పేర్కొన్నారు.

మంత్రులు రెండు నెలలు

జీతాలు తీసుకోరు

- ఎమ్మెల్యేలూ ఇదే పని చేయాలి
- అసెంబ్లీలో హిమాచల్ సీఎం వినతి
- బీజేపీ వాకౌట్..ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం

సిమ్లా, ఆగస్టు 29: హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అందరు మంత్రులు, చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీలు, కేబినెట్ ర్యాంక్ హోదా ఉన్న నాయకులను రెండు నెలల పాటు జీతాలు, టీఏ, డీఏ వంటి భత్యాలు తీసుకోరని రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సుక్కు తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే వరకు రెండు నెలల పాటు జీతాలు, భత్యాలు తీసుకోకూడదని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇది చిన్నమొత్తమే కావచ్చని, కానీ ఒక మంచి సందేశాన్ని పంపించేదని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా ఈ మార్గాన్ని అనుసరించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటన చేసిన అనంతరం మాజీ సీఎం జైరాం ఠాకూర్ ఆధ్వర్యంలో బీజేపీ సభ నుంచి వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ "రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నందున జీతాలు తీసుకోవడాన్ని వారు వాయిదా వేశారు. రాజ్యాంగం అనుమతించకపోయినా చీఫ్ పార్లమెంటరీ కార్యదర్శులను నియమించారు. చాలా మందికి కేబినెట్ హోదా, చైర్మన్ హోదా ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పుడేమో జీతాలు తీసుకోవద్దని ఎమ్మెల్యేలను అడుగుతున్నారు. సమస్యలకు ఇది పరిష్కారం కాదు" అని అన్నారు.

మా భూములు

కబ్జా చేశారయ్యా!

- జగన్ సెక్యూరిటీ సిబ్బందిపై బాధితుడి ఫిర్యాదు
- వైసీపీ పాలనలో భూకబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ
- టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరించిన మంత్రి కొండపల్లి



టీడీపీ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎదుట సమస్యలు చెప్పుకొని రోదిస్తున్న మహిళ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బంది నేలపూడి సురేష్ తన పొలాన్ని కబ్జా చేశాడని ఏలూరు జిల్లా కలిదిండి మండలం సంతోషపురం పంచాయతీలోని నరసింహపురం గ్రామానికి చెందిన అంకాల భోగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, పార్టీ నేత నరసింహ ప్రసాద్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయన పేరు చెప్పి నేలపూడి సురేష్ తనపై దౌర్జన్యం చేసి ఖాళీ పేపర్లపై సంతకాలు పెట్టించుకొని భూమి లాక్కొన్నాడని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు భోగేశ్వరరావు వివరించారు. తన భూమి తనకు తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు. అలాగే, టూరిజం పోలీస్ సెక్యూరిటీ పోస్టుల కోసం గత జగన్ ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేస్తున్నట్లు హడావుడి చేసిందని, ఆ డబ్బులు ఏమయ్యాయో ఎవరికీ తెలియడం లేదని విశాఖకు చెందిన షణ్ముఖ పవన్ ఫిర్యాదు చేశారు. రీ సర్వే పేరుతో తమ భూములను తహసీల్దార్ మరొకరి పేరు మీదకు మార్చారని, ఆ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించి తన భూమిని తనకు ఇప్పించాలని అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం మజరా బొంతలవారిపల్లి గ్రామానికి చెందిన బొంతా నరసింహారెడ్డి కోరారు. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్తవాడ పంచాయతీ వడ్డిపాలెం గ్రామంలో వైసీపీ నాయకుడొకరు రెండు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి జామాయిల్ సాగు చేస్తున్నాడని, అతని చెర నుంచి ఆ భూమిని విడిపించాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. తనకు ఇవ్వాల్సిన డబ్బుల గురించి అడిగితే ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేరు చెప్పి తనపై అక్రమ కేసులు పెట్టించిన కొల్లు నరసింహారెడ్డిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు నగరానికి చెందిన ఇరగల శ్రీనివాస రెడ్డి కోరారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం రాయవరం గ్రామంలో దేవదాయ శాఖ భూమిని తాను లీజుకు తీసుకొంటే వైసీపీ నేత తురక కిషోర్ తనను బెదిరించి ఆ భూమిని ఇవ్వకుండా చేశారని, తనకు ఆ లీజు ఇప్పించాలని ఉప్పుతోళ్ళ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం శ్రోత్రియం జగడం వారి పల్లి గ్రామంలో తమ భూమిని తహసీల్దార్ మరొకరి పేరు మీదకు మార్చారని బొంతలవారిపల్లికి చెందిన గూడె పాపిరెడ్డి ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం కనుముల చెరువు గ్రామంలో తనకు అంగన్‌వాడీ పోస్టును ఇంటర్వ్యూ ఆధారంగా ఇస్తే వైసీపీ నాయకుడు తమ్మినేని ఆదిరెడ్డి తనను జుట్టు పట్టుకొని కొట్టి ఆ పోస్టును తన భార్యకు ఇప్పించుకొన్నాడని కేతావత్ కుమారిబాయి ఫిర్యాదుచేశారు. దళితులమైన తమకు 1987లో ప్రభుత్వం ఇచ్చిన భూములు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో తమ పేరు మీద ఎక్కలేదని, దీంతో తమకు పథకాలు వర్తించడం లేదని అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఆకేపాడు గ్రామ దళితులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

సజ్జల నా భూమిని కొట్టేశారు

- అడిగితే చంపేస్తామంటున్నారు.. జనవాణిలో ఫిర్యాదు

వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు తన భూమిని కబ్జా చేశారని కడప జిల్లా చింతకొమ్మదిన్నెకు చెందిన బుక్క రాజానాయక్ జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో గురువారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వినతులు స్వీకరించారు. '20 ఏళ్ల క్రితం డీకేటీ పట్టా కింద ప్రభుత్వం మాకు కేటాయించిన 5 ఎకరాల 14 సెంట్ల భూమిని సజ్జల ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు. భూమి అడిగితే రేటు కడతామంటున్నారు. మాట్లాడితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే సజ్జల భూమి పక్కన నీ భూమి ఉండడమే అదృష్టమని అంటున్నారు. అయిన కాడికి అమ్ముకుపొమ్మంటున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా, స్పందనలో ఏడుసార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. సజ్జల, ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉంది. నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి' అని రాజానాయక్ విన్నవించారు. దీంతో మంత్రి కందుల దుర్గేష్ కడప జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి రాజునాయక్ అర్జీ వివరాలు తెలిపారు. రాజమండ్రికి చెందిన వైసీపీ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మీ, నక్కా నీలకంఠరెడ్డి అనే ఓ మధ్యవర్తితో కలిసి శ్రీకాకుళం జిల్లా రాజాంలోని 600 గజాల భూమిని ఆక్రమించారని, తప్పుడు పత్రాలు సృష్టించి మరొకరికి అమ్మేశారని రాజమండ్రికి చెందిన వృద్ధుడు ఫిర్యాదు చేశారు. దీనిపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి బాధితుడికి తక్షణం న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

పేదల ఇళ్ల పేరుతో కోట్లు కొట్టేసిన బాలినేని

- కోర్టు వివాదంలోని స్థలం పేదలకు ఇవ్వాలని నిర్ణయం
- చదును చేసేందుకంటూ రూ.40 కోట్లు స్వాహా
- ముఖ్యమంత్రికి జనసేన నేత రియాజ్ ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత ఒంగోలు కార్పొరేషన్‌లో అవినీతి పెరిగిపోయిందని జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. గురువారం సచివాలయంలో ఆయన సీఎంను కలిశారు. ఒంగోలు నియోజకవర్గంలో 25 వేల మంది పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి అంటూ ఒంగోలు సమీప కొణిజేడు, ఎరజెర్ల గ్రామాల్లో ఉన్న 660 ఎకరాల ప్రభుత్వ భూమిని చదును చేసేందుకు గత ప్రభుత్వం నుంచి బాలినేని రూ.40 కోట్లు తీసుకున్నారని రియాజ్ వివరించారు. అయితే, ఆ స్థలంలో ఐరన్ ఓర్ తవ్వకోడానికి జింపెక్స్ కంపెనీకి అప్పటికే అనుమతులు వచ్చాయని తెలిపారు. ఐరన్ ఓర్ ప్లాంట్ వల్ల ఆ ప్రాంతంలో వ్యవసాయం దెబ్బతింటుందని స్థానికులు కోర్టును ఆశ్రయించారని వివరించారు. ఆ స్థల వివాదం కోర్టులో ఉన్నప్పటికీ చదును చేసేందుకంటూ రూ.40 కోట్లను ప్రభుత్వం నుంచి బాలినేని కాజేశారని, అలాగే, ఆ భూమి నుంచి రూ.65 కోట్ల విలువైన మట్టిని తన వియ్యంకుడు భాస్కరరెడ్డి నిర్మిస్తున్న శ్రీకరి విల్లాస్‌కు తరలించుకున్నారని ఫిర్యాదు చేశారు. బాలినేనిని ప్రాసిక్యూట్ చేసి, ప్రజాధనాన్ని వెనక్కి రాబట్టాలని కోరారు. స్పందించిన సీఎం చంద్రబాబు వెంటనే విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.



కెంపు



అశోక్



వెంకటరమణ

విషాద యాత్ర!

- ఆగివున్న వ్యానును ఢీకొన్న కారు .. నలుగురి మృతి
- మరో నలుగురికి గాయాలు... మృతుల్లో తండ్రి, కుమారుడు, అల్లుడు

భూత్పూర్, సైదాబాద్, కేతేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రేడియం స్టిక్కర్లు గానీ, పార్కింగ్ లైట్లు గానీ లేకుండా రోడ్డుపై ఆగివున్న ఆ వ్యాను తీర్థయాత్ర ముగించుకొని కారులో తిరుగు ప్రయాణమైన వారి పాలిట మృత్యువై నిరీక్షించింది! మరో గంటలో ఇంటికి చేరుకుంటారనగా వారు ప్రయాణిస్తున్న కారు ఆ ఆగివున్న వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ వేగానికి కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో నలుగురు మృతిచెందారు. మృతుల్లో తండ్రి, కుమారుడు, అల్లుడు.. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురున్నారు. మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామ స్టేజీ వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ మాదన్నపేటకు చెందిన ఉర్సుల కెంపురావు (75) రిటైర్డ్ ఉద్యోగి. ఆయన కుమారుడు ఉర్సుల వెంకట్ యాదవ్ (43), భార్య, కుమారుడితో కలిసి లండన్‌లో స్థిరపడ్డాడు. పది రోజుల క్రితం ఒక్కడే లండన్ నుంచి హైదరాబాద్‌కొచ్చాడు. తండ్రి కెంపు రావు, తల్లి సువర్ణ, అక్కా, బావలు అశోక్ యాదవ్, అంబిక.. ఈ దంపతుల కుమారుడు గోవింద్, కూతురు అక్షిత, బడంగ్‌పేటకు చెందిన బాల్య స్నేహితుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి గోనె వెంకటరమణ (43)తో కలిసి మూడు రోజుల క్రితం వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం కారులో తిరుపతి బయలుదేరాడు. దర్శనం అయ్యాక వీరంతా బుధవారం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయణమయ్యారు. గురువారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న కారు.. తాటికొండ గ్రామ శివారులోని పోల్కంపల్లి స్టేజీ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న వ్యానును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న అశోక్ యాదవ్, గోనె వెంకట రమణ, కెంపురావు అక్కడికక్కడే మృతిచెందారు. అక్షిత, అంబిక, సువర్ణ, వెంకట్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతూ వెంకట్ యాదవ్ మృతి చెందాడు.

వైసీపీ భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి

- రెవెన్యూ మంత్రి అనగానికి సీపీఐ రామకృష్ణ విజ్ఞప్తి

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వేలాది ఎకరాల భూములను వైసీపీ నేతలు అన్యాక్రాంతం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి జిల్లాల వారీగా భూకబ్జాల వివరాలను వివరించారు. వాటిపై బాధితుల నుంచి వచ్చిన 1,600 అర్జీలను కూడా మంత్రికి అందజేశారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ బుధవారం విజయవాడలో భూ బాధితుల సదస్సు నిర్వహించామని, అందులో వచ్చిన అర్జీలను మంత్రికి అందజేశామన్నారు. అన్ని ఫిర్యాదులపైనా విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వండి

- హైకోర్టులో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిల్

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఈ పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవానికి ఆర్థిక సహాయం, ఇతర అవసరమైన సహకారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకువచ్చేవారికి పన్ను విరామం, సహాయింపులు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి, కేంద్ర హోంశాఖ, ఆర్థికశాఖ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీతిఆయోగ్ చైర్మన్‌తోపాటు వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీని ప్రతివాదులుగా చేర్చారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 30 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co



ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత

- గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోమ్ సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలంటే ఒకటో తరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 30
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో బీవీఎస్సీ & ఏహెచ్



ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **సీట్లు మిగిలిన పక్షంలో మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 10
- **మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 25
- **పేమెంట్ సీట్లు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 25
- **పేమెంట్ సీట్లు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు కౌన్సెలింగ్:** నవంబరు 6
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

ఇఫ్లూలో సంస్కృతం కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)- 'ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ శాన్‌స్క్రిట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి 50 గంటలు. తరగతులు సెప్టెంబరులో ప్రారంభమవుతాయి. బుధవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.


కోర్సు వివరాలు: కోర్సులో భాగంగా సంస్కృత భాషకు సంబంధించి వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం నేర్పిస్తారు. ప్రాథమిక వ్యాకరణం, పదాలు, వాక్యాల నిర్మాణం తదితరాలకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత: పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులకైతే ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. వీరికి వీసా, రెసిడెంట్ పర్మిట్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.3,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** ఎస్ఎఫ్‌సీఏఆర్ ఆఫీస్, రూమ్ నెం.29, గ్రౌండ్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇఫ్లూ, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

జాబ్ కార్నర్



ఐఓబీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 550

చెన్నైలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ ఆఫీస్ దేశవ్యాప్తంగా ఐఓబీ శాఖల్లో 550 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీల వివరాలు

అప్రెంటిస్: 550(యూఆర్-284, ఎస్సీ-78, ఎస్టీ-26, ఓబీసీ- 118, ఈడబ్ల్యూఎస్-44)

ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 29 ఖాళీలున్నాయి.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం.

స్టయిఫండ్: నెలకు మెట్రో ప్రాంతానికి రూ.15,000; అర్బన్ ప్రాంతానికి రూ.12,000; సెమీ అర్బన్/ రూరల్ ప్రాంతానికి రూ.10,000.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్) సబ్జెక్టులు: జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు - 25 మార్కులు), జనరల్ ఇంగ్లీష్(25 ప్రశ్నలు - 25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు - 25 మారుడ్, కంప్యూటర్/ సబ్జెక్ట్ నాలెడ్జ్(25 ప్రశ్నలు - 25 మార్కులు).

పరీక్ష సమయం: 90 నిమిషాలు


దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.800. ఎస్సీ/ ఎస్టీ/ మహిళా అభ్యర్థులకు రూ.600. దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్‌కు చివరి తేదీ: సెప్టెంబరు 10

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 22

వెబ్‌సైట్: www.iob.in/Careers

నిట్ వరంగల్‌లో ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ ఉద్యోగాలు



వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నది.

ఖాళీల సంఖ్య: 4

పోస్టులు

- విజిటింగ్ కన్సల్టెంట్(లీగల్ అడ్వయిజర్): 1
- ఫైర్ సేఫ్టీ ఆఫీసర్: 1
- విజిటింగ్ కన్సల్టెంట్(ఆర్కిటెక్ట్): 1
- ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్: 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/ బీటెక్, బీఆర్క్, పీజీ, విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుకు హైకోర్టులో మూడేళ్లపాటు అడ్వకేట్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: నెలకు విజిటింగ్ కన్సల్టెంట్‌కు రూ.50,000; ఫైర్ సేఫ్టీ ఆఫీసర్‌కు రూ.70,000 విజిటింగ్ కన్సల్టెంట్‌కు ప్రతి విజిటింగ్‌కు రూ.5,000; ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు రూ.60,000.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూల ఆధారంగా.

దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: https://nitw.ac.in/

పీడీఐఎల్‌లో డిప్లొమా, డిగ్రీ ఇంజనీర్లు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పీడీఐఎల్ కార్యాలయాలు/ ప్రాజెక్ట్ సైట్‌లో కింది విభాగాల్లో 57 ఇంజనీర్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైనవారు సెప్టెంబరు 11 తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీలు

1. డిప్లొమా ఇంజనీర్: **4 పోస్టులు**
2. డిగ్రీ ఇంజనీర్: **53 పోస్టులు**

విభాగాలు: ఫైర్/ ఇండస్ట్రియల్ సేఫ్టీ, సివిల్(కన్‌స్ట్రక్షన్), ఎలక్ట్రికల్(కన్‌స్ట్రక్షన్), ఇన్‌స్పెక్షన్(ఎలక్ట్రికల్), ఇన్‌స్పెక్షన్(సివిల్), ఇన్‌స్పెక్షన్(మెకానికల్), ఇన్‌స్ట్రుమెంటేషన్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(మెషినరీ).

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్(సైన్స్ సబ్జెక్టులు), ఇంజనీరింగ్ డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 11

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తేదీలు: అక్టోబరు మొదటి లేదా రెండోవారం.

వేదిక: పీడీఐఎల్ భవన్, నోయిడా.

వెబ్‌సైట్: https://www.pdilin.com/

లిటిల్స్




పులి గోరు

కృష్ణా పురంలో ఉండే కేశవానంద అనేస్వామీజీ వద్దకు రమణ అనే యువకుడు వచ్చి, స్వామీ, నాకు కోపం చాలా ఎక్కువగా వస్తుంది. దాని వల్ల అందరితో గొడవలు పడుతున్నాను . ఎవరిని చూసినా చిరాకుగా ఉంటుంది నాకు ఏదైనా ఉపాయం చెప్పండి అని అడిగాడు. దానికి ఆ స్వామీజీ నాయనా నీ కోపం చిరాకు తగ్గాలి అంటే నువ్వు అసలైన పులి గోరు మెడలో వేసుకోవాలి. పక్కనున్న అడవిలో ఒక పులి ఉంది దాని వద్దకు వెళ్లి నా పేరు చెప్పు నీకు గోరు ఇచ్చి పంపుతుంది. అన్నాడు సరే అని రమణ అడవికి వెళ్లి ఒక బక్కచిక్కిన ముసలి పులిని కలిసి, కేశవానంద స్వామి పేరు చెప్పి, తనకు గోరు కావాలని అడిగాడు. దానికి ఆ పులి, నాకు ముసలితనం వచ్చి, చూపు సరిగా ఆనడంలేదు. నువ్వు నాకు రోజూ ఆహారం తెచ్చిస్తే నీకు గోరు ఇస్తాను ఎఅన్నది దానికి సరేనన్న రమణ ప్రతిరోజూ మాంసం, చేపలు తీసుకెళ్లి పులికి ఇచ్చేవాడు.

కొన్ని రోజుల తర్వాత ఆ పులి ఇక నేడో రేపో నేను చనిపోతాను. నేను చనిపోగానే నా గోళ్లు నువ్వు తీసుకెళ్లవచ్చు అని అదే రోజున ఆ పులి చనిపోయింది. పులి చనిపోవడం చూసి, చాలా బాధ పడిన రమణ స్వామీజీ వద్దకు వచ్చి, దుఃఖ పడ్డాడు అది చూపిన స్వామీజీ 'ఇపుడు చనిపోయిన పులి మీద ఎంత జాలి, ప్రేమ చూపిస్తున్నావో, అదే ప్రేమ నీతోటి మనుషుల మీద కూడా చూపించు. నీ కోపం, చిరాకు ఇట్టే తగ్గుతాయి' అని చెప్పాడు ఆ రోజు నుండి రమణ చుట్టూ ఉన్న అందరిలో మంచిని చూడసాగాడు. త్వరలోనే అతనికి చీటికి మాటికి కోపం రావడం అనే సమస్య తగ్గిపోయింది.

10 తేడాలను కనుక్కోండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 397

					5		4	6
	1				8			
		5		1				7
	7					9		4
1			5		2			8
4		2					5	
7				5		8		
			3				7	
9	8		6					

సుడోకు - 396 సమాధానం

8	2	7	9	3	5	1	4	6
6	1	4	7	2	8	3	9	5
3	9	5	4	1	6	2	8	7
5	7	8	1	6	3	9	2	4
1	6	9	5	4	2	7	3	8
4	3	2	8	9	7	6	5	1
7	4	1	2	5	9	8	6	3
2	5	6	3	8	1	4	7	9
9	8	3	6	7	4	5	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.